Pubilshed from Eluru

PRGI NO : APTEL/25/A1219

ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com



ఏలూరు ELURU | సంపుటి : 03 | సంచిక : 12 | శుక్రవారం | నవంబర్ 13, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ
Vol.No : 03 | Issue No : 12 | Friday | 13 November 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-
Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



అభివృద్ధిలో మోదీ-బాబుది 'ఆర్ఆర్ఆర్' జోడీ..

- సీఎం చంద్రబాబుపై గోయెల్ ప్రశంసల వర్షం
- సీఐఐ సదస్సులకు విశాఖపట్నం శాశ్వత వేదికగా ఉంటుందని పీయూష్ గోయెల్ ప్రకటన
- అభివృద్ధి కోసం మోదీ, చంద్రబాబు 'ఆర్ఆర్ఆర్'లోని నీరు, నిప్పులా పనిచేస్తున్నారని కితాబు
- చంద్రబాబుది 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానం అని కేంద్రమంత్రి ప్రశంస

వివరాలు 2లో..

పెట్టుబడుల సాధనలోనే కాదు..



గ్రౌండింగ్‌లోనూ వేగమే మా లక్ష్యం

- జాతీయ స్థాయిలో పెట్టుబడుల భద్రతా చట్టం చేయాలి
- వికేంద్రీకరణ ప్రణాళికలతో ప్రాంతాల వారీగా అభివృద్ధి
- భవిష్యత్ రంగాలకు ప్రాధాన్యమిస్తున్నాం
- ప్రధాని జన విశ్వాస్ పిలుపునకు అనుగుణంగా ఏపీలో పాలన
- నరేంద్ర మోదీ ద్వారానే వాటర్ గ్రిడ్ కల సాకారం
- సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- కేంద్రమంత్రి పీయూష్ గోయల్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో కలిసి ఏపీ పెవిలియన్ ప్రారంభించిన సీఎం

ప్రజాభూమి ప్రతినిధి,విశాఖపట్నం :

వేగవంతమైన అభివృద్ధికి జాతీయ స్థాయిలో పెట్టుబడుల భద్రతా చట్టం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్రాన్ని కోరారు. రెండు రోజుల 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సును కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి సీఎం చంద్రబాబు ప్రారంభించారు. విశాఖపట్నంలో గురువారం ప్రారంభమైన సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరైన వివిధ దేశాల పారిశ్రామిక ప్రతినిధులు, రాయబారులు, ప్రభుత్వ ప్రతినిధులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. కొన్ని కీలక ప్రతిపాదనలు చేశారు. అలాగే రాష్ట్రంలో వివిధ రంగాల్లో జరుగుతోన్న అభివృద్ధిని పారిశ్రామికవేత్తలకు వివరించారు. పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి తెలియజేశారు. ఏయే ప్రాంతాల్లో ఏయే రంగాలకు చెందిన పెట్టుబడులకు అవకాశం ఉందో ప్రజెంట్ చేశారు. దీంతో పాటు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పట్నుంచి జరిగిన ప్రగతిని సీఎం వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు పెట్టుబడుల భద్రతకు సంబంధించి కీలక ప్రతిపాదనలు చేశారు.

పెట్టుబడులు పెట్టే పారిశ్రామిక వేత్తల్లో నమ్మకం, ఉత్సాహం కల్పించేందుకు పారిశ్రామిక రాయితీలకు సంబంధించి ఎన్క్రో ఖాతాను తెరుస్తున్నామని చెప్పారు. దీంతో పాటు పెట్టుబడుల రక్షణ చట్టం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. రాష్ట్రస్థాయిలో పెట్టుబడుల చట్టం చేసి కేంద్రానికి పంపుతామని... దాన్ని కేంద్రం ఆమోదించాలని కోరారు. జాతీయ స్థాయిలో కూడా పెట్టుబడుల భద్రతా చట్టాన్ని చేస్తే భారతదేశ అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని సీఎం అభిప్రాయపడ్డారు.

2 లో..

మంత్రి లోకేష్ సమక్షంలో తొలిరోజు పెట్టుబడుల ప్రవాహం



- రూ. 1,57,607 కోట్ల విలువైన 35 అవగాహనా ఒప్పందాలు
- ఈ పెట్టుబడుల ద్వారా 52,956 ఉద్యోగావకాశాలు

ప్రజాభూమి ప్రతినిధి,విశాఖపట్నం :

విశాఖపట్నం సీఐఐ 31వ భాగస్వామ్య సదస్సు తొలిరోజు రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తాయి. రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఇన్వెస్టర్లు పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారు. 30 ఎంఓయులు, 5 జీఓల ద్వారా రూ. 1,57,607 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఎపి ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలోని యువతకు 52,956 ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రానున్నాయి. రెన్యువబుల్ ఎనర్జీ, ఇన్ ఫ్రా, ఏరోస్పేస్, హెల్త్ కేర్, టూరిజం రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. మెగా ఇంజనీరింగ్ సంస్థ 3 ఎంఓయుల ద్వారా రూ.39,400 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందాల ద్వారా 12,940 ఉద్యోగావకాశాలు రానున్నాయి. రష్మీ మెటలర్జికల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.18,500 కోట్లు, క్లీన్ మ్యాక్స్

2 పేజీలో..

నేపాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

లోయలో వాహనం పడి 10 మంది దుర్మరణం



ఖాట్మండు : నేపాల్‌లోని బాగ్మతి ప్రావిన్స్ లో గురువారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 10 మంది మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మక్వాన్‌పూర్ జిల్లాలోని పర్వత ప్రాంతంలో ఉదయం 5:45 గంటల ప్రాంతంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

- మిగతా 2లో..

ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలి



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ :

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతల పరిరక్షణ, పటిష్టమైన పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

- శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యత
- నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల్లో సీసీటీవీ నిఘా తప్పనిసరి
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయంతో పనిచేయాలి: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ

గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ మాట్లాడుతూ.. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో సమస్యాత్మక జిల్లాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న సందర్భాలు ఉన్నాయని, సుప్రీంకోర్టు జోక్యం, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లతో ఎన్నికల నిర్వహణలో గణనీయమైన మార్పులు వచ్చాయని తెలిపారు. ఇటీవల నిర్వహించిన

వివరాలు 2లో..



పంజాబ్‌లో ఘోర బస్సు ప్రమాదం

- ముగ్గురు మృతి
- 25 మందికి గాయాలు

పంజాబ్: పంజాబ్‌లోని సంగ్రూర్ జిల్లాలో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. సంగ్రూర్ నుంచి ధూరి మీదుగా చండీగఢ్‌కు వెళ్తున్న బస్సు ఓవర్‌బ్రిడ్జి సమీపంలో అదుపుతప్పి కందకంలో పడిపోయింది.

2 పేజీలో..

వైయస్సార్‌సీపీలో చేరికలు



- పలువురు నేతలు భేటీ..
- కాకినాడ మేయర్ ఎన్నికల్లో వైయస్సార్‌సీపీ అభ్యర్థిగా కాద సత్యశ్రీ





ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి :

కాకినాడకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కాద వెంకటరమణ తన కుటుంబ సభ్యులతో సహా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పిన మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్, పార్టీలోకి ఆహ్వానించారు. డాక్టర్ కాద వెంకటరమణ సతీమణి కాద సత్యశ్రీ వైయస్సార్‌సీపీ అభ్యర్థిగా కాకినాడ మేయర్ పదవికి పోటీ చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో వారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరగా, పారీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అలాగే ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్‌గా పెదబయలు జడ్పీటీసీ వంతల శాంతి (ఎస్టీ కోదు సామాజిక వర్గం), వైస్ ఛైర్ పర్సన్‌గా పాడేరు జడ్పీటీసీ సీదరి రాంబాబు (కొండదొర సామాజికవర్గం)ను అధికారికంగా వైయస్ జగన్.ప్రకటించారు. అన్ని సామాజికవర్గాలకు సమన్యాయం చేయాలనే ఉద్దేశంతో ఈ ఎంపిక జరిగినట్లు వెల్లడించిన వైఎస్సార్‌సీపీ అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం. కాగా, ఈ కార్యక్రమంలో వంతల శాంతి, సీదరి రాంబాబు, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంతో పాటు, ఎంపీ గుమ్మ తనూజారాణి, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ కుంభా రవి, పాడేరు ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.అదే సందర్భంగా నాయుడుపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన తంబిరెడ్డి రాజేశ్వరమ్మ, మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు.

2 పేజీలో..



మంత్రి లోకేష్ సమక్షంలో తొలిరోజు పెట్టుబడుల ప్రవాహం

ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో రూ.41వేల కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చాయి. యునైటెడ్ టెలికం లిమిటెడ్ రూ.9,053 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు రాష్ట్రప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది.

వైయస్సార్‌సీపీలో చేరికలు.

కుటుంబ సభ్యులతో సహా, పార్టీ కేంద్ర కార్యాలయంలో వైయస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆమె, నాయుడుపేటలో మున్సిపల్ ఎన్నికలు జరిగిన తీరు, ఆ తర్వాత కౌంటింగ్ కేంద్రంలో పరిణామాలను వివరించారు. అన్నింటినీ ధైర్యంగా ఎదుర్కొని నాయుడుపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైనందుకు రాజేశ్వరమ్మను వైయస్ జగన్ అభినందించారు. ప్రజలకు చేరువై నిత్యం వారితో మమేకం అవుతూ, వారి కష్టాలు తీర్చేందుకు పని చేయాలని ఈ సందర్భంగా వైయస్ జగన్ ఆమెకు సూచించారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.సంజీవయ్య ఆధ్వర్యంలో రాజేశ్వరమ్మ వైయస్ జగన్‌ను కలవగా, ఆమె వెంట ఆమె భర్త తంబిరెడ్డి జనార్ధర్‌రెడ్డితో పాటు, కుటుంబ సభ్యులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తంబిరెడ్డి సుబ్రమణ్యారెడ్డి, పార్టీ నాయుడుపేట అధ్యక్షుడు కె.మాధవరెడ్డి, నాయుడుపేట రూరల్ అధ్యక్షుడు కిషోర్‌యాదవ్ ఇంకా, పార్టీ నియోజకవర్గం అబ్జర్వర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.అంతకు ముందు నందకొట్కూరు మున్సిపల్ ఛైర్‌పర్సనగా ఎన్నికైన షేక్ ఫాతిమాబీ మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. కుటుంబ సభ్యులతో సహా, పార్టీ కేంద్ర కార్యాలయంలో వైయస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆమె, నందికొట్కూరులో మున్సిపల్ ఎన్నికలు జరిగిన తీరు, ఆ తర్వాత కౌంటింగ్ కేంద్రంలో కూడా వెన్నుపోటు పార్టీ నాయకులు, కార్యకర్తలు చేసిన అరాచకాలను వివరించారు. తను ఓడిపోయినట్లు ప్రకటించేందుకు అన్ని ప్రయత్నాలు చేశారని తెలిపారు. అన్ని సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని నందికొట్కూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైనందుకు ఫాతిమాబీని వైయస్ జగన్ అభినందించారు. ప్రజలకు చేరువై నిత్యం వారితో మమేకం అవుతూ, వారి కష్టాలు తీర్చేందుకు పని చేయాలని ఈ సందర్భంగా వైయస్ జగన్ ఆమెకు సూచించారు. వైయస్సార్‌సీపీ నాయకులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, డాక్టర్ సుధీర్‌తో పాటు.. షేక్ ఫాతిమాబీ భర్త, పార్టీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్ అహ్మద్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ గఫార్ కూడా ఈ సందర్భంగా వైయస్ జగన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

పంజాబ్‌లో ఘోర బస్సు ప్రమాదం

ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు, ఒక పురుషుడు సహా ముగ్గురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో 24 నుంచి 25 మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను వెంటనే సమీపంలోని వివిధ ఆసుపత్రులకు తరలించారు. బస్సు ఆలస్యంగా నడుస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ మెహర్ సింగ్ తెలిపారు.

నేపాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

15 మంది ప్రయాణికులతో వెళ్తున్న వాహనం అదుపుతప్పి లోయలోకి పడిపోయింది. ఖాట్మండు నుండి సర్లాహికి వెళ్తున్న ప్రయాణికుల వాహనం ప్రమాదానికి గురైనట్లు అధికారులు తెలిపారు. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో వాహనం సుమారు 500 మీటర్ల లోతు ఉన్న నిటారైన లోయలోకి పడి నుజ్జునుజ్జయింది. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఇద్దరు బాలికలు, ఐదుగురు పురుషులు ఉన్నారు. తీవ్రంగా గాయపడిన ఐదుగురిని చికిత్స నిమిత్తం హెతౌడా ఆసుపత్రికి తరలించినట్లు 'ది ఖాట్మండు పోస్ట్' వెల్లడించింది.

గాజాలో ఆసుపత్రిపై ఇజ్రాయెల్ వైమానిక దాడి

- ఆరుగురు మృతి

గాజా : దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్‌లో ఉన్న నాజర్ మెడికల్ కాంప్లెక్స్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడి జరిపింది. ఖాన్ యూనిస్‌లోని నాజర్ మెడికల్ కాంప్లెక్స్ లక్ష్యంగా ఈ దాడి కొనసాగింది. ఈ ఘటనలో ఆరుగురు మరణించగా, 20 మంది గాయపడినట్లు గాజా సివిల్ డిఫెన్స్ వర్గాలు వెల్లడించాయి. పశ్చిమ ఖాన్ యూనిస్‌లోని నాజర్ మెడికల్ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఉన్న అల్-యాసిన్ భవనం రెండో అంతస్తుపై క్షిపణి పడింది. ఈ దాడి కారణంగా ఆసుపత్రిలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ), శస్త్రచికిత్స (సర్జికల్) వార్డులకు భారీ స్థాయిలో నష్టం వాటిల్లినట్లు ఆసుపత్రి డైరెక్టర్ తెలిపారు. సీనియర్ హమాస్ ఉగ్రవాదితో పాటు ఇతర మిలిటెంట్లను లక్ష్యంగా చేసుకునే గురువారం తెల్లవారుజామున ఈ దాడి నిర్వహించినట్లు ఇజ్రాయెల్ సైన్యం సమర్థించుకుంది. 2025 అక్టోబర్ 10న అమల్లోకి వచ్చిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ ఈ ప్రాంతంలో దాడులు కొనసాగుతున్న నేపథ్యంలోనే ఈ ఘటన చోటుచేసుకుంది. గడిచిన కొద్ది రోజులుగా గాజా సిటీ, బురైజ్ శరణార్థి శిబిరాలపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లోనూ అనేకమంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు.



ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలి

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను అధికారులు, పోలీసు యంత్రాంగం సమష్టి కృషితో విజయవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు.

ఎన్నికల షెడ్యూల్‌పై సమీక్ష : ఇప్పటికే నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలతో పాటు తొలి విడతలో 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. తదుపరి ఎంపీపీ అధ్యక్ష ఎన్నికలు నవంబర్ 19 న, జెడ్పీపీ ఛైర్మన్ ఎన్నికలు నవంబర్ 20 న నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మిగిలిన 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు నవంబర్ 12 న నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించి నవంబర్ 26 న పోలింగ్, నవంబర్ 30 న ఓట్ల లెక్కింపు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాల కలెక్టర్ల నుంచి అందిన అభిప్రాయాలు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన సౌకర్యాలను పరిగణనలోకి తీసుకుని కౌంటింగ్ తేదీలో మార్పు చేసినట్లు వివరించారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు మూడు విడతల్లో నోటిఫికేషన్లు : రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. మొదటి విడతకు నవంబర్ 13 న, రెండో విడతకు నవంబర్ 16 న, మూడో విడతకు నవంబర్ 19 న నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన నవంబర్ 26 న, రెండో విడత నవంబర్ 29 న, మూడో విడత డిసెంబర్ 2న నిర్వహించనున్నట్లు తెలిపారు. మిగిలిన 23 పట్టణ స్థానిక సంస్థలకు పరోక్ష ఎన్నికలు డిసెంబర్ 3 న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొత్తంగా డిసెంబర్ 3 లేదా 4 వ తేదీ నాటికి రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు.

నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత : కొన్ని జిల్లాల్లో పట్టణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించాల్సి రావడం సవాలుతో కూడుకున్న అంశమని కమిషనర్ పేర్కొన్నారు. స్థానిక సమస్యలు, వ్యక్తిగత విభేదాలు, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు ముందస్తు ప్రణాళికతో భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.

అక్టోబర్ 27 న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మార్గదర్శకాలను అనుసరిస్తూ ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నామినేషన్ల దాఖలుకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైన చోట జిల్లా ప్రధాన కార్యాలయాలు, కలెక్టరేట్లలో నామినేషన్ పత్రాల స్వీకరణకు ఏర్పాట్లు చేయడంతో పాటు, దూర ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు రవాణా, భద్రతాపరమైన ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులకు తగిన పోలీసు రక్షణ కల్పించాలని ఆదేశించారు.

సీసీటీవీ నిఘా, వీడియో రికార్డుల భద్రత తప్పనిసరి : అన్ని నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు లేదా వీడియోగ్రఫీ ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధించిన వీడియో రికార్డులను కనీసం 60 రోజుల పాటు లేదా ఎన్నికల పిటిషన్ల పరిష్కారం పూర్తయ్యే వరకు భద్రపరచాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రతి దశలో ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడాలని సూచించారు. 10 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రతి పంచాయతీకి ప్రత్యేక రిటర్నింగ్ అధికారి.. ఎన్నికల వీడియో రికార్డుల భద్రతపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలి వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ఎన్నికల కార్యదర్శి డా. ఏ. మల్లిఖార్జు మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్ల స్వీకరణ, రిటర్నింగ్ అధికారుల నియామకం, సీసీటీవీ నిఘా, వీడియోగ్రఫీ, ఎన్నికల విధుల నిర్వహణపై నిర్దేశించిన మార్గదర్శకాలను అధికారులు కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిబంధనల అమలు, సమన్వయానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ కోసం రెండు నుంచి నాలుగు గ్రామ పంచాయతీలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ క్లస్టర్‌కు ఒక నామినేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఒక ప్రధాన లేదా అనువైన గ్రామ పంచాయతీలో రిటర్నింగ్ అధికారి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశాలు ఉన్నాయని వివరించారు. 10 వేల కంటే తక్కువ జనాభా ఉన్న రెండు నుంచి నాలుగు గ్రామ పంచాయతీలకు ఒక క్లస్టర్‌గా నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. 10 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రతి గ్రామ పంచాయతీకి ప్రత్యేకంగా ఒక రిటర్నింగ్ అధికారిని నియమించాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాలు, వీడియోగ్రఫీ ఏర్పాట్ల విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వీడియో రికార్డులను నిర్దేశిత పద్ధతిలో భద్రపరచాలని, వాటి నిల్వ, నిర్వహణ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల వీడియోలను అనధికారికంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం లేదా ప్రచారం చేయడం వంటి చర్యలకు తావులేకుండా చూడాలని ఆదేశించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో ఎంపీడీవోలు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పర్యవేక్షణలో సంయుక్త బాధ్యతలు నిర్వహించాలని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి జిల్లా పంచాయతీ అధికారి (ఖుూ) పర్యవేక్షణలో ఎంపీడీవోలు తమ బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో అధికారుల మధ్య సమన్వయం ఉండాలని పేర్కొన్నారు. పట్టణ స్థానిక సంస్థల్లో ఎంపీలు, ఎమ్మెల్యేల ఎక్స్‌అఫీషియో సభ్యత్వం, ఓటింగ్ హక్కులకు సంబంధించి కూడా రాష్ట్ర ఎన్నికల కార్యదర్శి వివరించారు. ఒక జిల్లాలో ఒక ప్రజాప్రతినిధి పరిధిలో రెండు లేదా అంతకంటే ఎక్కువ పట్టణ స్థానిక సంస్థలు ఉన్న సందర్భంలో, ఆయన ఏ పట్టణ స్థానిక సంస్థలో ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా కొనసాగాలనుకుంటారో దానిని ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. ఎంపిక చేసుకున్న పట్టణ స్థానిక సంస్థలోనే ఆయన ఓటు హక్కును వినియోగించుకోవచ్చని వివరించారు. మిగిలిన పట్టణ స్థానిక సంస్థల సమావేశాలకు హాజరై చర్చల్లో పాల్గొనే అవకాశం ఉన్నప్పటికీ, అక్కడ ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా కొనసాగడం లేదా ఓటు హక్కును వినియోగించుకోవడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఇదే విధానం ఎంపీలతో పాటు ఎమ్మెల్యేలకు కూడా వర్తిస్తుందని తెలిపారు. రాజ్య సభ్యులు, శాసన మండలి సభ్యులు వారు వారి ఎన్నిక సమయంలో ఎక్కడైతే ఓటరుగా నమోదై ఉంటారో ఆ పరిధిలోని పట్టణ స్థానిక సంస్థలో మాత్రమే ఎక్స్ అఫీషియో హోదాలో పరోక్ష ఎన్నికల్లో ఓటు హక్కు కల్గి ఉంటారు. ఈ ప్రక్రియలో ఎక్స్‌అఫీషియో సభ్యుల హోదా, ఓటింగ్ హక్కులు, కో-ఆప్టెడ్ సభ్యుల ఎంపిక, సంబంధిత విధివిధానాల అమలుపై నిర్దేశిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఎక్కడా లోపాలు తలెత్తకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర ఎన్నికల కార్యదర్శి డా. ఏ. మల్లిఖార్జున పేర్కొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో డీఐజీ, ఎస్పీలను ఎస్పీలను ఉద్దేశించి ఐజీ బి. రాజకుమారి మాట్లాడుతూ... వివిధ పార్టీల అభ్యర్థులు ఒకేసారి నామినేషన్ కేంద్రాలకు వచ్చినప్పుడు ఘర్షణలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలను వ్యూహాత్మకంగా మోహరించాలన్నారు. ఎన్నికల సంఘం కాల్ సెంటర్‌కు లేదా ఇతర మార్గాల్లో అందే ఫిర్యాదులపై వెంటనే స్పందించి పోలీసు బృందాలను రంగంలోకి దించాలన్నారు. గత ఎన్నికల్లో నమోదైన ఫిర్యాదుల వివరాలను సంబంధిత ఎస్పీలతో పంచుకుని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. గత ఎన్నికల్లో ఫిర్యాదులు అందిన ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సమయంలో దాదాపు 25 జిల్లాల నుంచి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. అభ్యర్థులను బెదిరించడం, కిడ్నాప్ చేయడం, నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం వంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ కేంద్రాలు ఎక్కువగా ఉన్నందున మొబైల్ పోలీసు బృందాలను విస్తృతంగా మోహరించాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎస్పీలు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అబ్జర్వర్స్, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతోపాటు పంచాయతీ రాజ్ శాఖ కిమిషనర్ ఎంవీ కృష్ణ తేజ్, సీడీఎమ్మ్ అడిషనల్ డెరెక్టర్ రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడుల సాధనలోనే కాదు...

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వాల మధ్య వైరుధ్యాలకు పెట్టుబడిదారులు బలికాకూడదని, వచ్చే పెట్టుబడులకు శాశ్వత భరోసా కల్పించేందుకు ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ అవసరమన్నారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వంపై నమ్మకం, ఇచ్చిన హామీల అమలుపై భరోసా కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన జన్ విశ్వాస్ పిలుపునకు అనుగుణంగా ఏపీలో పాలన సాగిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో పరిశ్రమలకు రియల్ టైమ్‌లో అనుమతులు మంజూరు చేస్తున్నామని చెప్పారు.

పెట్టుబడులకు సంబంధించిన ప్రక్రియల్లో జాప్యం లేకుండా వేగంతో అనుమతులు ఇచ్చే విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, భూమి కేటాయింపులు, ప్రోత్సాహకాలను వేగంగా అందిస్తున్నామని తెలిపారు. ఏపీలో ఈ విధానం అమలుకు కియా కార్ల పరిశ్రమ ఒక ఉదాహరణగా పేర్కొన్నారు. ఆమ్కా డిఫెన్స్ ప్రాజెక్టుకు కేవలం 36 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేసి భూమి కేటాయించామని, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ సంస్థ కూడా 19 నెలల్లోనే సిద్ధమైందని... ఇది ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని వెల్లడించారు.

నమ్మకంతో పెట్టుబడులు... ఈ సదస్సులో వచ్చే పెట్టుబడులతో కలిపి ఇప్పటివరకు రాష్ట్రానికి రూ.32 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించినట్టువుతుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఎస్క్రో ఖాతా ద్వారా అందించడం వల్ల వాటి చెల్లింపుల్లో పారదర్శకత, విశ్వసనీయత పెరుగుతాయని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా కీలకంగా మారనున్న సాంకేతిక, పారిశ్రామిక రంగాలను ప్రాధాన్యంగా తీసుకున్నామని చంద్రబాబు వివరించారు. రేర్ ఎర్త్ మాగ్నెట్స్, స్టీల్ ఉత్పత్తి, సోలార్ వేఫర్లు, సౌర విద్యుత్తు, బ్యాటరీ ఎనర్జీ రంగాల్లో పెద్దఎత్తున అవకాశాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. క్రిటికల్ మినరల్ మిషన్, స్టీల్ పాలసీ, సోలార్ మిషన్, రక్షణ రంగంలో ఆత్మనిర్భరత, అంతరిక్ష రంగానికి స్పేస్ విజన్, సెమీకండక్టర్ మిషన్, లాజిస్టిక్స్ పాలసీ, క్వాంటం టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్, మారిటైమ్ రంగాల అభివృద్ధికి కార్యాచరణ చేపట్టామని చెప్పారు. అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు చేయడంతో పాటు, క్వాంటం పరికరాలను మేడ్ ఇన్ అమరావతి బ్రాండుతో తయారు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. పౌర అవసరాలు, రక్షణ రంగ అవసరాలకు ఉపయోగపడే డ్రోన్ల తయారీ కోసం ప్రత్యేకంగా డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే మారుమూల ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా ఔషధాలను రవాణా చేస్తున్నామని వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించి ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి ఉద్యానవన ఉత్పత్తుల కేంద్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలో 25 సెక్టోరల్ పార్కులను ఏర్పాటు చేస్తున్నామని, తిరుపతిని గ్లోబల్ సెమీకండక్టర్ చిప్ డిజైన్ కేంద్రంగా అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలు, మౌలిక సదుపాయాలను ఒకే చోట అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

రాష్ట్ర అభివృద్ధిలో నదుల అనుసంధానం కీలకం : రాష్ట్ర పారిశ్రామిక, వ్యవసాయ, ఆర్థిక అభివృద్ధికి నీటి లభ్యత అత్యంత కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. నదుల అనుసంధానం ద్వారా సాగు, తాగునీటి అవసరాలతో పాటు పారిశ్రామిక అవసరాలకు కూడా నీటిని అందించేలా కార్యాచరణ చేపట్టామని వివరించారు. గోదావరి జలాలను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తరలించడం ద్వారా విశాఖపట్నం, అమరావతి వంటి కీలక నగరాల నీటి అవసరాలను తీర్చే అవకాశం ఉందన్నారు. గోదావరి కుడి, ఎడమ కాలువల వ్యవస్థను సమర్థంగా వినియోగించుకోవడంతో పాటు, గోదావరి నుంచి కావేరి నదికి నీటిని తరలించే అవకాశాలపైనా దృష్టి సారించామని తెలిపారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానం ద్వారా ఐదు రాష్ట్రాల నీటి అవసరాలను తీర్చే అవకాశం ఉందని ముఖ్యమంత్రి వివరించారు. విద్యుత్ సరఫరాకు గ్రిడ్ ఉన్నట్లుగానే నీటి సరఫరాకు కూడా వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తే ప్రజలకు, రైతులకు, పరిశ్రమలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. నీటి లభ్యతను పెంచడం ద్వారా వ్యవసాయ రంగానికి భరోసా కల్పించడంతో పాటు, పారిశ్రామిక అవసరాలకు నిరంతరాయంగా నీటిని అందించవచ్చని చెప్పారు. నదుల అనుసంధానం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, ప్రాంతాల మధ్య సమతుల్య అభివృద్ధికి దోహదపడుతుందని స్పష్టం చేశారు. వాటర్ గ్రిడ్ కలను సాకారం చేయగలిగేది ప్రధాని నరేంద్ర మోదీ మాత్రమేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

అమరావతి నుంచి తిరుపతి వరకు అభివృద్ధి కేంద్రాలు : అమరావతిని బ్లూ-గ్రీన్ సిటీగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రపంచస్థాయి రాజధానిగా నిర్మిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఐకానిక్ భవనాలు, అత్యాధునిక మౌలిక సదుపాయాలతో నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. పారిశ్రామికవేత్తలు అమరావతిని తమ రెండో నివాసంగా మార్చుకోవాలని ఆహ్వానించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఆరు ఆపరేషనల్ పోర్టులు, విమానాశ్రయాలు, హైస్పీడ్ రైలు నెట్‌వర్క్, రహదారి అనుసంధాన వ్యవస్థలు ఉన్నాయని, ఇవి ఏపీని దేశంలో కీలక లాజిస్టిక్స్ కేంద్రంగా నిలబెట్టేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. పరిశ్రమల రవాణా, ఎగుమతులు, దిగుమతులకు అనువైన మౌలిక సదుపాయాలను మరింత విస్తరిస్తున్నామని తెలిపారు. దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా విశాఖపట్నానికి గుర్తింపు లభించిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ పారిశ్రామిక ప్రతినిధులను ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. సామాజిక, ఆర్థిక భద్రతతో పాటు సమాన అవకాశాల కల్పనలోనూ రాష్ట్రం పురోగతి సాధిస్తోందని చంద్రబాబు తెలిపారు. యాక్సెస్ టు ఈక్వాలిటీ ఇండెక్స్‌లో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని చెప్పారు. పేదల జీవన ప్రమాణాలను పెంచడం, వారికి సామాజిక, ఆర్థిక భద్రత కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక సదుపాయాల విస్తరణతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందేలా ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తోందని... అలాగే రెండున్నరేళ్ల కాలంలో చిన్న పాటి గ్యాప్ కూడా లేకుండా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో కలిసి పనిచేస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం ఉందని... సుస్థిరాభివృద్ధి సాధిస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, సీఎస్ సాయి ప్రసాద్, జీఎమ్ఆర్ సంస్థ ఛైర్మన్ గ్రంధి మల్లిఖార్జునరావు, కియా సీఈఓ ఇండియా ఎండీ గ్వాంగ్ లీ, సాగర్ డిఫెన్స్ సీఈఓ నికుంజ్ పరాశర్ తదితరులు హాజరయ్యారు.

అభివృద్ధిలో మోదీ-బాబుది 'ఆర్‌ఆర్‌ఆర్' జోడీ..

ప్రజాభూమి ప్రతినిధి,విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ నగరం ఇకపై కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) భాగస్వామ్య సదస్సులకు శాశ్వత వేదికగా మారనుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి పీయూష్ గోయెల్ కీలక ప్రకటన చేశారు. విశాఖలో జరిగిన సీఐఐ సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనపై ప్రశంసల వర్షం కురిపించారు. అభివృద్ధి విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబుల పనితీరును 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాలోని నీరు, నిప్పుతో పోలుస్తూ, ఇద్దరూ కలిసి రాష్ట్రాన్ని, దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో ఏపీ ముందుకు

ఇటీవల రెండు తీవ్రమైన తుపాన్లు రాష్ట్రాన్ని దెబ్బతీసినా, విశాఖ నగరం వేగంగా కోలుకుని అంతర్జాతీయ సదస్సుకు వేదిక కావడం అభినందనీయమని గోయెల్ అన్నారు. "ప్రపంచమంతా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి చర్చిస్తుంటే, సీఎం చంద్రబాబు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ను అమలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయన కాలం కంటే ముందు ఆలోచించి ఏఐ, క్వాంటం టెక్నాలజీల ప్రాముఖ్యతను ఎప్పుడో గుర్తించారు" అని వివరించారు. 2024లో చంద్రబాబు అధికారం చేపట్టే నాటికి రాష్ట్రం అప్పుల్లో ఉండగా, వ్యవస్థలు చిన్నాభిన్నమై ఉన్నాయని, అయినా పట్టుదలతో రాష్ట్రాన్ని పునరుద్ధరించి పెట్టుబడులకు స్వర్గధామంగా తీర్చిదిద్దుతున్నారని ప్రశంసించారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెంచేందుకు పారిశ్రామిక ప్రోత్సాహకాలను అందించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రత్యేకంగా ఎస్క్రో ఖాతాను ప్రారంభించడం గొప్ప ముందడుగు అని పేర్కొన్నారు.

పెట్టుబడిదారులకు భారత్ భరోసా

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం, సవాళ్లు నెలకొన్న ప్రస్తుత తరుణంలో పెట్టుబడిదారులకు భారత్ అత్యంత సురక్షితమైన, విశ్వసనీయమైన గమ్యస్థానంగా నిలుస్తోందని గోయెల్ భరోసా ఇచ్చారు. "అప్పటి కాకతీయ రాజు గణపతి దేవుడు విదేశీ పెట్టుబడిదారులకు భరోసా కల్పించిన చారిత్రక నేపథ్యం మనది. అప్పటి నుంచి ఇప్పటి వరకు భారత్ విదేశీ భాగస్వాములను గౌరవిస్తూనే ఉంది" అని గుర్తుచేశారు. భారత్ ఎన్నడూ టెక్నాలజీ బదిలీని కోరదని, ఇతర దేశాల మేధోసంపత్తిని దొంగిలించదని, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ హక్కులను పూర్తిగా గౌరవిస్తుందని ఆయన స్పష్టం చేశారు. విశాఖ నగరం 'స్టీల్ సిటీ' నుంచి 'సిలికాన్ సిటీ'గా రూపాంతరం చెందుతోందని, ఓర్వకల్లు, పూడిమడక వంటి ప్రాంతాలు గ్రీన్ ఎనర్జీ హబ్స్‌గా ఎదుగుతున్నాయని తెలిపారు. తయారీ, పర్యాటకం వంటి అనేక రంగాల్లో ఏపీలో, భారత్‌లో అపార అవకాశాలున్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. "దేశభాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయలు అన్నారని, అలాంటి తీయనైన ప్రాంతంలో పెట్టుబడులు పెట్టడం సంతోషాన్నిస్తుంది" అని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

ప్రజాభూమి
ఎన్టీఆర్, కృష్ణా
శుక్రవారం, నవంబర్ 13, 2026

ఎన్నికల నిర్వహణకు అవసరమైన అదనపు నిధులు విడుదల చేయాలి



రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అనిల్ చంద్ర పునేఠాకు విజ్ఞప్తి చేసిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు గతంలో విడుదల చేసిన నిధులతో పోలిస్తే ఈసారి అదనంగా 20 నుంచి 25 శాతం నిధులు కేటాయించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అనిల్ చంద్ర పునేఠాకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నిర్వహణలో విధులు నిర్వర్తించే అధికారుల పారితోషికాలు పెంచడం, సీసీటీవీల ఏర్పా టు, వెబ్‌కాస్టింగ్ వంటి అదనపు ఏర్పాట్ల నేపథ్యంలో మరిన్ని నిధులు అవసరమవుతున్నాయని వివరిం చారు. గురువారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అనిల్ చంద్ర పునేఠా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర సంబంధిత అధికారులతో వీడి యో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు, మిగిలిన 23 పట్టణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, నిధుల అవసరాలు తదితర అంశాలపై సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని గ్రామపంచాయతీ ఎన్నికలతో పాటు గుడివాడ, తాడిగడప మున్సిపాలిటీలలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి తీసుకుంటున్న చర్యల ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివ రించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మా ట్లాడుతూ ఈ ఏడాది ఎన్నికల విధుల్లో పాల్గొనే పీఓ, ఏపీఓలకు పారితోషికాలు పెంచడంతో పాటు సీసీటీవీల ఏర్పాటు, వెబ్‌కాస్టింగ్ వంటి అదనపు ఏర్పాట్లు చేపట్టినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో గత ఏడాదితో పోలిస్తే అదనంగా 20 నుంచి 25 శాతం నిధులు అవసరమవుతాయని పేర్కొన్నారు.దీనిపై స్పందించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి పెండింగ్ నిధుల విడుదల అనంతరం అన్ని జిల్లాల కలెక్టర్ల నుంచి ఖర్చులు, అదనపు నిధుల అవసరాలకు సంబంధించిన వివరాలను సేకరించిన అనంతరం అవసరమైన నిధులు కలెక్టర్ల ఖాతాలకు జమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జెడ్పీ ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే కొన్ని నిధులు విడుదల చేసినట్లు, మిగిలిన మొత్తాన్ని కూడా విడుదల చేస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి కే శ్రీధర్ రెడ్డి, డిపిఓ ఎం ధనలక్ష్మి, గుడివాడ, తాడిగడప మున్సిపల్ కమిషనర్లు మనోహర్ రావు, నజీర్, ఎన్నికల మ్యాన్ పవర్ నోడల్ అధికారి డిటిడబ్ల్యుఓ ఫణి ధూర్జటి, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



సిఐఐ భాగస్వామ్య సదస్సులో మంత్రి కొల్లు రవీంద్రతో ఆస్ట్రేలియా కాన్సులేట్ జనరల్ Silai Zaki భేటీ



❖రాష్ట్రంలో మైనింగ్ రంగంలో ఉన్న అపార అవకాశాలపై చర్చ ❖ఆస్ట్రేలియాలోని గనులు, పరీక్షా కేంద్రాలు, సందర్శించాలని మంత్రి కొల్లు రవీంద్రకు ఆహ్వానం

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

ఆంధ్ర ప్రదేశ్ - ఆస్ట్రేలియా మధ్య మైనింగ్ వ్యాపారాన్ని విస్తరించేలా ప్రత్యేక కార్యాచరణకు ప్రభుత్వం అన్ని రకాలుగా సహకారం అందిస్తుం దని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ మైదానంలో ప్రతిష్టాత్మకంగా జరుగు తున్న సిఐఐ భాగస్వామ్య సదస్సులో ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా ఆధ్వర్యంలో Ms. Silai Zaki - Consul general of Austrailia, Sri Abhijith nair - Policy research Analyst, Ms. Janaki Sreeram-Policy research Analyst సమావేశమయ్యారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - ఆస్ట్రేలియా మధ్య క్రిటికల్ మినరల్స్ రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు సానుకూలంగా ఉన్నట్లు తెలిపారు. ఆస్ట్రేలియాలో క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, బీచ్ సాండ్ మినరల్ ప్రాసెసింగ్ రంగాల్లోని అత్యాధునిక సాంకేతికతను మరియు నైపుణ్యాలను ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆస్ట్రేలియా క్యాన్సులేట్ ప్రతినిధులు మంత్రుల బృందాన్ని ఆహ్వానించారు. ఖనిజనీషణ, ప్రాసెసింగ్, సెపరేషన్, శుద్ధి చేయడం మరియు పర్యావరణ అనుకూల మైనింగ్‌లో ఆస్ట్రేలియా ప్రపంచ స్థాయి అగ్రగామిగా ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం మరియు నెల్లూరు తీర ప్రాంతాలలో బీచ్-శాండ్, మోనజైట్ నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయి. భారతదేశపు "రేర్ ఎర్త్ కారిడార్"లో ఆంధ్రప్రదేశ్ కీలక రాష్ట్రంగా అవతరించే అపారమైన వనరులున్నాయి. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో వేలం వేయనున్న మినరల్ బ్లాక్‌లను విశ్లేషించడానికి మరియు పరీక్షిం చడానికి ఆస్ట్రేలియా సాంకేతిక సహాయం అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. మైనింగ్ నుంచి రేర్ ఎర్త్ మాగ్నెట్ మరియు కాంపోనెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ వరకు విలువ ఆధారిత సహకా రానికి ఆస్ట్రేలియా సిద్ధంగా ఉందని ఆస్ట్రేలియా క్యాన్సులేట్ ప్రతినిధులు తెలిపారు. త్వరలోనే ఆస్ట్రేలియాలో పర్యటించి వ్యాపార అభివృద్ధికి ఇరు ప్రభుత్వాల మధ్య సమన్వయానికి కృషి చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు.

మోపిదేవి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు



మోపిదేవి రీజనల్ రిపోర్టర్, ప్రజా భూమి మోపిదేవిలోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో నాగుల చవితి, కార్తీక మాసం సందర్భంగా స్వామివారి దర్శనానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, దర్శనానంతరం అవసరమైన సేవలను సులభంగా పొందే విధంగా ఆలయ సమీపంలోని కోనేరు వద్ద ప్రత్యేకంగా క్లోక్‌రూమ్, చెప్పుల భద్రపరిచే కేంద్రం ఏర్పాటు చేశారు. అదేవిధంగా స్వామివారి లడ్డూ ప్రసాదం, పులిహోర ప్రసాదం విక్రయ కేంద్రాలను సైతం అక్కడే అందుబాటులోకి తీసుకువచ్చారు.పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులు ప్రసాదాల కోసం, తమ వస్తువుల భద్రత కోసం ఇబ్బందులు పడకుండా ఈ ఏర్పాట్లు దోహదపడనున్నాయి. భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడంతోపాటు, దర్శన ఏర్పాట్లు సజావుగా సాగేందుకు ఈ సౌకర్యాలు ఉపయోగపడనున్నాయి.కావున మోపిదేవి క్షేత్రానికి విచ్చేసే భక్తులందరూ ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని స్వామివారి దర్శనాన్ని ప్రశాంతంగా చేసుకోవాలని దేవస్థాన అధికారులు కోరుతున్నారు.



చెక్కు బౌన్స్ కేసులో మచిలీపట్నం మున్సిపల్ ఉద్యోగికి

ఆరు నెలలు జైలు శిక్ష మరియు నాలుగు లక్షల జరిమానా

కృష్ణా జిల్లా 9వ అదనపు జిల్లా జడ్జి టీ. రాజ వెంకటాద్రి తీర్పు



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

మచిలీపట్నం నగర కార్పొరేషన్ లో 21వ డివిజన్ నుండి 31 డివిజన్ వరకు పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్ కళా కేశవ అనే ఉద్యోగికి చెల్లని చెక్కు కేసులో ఆరు నెలలు జైలు శిక్ష మరియు నాలుగు లక్షల రూపాయలు జరిమానా విధిస్తూ కృష్ణాజిల్లా 9వ అద నపు జిల్లా టి. రాజ వెంకటాద్రి గురువారం తీర్పు చెప్పారు. మచిలీపట్నం కు చెందిన తాడిశెట్టి వెంకట కృష్ణారావు అనే వ్యక్తి వద్ద మచిలీపట్నం కార్పొరేషన్ ఉద్యోగి కళా కేశవ 2020 జనవరి ఐదో తారీఖున ఐదు లక్షల రూపాయలు అప్పు చేసి ప్రామిసరీ నోటు రాయించి ఇచ్చాడు. సదరు బాకీ కింద పార్ట్ పేమెంట్ గా నాలుగు లక్షల రూపా యలు చెక్కును నిందితుడు కళా కేశవ పిర్యాధి వెంకట కృష్ణారావు ఇచ్చాడు కృష్ణారావు తన బ్యాంకు లో చెక్కు కలెక్షన్ కోసం వేస్తే కేశవ అకౌంట్లో డబ్బులు లేవని చెక్కు తిరిగి వచ్చింది. వెంకట కృష్ణారావు చట్ట ప్రకారం చర్యలు తీసుకొని మచిలీపట్నం కోర్టులో నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్ సెక్షన్138 క్రింద క్రిమినల్ కేసు దాఖలు చేశాడు. దిగువ కోర్ట్ లో కేసు విచారించి బ్యాంకులో తగిన సొమ్ము లేకుండా చెల్లని చెక్కు ఇచ్చినందుకు ముద్దాయి కళా కేశవకు ఆరు నెలలు జైలు శిక్ష నాలుగు లక్షల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానంగా చెల్లించిన నాలుగు లక్షల రూపా యలు ను నష్టపరిహారంగా ఫిర్యాది వెంకటకృష్ణ రావుకి చెందాలని తీర్పులో పేర్కొన్నారు.. కింది కోర్టు తీర్పును సవాల్ చేస్తూ ముద్దాయి కళా కేశవ కృష్ణా జిల్లా 9వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో అప్పీల్ చేశారు. అపీల్ లో ఉభయ పక్షాల వాద ప్రతివాదనలు విన్న పిదప ముద్దాయి కళా కేశవ సెక్షన్ 138 కింద నేరం చేసినట్లుగా నిర్ధారిస్తూ ఆరు నెలల జైలు శిక్ష నాలుగు లక్షల రూపాయలు జరిమానా చెల్లించాలని 9వ అదనపు టి రాజా వెంకటాద్రి తీర్పు చెప్పారు. ఫిర్యాది వెంకట కృష్ణారావు తరపున న్యాయవాదులు లంకిశెట్టి బాలాజీ, కమ్మిలి విజయ్ కుమార్, లంకిశెట్టి సాయి ఫణి సంతోష్, చిన్నంశెట్టి ఆశ నాగ మౌనిక న్యాయవాదులుగా వ్యవహరించారు.

చంద్రశేఖర్ మృతి అత్యంత బాధాకరం

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నివాళులు



కోడూరు ప్రజాభూమి ప్రతినిధి కందుకూరు

కోడూరు మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీను అల్లుడు కూరపాటి చంద్ర శేఖర్ (33) రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం అత్యంత బాధాకరమని అవని గడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు.గురువారం మధ్యాహ్నం ప్రకాశం జిల్లా కందుకూరు సమీపంలోని సింగరిబొట్లపాలెంలో చంద్రశేఖర్ స్వగృహానికి చేరుకున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జనసేన పార్టీ నియోజకవర్గ యువ నాయకుడు మండలి వెంకట్రామ్ ఆయన భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.జడ్పీటీసీ ఎన్నికల్లో బండే శ్రీను సతీమణి, కూటమి అభ్యర్థి బొలిశెట్టి అరుణశ్రీ గెలుపు కోసం చంద్రశేఖర్ అవిశ్రాం తంగా కృషి చేశారని ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో చురుగ్గా పనిచేసిన చంద్రశేఖర్ అనుకోకుండా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించిం దన్నారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు.అనంతరం జనసేన పార్టీ కోడూరు మండల నాయకుడు రెడ్రౌతు కృష్ణబాబు సైతం చంద్రశేఖర్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.



చంద్రశేఖర్ అకాల మరణం బాధాకరం

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విక్కుర్తి శ్రీనివాసరావు



కోడూరు ప్రజాభూమి ప్రతినిధి కందుకూరు

కోడూరు మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు అల్లుడు కూరపాటి చంద్రశేఖర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి విక్కుర్తి శ్రీనివాసరావు అన్నారు.గురువారం మధ్యాహ్నం ప్రకాశం జిల్లా కందుకూరు సమీపంలోని సింగరిబొట్లపాలెంలో చంద్రశేఖర్ స్వగృహానికి వెళ్లిన విక్కుర్తి శ్రీనివాసరావు, ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.జడ్పీటీసీ ఎన్నికల్లో బండే శ్రీనివాసరావు సతీమణి బొలిశెట్టి అరుణశ్రీ గెలుపు కోసం చంద్రశేఖర్ ఎంతో అంకితభావంతో కృషి చేశారని గుర్తుచేశారు. అలాంటి వ్యక్తి అనుకోని రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడం తీరని లోటని పేర్కొన్నారు. చిన్న వయసులోనే ఆయన మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.చంద్రశేఖర్ మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ, బండే శ్రీనివాస రావు కుటుంబ సభ్యులకు విక్కుర్తి శ్రీనివాసరావు తన సానుభూతిని తెలిపారు.





రెండు బోర్ పంపు సెట్లు ప్రారంభం



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం న్యూ హోప్ ఫౌండేషన్ హైదరాబాద్ వారిచే పెదపట్నం గొల్లగూడెం ప్రాం తంలో ఏర్పాటు చేసిన సుమా రు 70 వేల రూపాయలు ఖరీదు చేసే రెండు మంచినీటి బోర్వెల్ పంపు సెట్లను మచిలీపట్నం నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు ఊసల రమేష్ బాబు ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో దాసి విజయ్ కుమార్, కొక్కిలిగడ్డ శ్రీను, ఎంపీటీసీ కాంతారావు, క్రిస్టియన్ సెల్ సభ్యులు గంటా నవమ ణి రాజు, ఆయా గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బందరు రైతుబజారులో కూరగాయల ధరల ఘాటు.. సామాన్యుడికి భారంగా మారిన కొనుగోళ్లు!

అధికారులు ప్రకటించిన ధరలకు మించి వసూలు.. నాణ్యత లేని కూరగాయల విక్రయాలపై వినియోగదారుల ఆగ్రహం



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

బందరు రైతుబజారులో కూర గాయల ధర లు సామాన్య, మధ్యతరగతి ప్రజలకు భారం గా మారు తున్నాయి. ఒకవైపు నిత్యావసర వస్తు వు ల ధరలు పెరుగుతుండగా, మరో వైపు కూరగాయల ధరలు కూడా అందు బాటు లో లేకపోవడంతో విని యోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. రైతు బజారులో నాణ్యత లేని కూరగాయలను అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. రైతుబజారు అధికారులు ప్రకటించిన ధరల కంటే కిలోకు రూ.10 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని వినియోగదా రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యమైన కూరగాయలను బయట మార్కెట్లకు తరలిస్తూ, నాసిరకం కూరగాయలను రైతుబజారులో విక్రయిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ప్రశ్నించినా సంబంధిత వ్యాపారుల నుంచి సరైన సమాధానం రావడం లేదని వినియోగదారులు వాపోతున్నారు.స్థానికంగా పండించే కాకరకాయ, దోసకాయ, బెండ కాయ, బీరకాయ వంటి కూరగాయలు సైతం అందుబాటు ధరల్లో లభించడం లేదు. అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేయ లేక చాలామంది పప్పుకూరలు, రోటి పచ్చళ్లతోనే భోజనం సరిపెట్టుకుంటున్నారు. కనీసం ఆకుకూ రలతోనైనా నెట్టుకొద్దామనుకుంటే వాటి ధరలు కూడా క్రమంగా పెరుగుతుండటంతో సామాన్యుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది.కార్తీకమాసం కావడం, ఇటీవల కురిసిన వర్షాల ప్రభావంతో కూరగాయల దిగుబడి, సరఫరా తగ్గడం కూడా ధరల పెరుగుదలకు కారణమై ఉండవచ్చని వినియోగదారులు భావిస్తున్నారు. అయితే రైతుబజారులో ధరల నియం త్రణ, నాణ్యత పర్యవేక్షణ చేయాల్సిన మార్కెటింగ్ శాఖ అధికారులు మాత్రం వినియోగదారుల ఫిర్యాదు లపై తగిన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రైతుబజారును క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రక టించి న ధరలకే కూరగాయలు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని, నాణ్యత ప్రమాణాలను పాటించే లా వ్యాపారులను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. దళారులు, వ్యాపారుల అధిక లాభాపేక్షకు అడ్డుకట్ట వేసి సామాన్య వినియోగదారులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ మచిలీపట్నంకు పది జిల్లా స్థాయి అవార్డులు!



ప్రజాభూమి ప్రతినిధి,మచిలీపట్నం

2025–26 సంవత్సరానికి విశిష్ట సేవలం దించినందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ మచిలీ ప ట్నం పది జిల్లా స్థాయి అవార్డులను కైవసం చేసుకుంది.క్లబ్ చరిత్రలో తొలి మహిళా అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టి, తన విశిష్ట సేవలు, అంకితభావంతో క్లబ్‌కు ఈ ఘన త ను సాధించి పెట్టిన అధ్యక్షురాలు లయన్ హిమబిందుని జిల్లా చైర్మన్ లయన్ జి. రామ బ్రహ్మం, పంచవర్వాల సత్యనారాయణ, లం కిశెట్టి బాలాజీ, లయన్ చలమలశెట్టి నరసిం హారావు, డి. ఉమామహేశ్వరరావు అభినందించారు. విజయవాడలోని అమ్మ కళ్యాణ మండపంలో జరిగిన జిల్లా అవార్డుల ప్రదానోత్సవంలో, జిల్లా పూర్వ గవర్నర్ లయన్ వి.వి.పి.ఎస్. అంజనేయులు ఈ అవార్డులను క్లబ్ ప్రతినిధులు లయన్ జి. రామబ్రహ్మం, లయన్ పి. ప్రభాకర్ లకు అంద చేశారు.మచిలీపట్నం లయన్స్ క్లబ్‌కు ఇది గర్వకారణమైన విజయం అని, అధ్యక్షురాలు హిమ బిందుకి, క్లబ్ సభ్యులందరికీ సెక్రటరీ లయన్ పి.ప్రభాకర్ అభినందనలు తెలిపారు.

గోపు సత్యనారాయణ దంపతులకు ఘన సన్మానం



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం

ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి తరపున విజయం సాధించిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులందరూ గురువారం ఉద యం కృష్ణాజిల్లా తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యాల యం లో పార్టీ అధ్యక్షులు గోపు సత్యనారా యణ ని ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎన్నికల్లో విజయం సాధించిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ విజేతలందరూ గోపు సత్యనారా యణ కి, వారి సతీమణికి ఘనంగా శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు.అనంతరం గోపు సత్యనారాయణ విజయం సాధించిన అభ్యర్థులందరికీ అభినంద నలు తెలియజేస్తూ, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకర భవాని – కాకర కాంతారావు, ఎర్రంశెట్టి నాని, కొక్కిలిగడ్డ శ్రీను, బొలిశెట్టి నాని, పసుపులేటి నాగరాజు, వంక రమేష్, వంక నందేశ్వరరావు, వంక నాగమల్లేశ్వరరావు, వంక రాంబాబు, వీర శ్రీనివాసరావు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

శుక్రవారం 13 నవంబర్ 2026




పారిశుధ్య కార్మికులకు పనిముట్లు కల్పించాలి

ప్రజాభూమి ఏలూరు

నగర పారిశుధ్య కార్మికులకు గంపలు, డబ్బాలు,తోపుడు బండ్లు, క్లాప్ వాహనాలు వెంటనే ఏర్పాటు చేయాలని, సిబ్బంది సంఖ్య పెంచాలని ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఐఎఫ్‌టీయూ) ఏలూరు నగర కమిటీ డిమాండ్ చేసింది.బుధవారం లావేటి కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ పారిశుధ్య పనుల ప్రైవేటీకరణను నిలిపివేయాలని,కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో జీతాలు,పీఎఫ్,ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు.కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, విధి నిర్వహణలో మరణించిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.సమావేశంలో బి. సోమయ్య, జి. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్తీక మాసంలో పంచారామ దర్శనానికి ప్రత్యేక బస్సులు



ప్రజాభూమి ఏలూరు

కార్తీక మాసం సందర్భంగా పంచారామ క్షేత్రాల దర్శనానికి ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి ప్రత్యేక ప్యాకేజీ బస్సులు నడిపేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది.నవంబర్ 15, 22, 29, డిసెంబర్ 6 తేదీల్లో ఆదివారం రాత్రి 7 గంటలకు ఏలూరు నుంచి బస్సులు బయలుదేరి,ఒకే రోజులో అమరావతి,భీమవరం, పాలకొల్లు,ద్రాక్షారామం, సామర్లకోట పంచారామ క్షేత్రాలను దర్శించుకునేలా ప్రయాణ ప్రణాళిక రూపొందించారు.టికెట్ ధరలు,రిజర్వేషన్ల వివరాల కోసం భక్తులు సంబంధిత డిపో అధికారులను సంప్రదించాలని ఆర్టీసీ అధికారులు సూచించారు.సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు:ఏలూరు: 9959225487, 9441010271
జంగారెడ్డిగూడెం: 9959225489, 7013968369
నూజివీడు: 9959225461, 8332985780

ఏలూరు మేయర్ రెడ్డి అప్పల నాయుడుకు జనసేన నేతల అభినందనలు



ప్రజాభూమి ఏలూరు

నగర పాలక మేయర్‌గా ఎన్నికైన రెడ్డి అప్పల నాయుడును జనసేన రాష్ట్ర కార్యదర్శి,ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మేయర్‌గా ఎన్నికైన అప్పల నాయుడుకు అభినందనలు తెలియజేస్తూ,ఆయన నాయకత్వంలో ఏలూరు నగరం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా చాగంటి మురళీకృష్ణ మాట్లాడుతూ, ప్రజల ఆశయాలకు అనుగుణంగా నగర అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనకు భవిష్యత్తులో మరిన్ని విజయాలు లభించాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అధికారి సాయికృష్ణ రాజు, జనసేన నాయకులు నారా శేషు,డీసీఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య

ప్రజా భూమి కుకునూరు



త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ తన సత్తా చాటాలని సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నె.లక్ష్మయ్య పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోడే. నాగేష్ అధ్యక్షతన జరిగిన సీపీఐ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఎల్లప్పుడూ ముందుంటుందని, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి ప్రజల్లోకి వెళ్లాలని, ప్రతి పంచాయితీలో పార్టీ జెండా ఎగరాలని,ఇతర పార్టీలకు ధీటుగా ఉన్నామని అన్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రజా సమస్యలపై పోరాడే అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు.ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సమితి నాయకులు అయితా.సురేష్ బాబు,ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా. శ్యామల, మైసాక్షి. వెంకటా చారి,కూరకుల. బాబురావు,వరసా. పాపారావు, ఎకో. సోమరాజు, మడకం ఉంగా తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త కుమార్తె దుర్గా కుసుమ ఎంపీటీసీగా విజయం

- మంత్రి నిమ్మల సేవల స్ఫూర్తి తో రాజకీయాల్లోకి వచ్చానంటున్న దుర్గా కుసుమ

ప్రజాభూమి ప్రతి నిధి,పాలకొల్లు



పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం గవరపేట గ్రామంలో బీఫార్మసీ చదివిన 23 ఏళ్ల యువతి ఎల్లపు దుర్గా కుసుమ ఎంపీటీసీ ఎన్నికల్లో1005ఓట్ల మెజార్టీతో వైస్సార్సీపీ అభ్యర్థిని పై ఘన విజయం సాధించారు. ఆమె తండ్రి ఎల్లపు వెంకట సత్యనారాయణ ఒక సామాన్య టిడిపి కార్యకర్త గా టీడీపీ పార్టీకి సేవలందిస్తున్నారు. బి ఫార్మసీ వంటి కోర్సులు పూర్తిచేసి ఉద్యోగా ల కోసం పట్నాలు వెళ్తున్న ఈ రోజుల్లో దుర్గా కుసుమ మాత్రం ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చి ఎంపీటీసీగా గెలవడం విశేషం.గ్రామస్తులు దుర్గా కుసుమ కే పట్టం కట్టారు. మంత్రి నిమ్మల సేవల స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చా:ఎంపీటీసీ దుర్గా కుసుమ మంత్రి నిమ్మల రామానాయుడు ధర్మారావు ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవలు ప్రజలకు అందించారని, ఆ స్ఫూర్తితో తాను కూడా రాజకీయాల్లోకి వచ్చానని గవరపేట ఎంపీటీసీ దుర్గ కుసుమ తెలిపారు. గ్రామంలో మంత్రి నిమ్మల రామానాయుడు నేతృత్వంలో కొట్లాది రూపాయల అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని ఇంకా మంచినీరు, డ్రైనేజీ సౌకర్యం కల్పించాల్సి ఉందన్నారు. ఆ సమస్యల పరిష్కారానికి తమ గ్రామ పెద్దల సహకారంతో మంత్రి నిమ్మ ల ద్వారా కృషి చేస్తామని తెలిపారు.తన విజయానికి కారణమైన మంత్రి నిమ్మల రామానాయుడు, గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, ఏపీ స్టేట్ ఫారెస్ట్ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ మల్ల వెంకట మురళి, టిడిపి క్లస్టర్ కన్వీనర్ ఎల్లపు లోకేశ్వరరావు, తన తండ్రి ఎల్లపు వెంకట సత్యనారాయణ, దాడి వీరబాబు, ఎల్లపు శ్రీనివాస్, కూటమి నాయకులకు, కార్యకర్తలకు, గ్రామ ప్రజలుకు ఎంపీటీసీ దుర్గ కుసుమ కృతజ్ఞతలు తెలిపారు.

నేర నిర్ధారణలో ఆధునిక సాక్ష్యాధారాలు సేకరణపై

పోలీస్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం

ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప శివ కిషోర్



ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా.

నేర పరిశోధనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, భౌతిక సాక్ష్యాధారాల సేకరణపై పోలీస్ సిబ్బందికి సాధన ముఖ్యమని ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప శివ కిషోర్ అన్నారు. నేరస్థల పరిశీలన, శాస్త్రీయ పద్ధతుల్లో ఆధారాల సేకరణ, ఆధునిక సాంకేతిక పరికరాల వినియోగంపై క్షేత్రస్థాయి శిక్షణ ను ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్, ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం వద్ద గల పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజీవీడు పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లకు నేర పరిశోధనలో నైపుణ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో సాధన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.
ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం వద్ద ఉన్న పోలీస్ గ్రౌండ్ లో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో నేరస్థల పరిశీలన, నేరస్థల నివేదిక తయారీ, సంఘటనా స్థలంలో లభించే భౌతిక సాక్ష్యాధారాలను శాస్త్రీయ పద్ధతుల్లో సేకరించడం, వాటిని భద్రపరచడం వంటి అంశాలపై సిబ్బందికి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు పలు కీలక అంశాలపై సిబ్బందికి ప్రాక్టికల్ శిక్షణ అందించారు.

దర్యాప్తు సమయాలలో దర్యాప్తు అధికారి నేరస్థల పరిశీలనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

నేరం జరిగిన ప్రదేశానికి చేరుకున్న వెంటనే పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించడం, సంఘటనా స్థలం లోని ఆధారాలు చెదిరిపోకుండా కాపాడటం, నేర స్థలాన్ని భద్రపరచడం, ప్రతి అంశాన్ని పద్ధతి ప్రకారం నమోదు చేయడం వంటి విధివిధానాలను వివరించారు. నేర స్థలంలో భౌతిక సాక్ష్యాధారాల సేకరణ లో పాటించవలసిన విషయాలు నేర స్థలంలో లభించే వేలిముద్రలు, రక్తపు మరకలు, వెంట్రుకలు, పాద ముద్రలు, ఆయుధాలు, ఇతర వస్తు ఆధారాలను శాస్త్రీయ పద్ధతుల్లో ఎలా సేకరించాలి, వాటిని కలుషితం కాకుండా ఎలా భద్రపరచాలి, తదుపరి దర్యాప్తు నిమిత్తం సంబంధిత విభాగాలకు ఎలా పంపించాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు.

ఆధునిక సాంకేతిక పరికరాల వినియోగం

భౌతిక సాక్ష్యాధారాల గుర్తింపు, సేకరణ, నమోదు కోసం ఆధునిక సాంకేతిక పరికరాలను ఉపయోగించే విధానాలను వివరించారు. మొబైల్ ఫోరెన్సిక్ యూనిట్ సిబ్బంది అందుబాటులో ఉన్న ఆధునిక పరికరాల పనితీరును ప్రత్యక్షంగా ప్రదర్శించి, వాటి వినియోగంపై పోలీస్ సిబ్బందికి క్షేత్రస్థాయిలో శిక్షణ అందించారు.

వివిధ రకాల కేసుల్లో సాక్ష్యాధారాల సేకరణ

రోడ్డు ప్రమాదాలు, హత్య కేసులు, అత్యాచార కేసులు, అనుమానాస్పద మరణాలు, నీటిలో మునిగి సంభవించే మరణాలు తదితర కేసుల్లో సంఘటనా స్థలాన్ని పరిశీలించే విధానం, ఆయా కేసులకు సంబంధించిన కీలక భౌతిక సాక్ష్యాధారాలను గుర్తించడం, సేకరించడం, భద్రపరచడం వంటి అంశాలను వివరించారు.

దర్యాప్తులో శాస్త్రీయ విధానాల ప్రాధాన్యత

ప్రతి కేసులో సాక్ష్యాధారాల సేకరణ అత్యంత కీలకమని, చిన్నపాటి ఆధారాన్ని కూడా నిర్లక్ష్యం చేయకుండా శాస్త్రీయ పద్ధతుల్లో దర్యాప్తు కొనసాగించాలని సూచించారు. సేకరించిన ఆధారాల నిరంతర భద్రత పాటిస్తూ, న్యాయ స్థానంలో నేర నిరూపణకు ఉపయోగపడే విధంగా దర్యాప్తు నిర్వహించాలని వివరించారు. ఈ సాధన కార్యక్రమం ద్వారా పోలీస్ అధికారులు, సిబ్బందికి నేరస్థల పరిశీలనలో ఎదురయ్యే వివిధ పరిస్థితులపై అవగాహన కల్పించడంతో పాటు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకునే విధానాలను ప్రత్యక్షంగా తెలియజేశారు.

అన్నవరం దేవస్థానానికి నూతన ఈవోగా కె. లక్ష్మీ శివజ్యోతి నియామకం

- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ.. తక్షణమే అమల్లోకి రానున్న నియామకం

ప్రజాభూమి, ప్రత్తిపాడు (అన్నవరం)



ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి నూతన కార్యనిర్వహణాధికారిగా (ఈవో) కె. లక్ష్మీ శివజ్యోతిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం గుంటూరులోని మహిళా, శిశుసంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెను రెవెన్యూ (ఎండోమెంట్స్) శాఖలోకి బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న కె. లక్ష్మీ శివజ్యోతికి అన్నవరం దేవస్థానం ఈవోగా బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి రానుంది. ఇప్పటివరకు వాడపల్లి ఆలయ ఈవోగా విధులు నిర్వహిస్తున్న ఎన్. చక్రధరరావు అన్నవరం దేవస్థానం ఈవోగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం నూతన ఈవోను నియమించడంతో అన్నవరం దేవస్థానానికి పూర్తిస్థాయి కార్యనిర్వహణాధికారి నియామకం జరిగినట్లయింది.

దైవిక వైభవానికి అంకురార్పణ..
ధర్మశాస్త్ర స్వామి ప్రతిష్ఠా మహోత్సవానికి వేళాయె!

- భక్తి పారవశ్యంలో రెండు రోజుల పాటు వైభవంగా ఆధ్యాత్మిక వేడుకలు

ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి



శబరిమలై క్షేత్రాన్ని తలపించే దివ్య ఆధ్యాత్మిక వాతావరణంలో నూతనంగా నిర్మించిన శ్రీ ధర్మశాస్త్ర స్వామి దేవస్థాన ప్రతిష్ఠా మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం శనివారం రెండు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్న ఈ పవిత్ర వేడుకల్లో భాగంగా మొదటి రోజు గణపతి హోమం, మృత్యుంజయ హోమం, సుదర్శన హోమం, భగవత సేవ, ప్రసాద శుద్ధి, బింబ శుద్ధి, గోపికా బంధనం, విగ్రహ జలవాసనం తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రెండవ రోజు గణపతి హోమం, కలశ పూజ, కలశ ఉద్వాటన అనంతరం ఉదయం 11.44 గంటల నుంచి మధ్యాహ్నం 12.27 గంటల వరకు అత్యంత పవిత్రమైన అభిజిత్ కుంభాభిషేక మహోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం దీపారాధన, వేద పూజ, అధివాస పూజ, హరివాసనం కార్యక్రమాలు జరగనున్నాయి. తాంత్రికాచార్య బ్రహ్మశ్రీ జిల్లు తిరుమణి, శ్రీ సునీల్ తిరుమణి, శ్రీ సతీష్ తిరుమణి ఆధ్వర్యంలో వైదిక క్రతువులు జరగనున్నాయి. శనివారం ఉదయం 11 గంటలకు అయ్యప్ప స్వామి ప్రతిష్ఠ, మధ్యాహ్నం 12 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. ఈ మహత్తర ఆధ్యాత్మిక వేడుకలకు భక్తులు, అయ్యప్ప స్వాములు, ధర్మాభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆలయ నిర్మాణ దాతలు, బ్రహ్మ దేవా గణేశాచారి రేణుక దంపతులు మరియు శ్రీ శ్రీ శ్రీ దుగ్గిరాల బాల రావమ్మ ఆలయ కమిటీ, శి ఆహ్వానిస్తున్నారు.



టీడీపీ నాయకుడు అబ్రహంను పరామర్శించిన ఎమ్మెల్యే చంటి

ప్రజాభూమి ఏలూరు

స్థానిక 32వ డివిజన్ తెలుగుదేశం పార్టీ నాయకులు మంద పల్లి అబ్రహం ఇటీవల అనారోగ్యంతో శస్త్రచికిత్స చేయించు కోగా, గురువారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించిన ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు, ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య (చంటి). ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసు కుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్ర మంలో ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్,క్లస్టర్ ఇన్‌చార్జ్ గూడవల్లి శ్రీనివాస్, బీఎస్ఎన్ఎల్ అడ్వైజరీ బోర్డు డైరెక్టర్ లంకపల్లి మాణిక్యాలరావు, కార్పొరేటర్లు వాసా సత్యనా రాయణ, పెద్దాడ రమణ, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి రెడ్డి నాగరాజు, నాయకులు తాటిపూడి రూస్వెల్ట్, సోమిశెట్టి రాము పాల్గొన్నారు.

అన్నదానం కోసం రూ.50,116 విరాళం అందజేత



ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో వేంచేసియున్న శ్రీ క్షీరా అన్నదానం నిమిత్తం 50,116రూపాయలు శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో గురువారం మానేపల్లి వెంకటేశ్వరరావు, వీర వెంకట పద్మావతి దేవి శ్రీ స్వామి వారి దేవస్థానంనకు అన్నదానం నిమిత్తం 50,116 రూపాయలు సమర్పించి యున్నారు. ఆ మొత్తంను ఆలయ చైర్మన్ మీసాల రామచం ద్రరావు, మరియు ట్రస్ట్ బోర్డు సభ్యులు మరియు కార్యని ర్వహణాధికారి రాపాక శ్రీనివాస రావు స్వీకరించి స్వామి వారి అన్నదానం అకౌంట్ లో జమ చేయించినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు గొల్లపాలెం విద్యార్థి

ప్రజాభూమి ప్రతినిధి, కాజులూరు



గొల్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి విద్యార్థి బొమ్మిడి భీమ వెంకట దుర్గా ప్రసాద్ అనపర్తి లో జరిగిన ఎస్ జి ఎఫ్ అండర్ 17 వాలీబాల్ సెలక్షన్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టు కి ఎంపిక అయ్యాడ అని పాఠశాల హెచ్ ఎం ఎస్ ఎస్ బి శీలా మణి తెలిపారు. నవంబర్ 19 నుండి 21 వరకు అంబేద్కర్ కోనసీమ జిల్లా నేదునూరు లో జరిగే స్టేట్ మీట్ లో పాల్గొంటాడని పీడీ జి సునీల్ కుమార్ తెలిపారు. విద్యార్థికి శిక్షణ ఇచ్చిన పీడీ లు సునీల్, ఇమ్మనేయల్ రాజ్ లను గ్రామ స్పెషల్ ఆఫీసర్ జె. రాంబాబు గారు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బండి శేషగిరి, ఉపాధ్యాయులు గంగరాజు, ప్రసాద్, శ్రీను బాబు, ప్రమీల, దుర్గా రత్నం, రత్న కుమారి అభినందించారు.

ప్రజాభూమి
కోనసీమ
5
శుక్రవారం 13 నవంబర్ 2026

న్యుమోనియా నివారణ బాల్యానికి భరోసా

• డాక్టర్ నవ్య జీవన్

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు



లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు డాక్టర్ ఎం నవ్య జీవన్. డాక్టర్ దినేష్ ఆధ్వర్యంలో ప్రపంచ న్యుమోనియా నివారణ దినోత్సవ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నవ్య జీవన్ మాట్లాడుతూ న్యూమోనియా అనేది ఊపిరితిత్తులలోని ఇన్ఫెక్షన్ వల్ల వచ్చే తీవ్రమైన శ్వాస కోశ వ్యాధి.ఇది బ్యాక్టీరియా లేదా వైరస్ ఫంగస్ వల్ల వస్తుందని. లక్షణాలు తగ్గినప్పుడు ఆకుపచ్చ రంగులా లేదా కొన్నిసార్లు రక్తంతో కూడిన కఫం పడుతుంది. విపరీతమైన జ్వరము. తలపోటు, చెమట పట్టడం. ఊపిరి ఆడక పోవటం. ఛాతిలో తీవ్రమైన నొప్పి. అలసట.ఆకలి మందగించుట కొన్ని సందర్భాల్లో చిన్న పిల్లల్లో పెదవులు.గోళ్లు. నీలం రంగులోకి మారుతాయి. ఈ వ్యాధి బారిన పడకుండా ఉండుటకు చిన్నపిల్లల దగ్గర నుంచి 65 సంవత్సరాలు వరకు న్యూమోకొకల్. మరియు ఫ్లూ వ్యాక్సిన్ వేయించుకోవాలని ఈ వ్యాధి బారిన పడకుండా ఉండుటకు తగ్గినప్పుడు. తుమ్మినప్పుడు. నోటికి రుమాలు అడ్డుపెట్టుకోవాలని చుట్ట సిగరెట్టు. అలవాటు ఉన్నవారు మానుకోవాలని. వ్యాధినిరోధక శక్తి పెంచుకోవడానికి పోషకాహారం తీసుకోవడం. వ్యాయామం చేయుట. జలుబు. దగ్గు. ఫ్లూఉన్న వ్యక్తులకు దూరంగా ఉండుట.దీర్ఘకాలిక వ్యాధులు అనగా షుగర్. ఆస్తమా. గుండె.కిడ్నీ సంబంధిత వ్యాధులు ఉన్నవారు వెంటనే చికిత్స పొందాలని. అంగన్వాడి సెంటర్ వద్ద ఎలిమెంటరీ స్కూల్ వద్ద హైస్కూల్లో వద్ద ఇంటి పరిసరాలలో పార్టీనియం అనగా వయ్యారిభామ మొక్కలు లేకుండా తొలగించుకోవాలని. వాటి ద్వారా న్యుమోనియా వ్యాధి వచ్చే ప్రమాదం ఉన్నదని డాక్టర్ నవ్య జీవన్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ జి దినేష్ ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు. పీహెచ్ఎన్ పి.ఎలిజిబెత్. సూపర్వైజర్లు ఎస్ కె అమలేశ్వరరావు. పి గంగాభవాని. ఉదయ చందర్. సత్తిబాబు. లక్ష్మీనారాయణ. సత్య ప్రసాద్ , ముత్యవల్లి. ప్రియాంక. ఏ ఎన్ ఎం లు. ఎం ఎల్ హెచ్ పి లు. ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల అభివృద్ధికి,

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలకు జనగణ ముఖ్యం

ప్రజా భూమి బ్యూరో ఏలూరు జిల్లా



జనాభా గణనను ఖచ్చితత్వంతో నిర్వహించేలా జనాభా గణన సిబ్బందికి పూర్తి అవగాహనతో శిక్షణ అందించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి జనాభా గణన అధికారులకు సూచించారు. స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో జనాభా గణనపై రాష్ట్ర జనాభా గణన శాఖ అధికారులు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో జనాభా గణన చాలా ప్రధానమైనదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల సంక్షేమానికి అమలు చేసి సంక్షేమ పథకాల, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనలో జనాభా గణన ముఖ్యపాత్రను పోషిస్తాయన్నారు. దేశ జనాభాను అనుసరించి వివిధ పథకాల అమలుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక సంఘం ద్వారా నిధులు కేటాయింపు చేస్తుందని, వివిధ పథకాల అమలు కూడా జనాభా సంఖ్యను అనుసరించి జరుగుతుందన్నారు. శిక్షణలో అందించే ప్రతీ అంశంపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, శిక్షణలో వివరించే ప్రతి అంశాన్ని శ్రద్ధగా విని, ముఖ్యమైన విషయాలను నోట్ చేసుకోవాలని, ఎలాంటి సందేహాలు ఉన్నా వెంటనే ప్రశ్నలను మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. జనగణన నిర్వహణపై మూడు రోజుల పాటు అందించే శిక్షణను అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తయ్యే సమయానికి ప్రతి ఒక్కరికీ జనాభా గణన ప్రక్రియపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. జనగణనలో భాగంగా ప్రజల ఇళ్లకు వెళ్లినప్పుడు స్నేహపూర్వకంగా మాట్లాడాలని, వారి సహకారాన్ని మర్యాదపూర్వకంగా కోరాలని తెలిపారు. ప్రజల సందేహాలను ఓపికగా విని నివృత్తి చేయాలని సూచించారు. ప్రజల సహకారం, అధికారుల సానుకూల వైఖరి జనగణన విజయవంతానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి జనగణనలో నమోదు కావాలన్నారు. జనగణన-- మొదటి దశలో గృహాలకు సంబంధించిన వివరాలు సేకరించగా, రెండో దశలో దేశంలోని ప్రతి వ్యక్తికి సంబంధించిన జనాభా వివరాలను 40 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళి ద్వారా నమోదు చేయనున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన ఫీల్డ్ ట్రైనర్లు జిల్లాలోని సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లకు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి శిక్షణ అందజేయాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర జనగణన శాఖ జాయింట్ డైరెక్టర్ జగన్నాధం, మాస్టర్ ట్రైనర్ కృష్ణ వేణి లను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి దుశ్శాలువా, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఇంచార్జ్ డిఆర్ఓ ఎం. ముక్కంటి, జిల్లాలోని జనగణనకు సంబంధించి ఫీల్డ్ ట్రైనర్లు, ప్రభృతులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో 46 మంది భక్తులకు

సత్యదీక్ష మాలాధారణ

ప్రజాభూమి, ప్రత్తిపాడు

కాకినాడ జిల్లా ప్రత్తిపాడులోని శ్రీ తూలగిరి సీతారామచంద్రస్వామి ఆలయంలో సత్యదీక్ష మాలాధారణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 46 మంది భక్తులు సత్యదీక్ష మాలలు ధరించారు. తేజోమూర్తుల సుబ్రహ్మణ్య శర్మ చేతుల మీదుగా భక్తులకు మాలాధారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్వామివారి ఆశీస్సులతో దీక్ష చేపట్టిన భక్తులు నియమనిష్ఠలతో దీక్షా కాలాన్ని పూర్తి చేయాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెలుగూరి హరేరామ్, పసుపులేటి అర్జునరావు, కిలపర్తి సందీపకుమార్, బండి శ్రీను, యండమూరి శ్రీరంగ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు పెద్ద సంఖ్యలో సత్యస్వాములు, సత్యమాతలు, భక్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు ఏర్పాట్లు

• నవంబర్ 14 నుంచి 20 వరకు వివిధ కార్యక్రమాలు



ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

కొత్తపేట ద్వితీయ శ్రేణి శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు శాఖా గ్రం థపాలకురాలు కుంచే సునీత తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, నవంబర్ 14న చాచా నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవంతో వారోత్సవాలు ప్రారంభమవుతాయని వెల్లడిం చారు. వారం రోజులపాటు ప్రతిరోజూ విభిన్న అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు వివిధ రంగాల్లో పోటీలు, 19న మహిళా సాధికారతపై చర్చా కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. 20వ తేదీన వారోత్సవాల ముగింపు సభతో పాటు వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక అధికారులు, కవులు, విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు విజ్ఞానాన్ని విస్తరించే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కుంచే సునీత విజ్ఞప్తి చేశారు.

వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ముసుగులో

సాగునీటిని వ్యాపార సరుకుగా మార్చొద్దు

• ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా



రాష్ట్రంలో ఎత్తిపోతల పథకాల పునర్నిర్మాణ ప్రక్రియలో భాగంగా విద్యుత్తు రెగ్యులేటరీ కమిషన్ తరహాలో వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారని,వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ముసుగులో సాగునీటిని వ్యాపార సరుకుగా మార్చే రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన పట్ల ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గురువారం ఏలూరు అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికే అమల్లో ఉన్న విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ద్వారా విద్యుత్ వినియోగదారులపై విద్యుత్ చార్జీల భారాలు వేస్తూ, పి.పి.ఎ ఒప్పందాల పేరుతో ప్రైవేట్ విద్యుత్ ఉత్పత్తి కంపెనీలకు ప్రజల సొమ్మును దోచి పెట్టేందుకు అనువైన మార్గంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు రెగ్యులేటరీ కమిషన్ ను వినియోగించుకుంటున్నదని చెప్పారు. ప్రజలపై భారాల విషయంలో ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పించుకునేందుకు రెగ్యులేటరీ కమిషన్ల విధానాన్ని సరళీకరణ విధానాలలో భాగంగా అమలు చేస్తున్నదని విమర్శించారు. సాగునీటి రంగంలో కూడా సరళీకరణ విధానాల అమలులో భాగంగానే రాష్ట్ర ముఖ్యమంత్రి వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ప్రతిపాదన ముందుకు తీసుకువచ్చారని చెప్పారు.ఈ పేరుతో సాగునీటి రంగాన్ని, నీటిపారుదల వ్యవస్థను వ్యాపార మయం చేయడం నీటిని వ్యాపార సరుకుగా మార్చడం అనే ప్రపంచ బ్యాంకు విధానాన్ని ముఖ్యమంత్రి ముందుకు తీసుకువస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ద్వారా సాగునీటి ప్రాజెక్టుల కింద, ఎత్తిపోతల పథకాల కింద, కాలువలు, చెరువుల కింద సాగునీరు వినియోగించుకుంటున్న రైతాంగం సాగునీటిని కూడా కొనాల్సిన దుస్థితి వస్తుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు త్రాగునీటి సరఫరా నుండి తప్పుకున్నదని చెప్పారు. అన్ని పట్టణాలు, గ్రామాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలోని సాగునీటి వ్యవస్థలు స్వచ్ఛమైన త్రాగునీటిని అందించకపోవడం వల్ల ప్రజలు ప్రైవేటు మినరల్ వాటర్ ప్లాంట్ల నుండి డబ్బులు చెల్లించి కొనుక్కొని త్రాగునీటిని వినియోగించుకుంటున్నారన్నారు. వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ద్వారా సాగునీటిని కూడా వ్యాపార సరుకుగా మార్చే ప్రపంచ బ్యాంకు విధానాన్ని మానుకోవాలని, వ్యవసాయానికి సాగునీరు ఇచ్చే బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని రైతుల మీద భారం వేసే వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ప్రతిపాదనను విరమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కార్తీక మాస భక్తులకు భారీ అన్న సమారాధన



ప్రజాభూమి ప్రతినిధి పాలకొల్లు

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలో వేంచేసియున్న శ్రీ క్షీర రామ లింగేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా స్వామివారిని దర్శించుకున్న భక్తులకు గురువారం భారీ అన్న సమారాధన జరిగింది. ఈ అన్న సమారాధన కార్యక్రమానికి సూరిభట్ల శ్రీ క్షీరా రామలింగేశ్వర కృష్ణ ప్రసాద్, రాధా రమణి దంపతులు, కాలనాధబట్ల సుధీర్, లక్ష్మీ సుజాత దంపతుల విరాళంతో ఆ రోజు భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. అన్న సమారాధన దాతలకు శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ మీసాల రామచంద్రరావు, ఈవో రాపాక శ్రీనివాసరావు, సూపరిండెంట్ వాసు స్వామి వారి చిత్రపటం అందజేసి ఘనంగా సత్కరించారు. ముందు గా కృష్ణ ప్రసాద్,రాధా రమణి దంపతులు, సుధీర్ లక్ష్మి సుజాత దంపతులు శ్రీ క్షీర రామలింగేశ్వర స్వామి, పార్వతి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాది సుబ్బారావు, నాలంబావి, ఎస్బిఐ విశ్రాంత ఉద్యోగులు పాల్గొని భక్తులకు సేవలందించారు.

కామ్రేడ్ వసంతయ్య మృతి పట్ల పలువురు ప్రముఖుల సంతాపం

• లింగంపర్తిలో చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు



ప్రజాభూమి, ప్రత్తిపాడు

ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామానికి చెందిన కామ్రేడ్ వసంతయ్య మృతి పట్ల పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సిపిఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగారాజు, ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత శివన్నారాయణ తండ్రి వసంతయ్య మృతి చెందడంతో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వసంతయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన పవిత్ర స్మృతిని స్మరించుకున్నారు. సమాజానికి ఆయన అందించిన సేవలను కొనియాడుతూ, ఆయన మరణం కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొన్నారు. అనంతరం ఆయన కుమారులు బుగత బంగారాజు, బుగత శివన్నారాయణతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొని కామ్రేడ్ వసంతయ్యకు శ్రద్ధాంజలి ఘటించారు.

ఆరు అడుగుల లోతులో

బయటపడిన శివలింగం

• మేళతాళాలతో గ్రామానికి తరలింపు
• దర్శనానికి పోటెత్తినలి భక్తులు
• బాలుడికి ఆంజనేయస్వామి ఆవహించారంటూ ప్రచారం

ప్రజాభూమి ప్రతినిధి. చాట్రాయి



చాట్రాయి మండలం టి. గుడిపాడు-పోలవరం గ్రామ మధ్యలో ఆధ్యాత్మిక సందడి ఆరు అడుగుల లోతులో శివలింగం బయటపడిన ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఓ బాలుడు చూపించిన ప్రదేశంలో గ్రామస్తులు తవ్వకాలు చేపట్టగా లిశివలింగం వెలుగులోకిలి వచ్చినట్లు తెలిపారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. నవంబరు 5వ తేదీ రాత్రి ఓ బాలుడు అసాధారణంగా ప్రవర్తిస్తూ తన శరీరంపై మంటలు వస్తున్నాయని చెబుతూ ఇబ్బందిపడ్డాడనీ, నవంబరు 6వ తేదీ తెల్లవారుజామున గ్రామంలోని ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్దకు చేరుకుని బిగ్గరగా ఏడుస్తూ లి'తీయాలి.. తీయాలిలి ' అంటూ కేకలు వేశాడనీ, తనకు ఆంజనేయస్వామి ఆవహించారని చెబుతూ, గ్రామంలో భూగర్భంలో మహాదేవుడు ఉన్నాడని, తన వెంట వస్తే శివలింగం ఉన్న ప్రదేశాన్ని చూపిస్తానని బాలుడు చెప్పినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. తొలుత కొందరు సందేహించినప్పటికీ, మరికొందరు బాలుడి మాటలను విశ్వసించారు. అనంతరం బ్రాహ్మణుడిని పిలిపించి గ్రామస్తులంతా గురువారం రోజున కలిసి టి.గుడిపాడు, పోలవరం గ్రామాల మధ్య వాగు సమీపంలోని ప్రాంతానికి చేరుకున్నారు. బాలుడు చూపించిన ప్రదేశంలో పండితుల ఆధ్వర్యంలో రెండు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తవ్వకాలు చేపట్టారు. ఈ క్రమంలో సుమారు ఆరు అడుగుల లోతులో చెట్ల వేర్లు, ఇతర అవశేషాల మధ్య కప్పబడి ఉన్న శివలింగం బయటపడినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో గ్రామస్తులు లిఆనందం వ్యక్తం చేశారు.అనంతరం శివలింగాన్ని ఎడ్లబండిపై ఉంచి మేళతాళాలు, హర్షధ్వానాల మధ్య గ్రామంలోని అమ్మవారి ఆలయానికి తరలించారు . భక్తులు తరలివచ్చి శివలింగాన్ని దర్శించుకున్నారు.

మండలవిద్యాశాఖాధికారి 2 సందర్శన



ప్రజాభూమి ప్రతినిధి - నూజీవీడు

నూజీవీడు మండలము జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అన్నవరంలో నూజివీడు మండల విద్యాశాఖాధికారి 2 జమలయ్య సందర్శించడం జరిగినది. ఎస్ ఏ1 పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. పరీక్షల నిర్వహణపట్ల సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరము డొక్కాసీతా రావమ్మ మధ్యాహ్న భోజనము ను పరిశీలించారు. ఏజన్సీ వారిని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, రుచిగా వండాలని కోరారు. భోజనం చేసి సంతృప్తి వ్యక్తంచేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానో ఫాధ్యాయని విజయకుమారి, ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ఆహ్వాన పత్రికలు ఆవిష్కరణ

ప్రజాభూమి ప్రతినిధి పెదపాడు

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆహ్వాన పత్రికలు పెదపాడు గ్రంథాలయాధికారి దుగ్గిపోగు జాన్ బాబు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలపై అవగాహన కల్పించడం, పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ముఖ్య ఉద్దేశం అన్నారు.పెదపాడు శాఖా గ్రంథాలయం నందు ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు జరగబోవు కార్యక్రమంలో పాలు పంచుకోవాలని ప్రతి ఒక్కరూ గ్రంథాలయ సభ్యత్వాన్ని తీసుకోవాలన్నారు, బాలల దినోత్సవం, పుస్తక ప్రదర్శన, గ్రంథాలయ వ్యవస్థాపకులకు, పితామహులకు నివాళులర్పించడం,వివిధ ప్రముఖ వ్యక్తులతో ప్రసంగాలు, సెమినార్లు, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించబడుతుందని, పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 20వ తేదీన ముగింపు సభలో ముఖ్య అతిథుల చేతులమీదుగా బహుమతి ప్రధానం జరుగునని తెలిపారు.

ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

శుక్రవారం 13 నవంబరు 2026

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలెక్షన్ కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ సమీక్ష

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



అమరావతిలోని ఏపీ ఎలక్షన్ కమీషన్ కార్యాలయం నుంచి గురువారం 23 పట్టణ స్థానిక సంస్థలు (ఖాదీం) మరియు గ్రామ పంచాయతీలకు సంబంధించి, రెండవ సాధారణ ఎన్నికల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్ లు, ఎస్పీలు, జనరల్ అబ్జర్వర్లు, వ్యయ పరిశీలకులు, డీపీఓలు మరియు ఆయా పట్టణ స్థానిక సంస్థల కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలెక్షన్ కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ సమీక్ష నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ పాల్గొన్నారు.

విఆర్ఓ గదిలో పగుళ్లు..

ప్రజాభూమి యల్లనూరు



యల్లనూరు మండల తహశీల్దార్ కార్యాలయంలో విఆర్ఓ లు తమ సేవలు ప్రజలకు అందించు గదిలో వర్షాలకు మరియు అధిక ఉష్ణోగ్రతల కారణంగా పాక్షికంగా దెబ్బ తినడంతో పాటు స్టీల్ తుప్పు పోవడంతో సిబ్బంది అసౌకర్యానికి గురైనట్లు తెలుస్తోంది అదేవిధంగా కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఇవేవీ పట్టించుకోకుండా వారి వనులు త్వరగా పూర్తి చేయించు కోవాలని ఆరాటపడుతూ ఉంటారు ఈ క్రమంలో పైనున్న కాంక్రీట్ పెచ్చు ఊడిపడిందా తలకి గాయం కాక తప్పదు ఇటు సిబ్బందికి అటు ప్రజలకు ఈ చిన్న ఏమరపాటే చాలా పెద్ద ప్రమాదాలకు దారితీస్తుంది అనడంలో ఏ మాత్రం సందేహం లేదు బిల్డింగ్ సామర్థ్యాన్ని పరీక్షించి తక్షణ చర్యలు తీసుకోవాలని రానున్న రోజుల్లో ఎలాంటి ప్రాణా నష్టం ఎవరికీ జరగకుండా చూడాలంటూ సంబంధిత అధికారులను వారు కోరారు.

నార్పల మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల..!

నవంబర్ 29న పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు..
18వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ.. 24న అభ్యర్థుల తుది జాబితా

ప్రజా భూమి – నార్పల:

నార్పల మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం నవంబర్ 16వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఈ మేరకు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన తేదీలను నార్పల ఎంపీడీఓ మమతా దేవి వెల్లడించారు.

ఎన్నికల షెడ్యూల్ వివరాలు:

- నవంబర్ 16: రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల.
- నవంబర్ 18: రిటర్నింగ్ అధికారి ఎన్నికల నోటీసు జారీ, నామినేషన్ల స్వీకరణ ప్రారంభం.
- నవంబర్ 20: నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ.
- నవంబర్ 21: నామినేషన్ల పరిశీలన.
- నవంబర్ 22: తిరస్కరించిన నామినేషన్లపై అప్పీల్‌కు అవకాశం.
- నవంబర్ 23: అప్పీళ్ల పరిష్కారం.
- నవంబర్ 24: అభ్యర్థుల ఉపసంహరణకు చివరి తేదీ, తుది అభ్యర్థుల జాబితా విడుదల.
- నవంబర్ 29: పోలింగ్ నిర్వహణ.
- నవంబర్ 29: ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన.

ఎన్నికల సందడి షురూ!

ఎన్నికల షెడ్యూల్ విడుదలతో నార్పల మండలంలోని గ్రామపంచాయతీల్లో ఎన్నికల సందడి మొదలుకానుంది. ఇప్పటికే 17 గ్రామపంచాయతీలకు సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు కావడంతో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు ఎన్నికల బరిలో దిగేందుకు సిద్ధమవుతున్నారు. నామినేషన్ల స్వీకరణ నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు ఎన్నికల ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేపట్టనున్నారు. ఈ వివరాలను నార్పల ఎంపీడీఓ మమతా దేవి వెల్లడించారు.

స్థల వివాదంలో గాడవ కేసు నమోదు చేసిన ఎస్ఐ సురేంద్రబాబు.

ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండలం సూరేపల్లి గ్రామానికి చెందిన మద్దినేని రమణి ఎ/శీ లేటు చిన్న రంగనాయకులు, మద్దినేని రమణి తల్లిని సూరేపల్లె గ్రామానికి చెందిన వారి బంధువులు మద్దినేని బాలరంగయ్య, మద్దినేని భాగ్యలక్ష్మి అనువారు వారి మధ్య గల భూమి మరియు ఇంటి స్థలం విషయంలో గల వివాదాలను మనసులో పెట్టుకొని కాళ్లు చేతులతో కొట్టి గాయపరిచినారని మద్దినేని రాగిణి ఫిర్యాదు మేరకు పుట్లూరు పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేంద్రబాబు తెలిపారు. , ప్రస్తుతం కేసు విచారణలో ఉన్నట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి సన్న బియ్యం ప్రత్యేక విక్రయాలు

-ఒక్కో కుటుంబానికి నెలకు 26 కిలోలు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు భారీగా పెరుగుతుండటంతో సామాన్య ప్రజలపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో నాణ్యమైన సన్న బియ్యాన్ని కిలో రూ.50కే విక్రయించేందుకు ఏర్పాట్లు చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్, శ్రీసత్యసాయి జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదేశాల మేరకు హిందూపురం మండల ప్రజలకు ఈ సదుపాయం కల్పిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ హారతి తెలిపారు. ధరణి నాణ్యమైన సన్న బియ్యం (కేఎన్ఎం రకం) ఒక్కో కుటుంబానికి నెలకు 26 కిలోల చొప్పున అందజేయనున్నట్లు వెల్లడించారు. కిలో రూ.50 చొప్పున 26 కిలోలకు మొత్తం రూ.1,300 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఈ నెల 13వ తేదీ నుంచి హిందూపురం పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో గల 14వ నంబరు గదిలో ప్రత్యేక విక్రయ కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బియ్యం ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్న ప్రజలు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ హారతి సూచించారు.

ఈసారైనా పంచాయతీ ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత దక్కేనా?

డబ్బు, మద్యం రాజకీయాలకు స్వస్తి పలకాలనే యువత ఆలోచనలకు అడ్డంకులెన్నో!

ప్రజాసేవ చేయాలనే తపన ఉన్నా.. పదవి వ్యామోహం ఉన్న నాయకుల అడ్డంకులెన్నో !

ప్రజాభూమి, పుట్లూరు.

గ్రామీణ రాజకీయాల్లో యువత పాత్రపై మరోసారి చర్చ మొదలైంది. రాబోయే పంచాయతీ ఎన్నిక ల్లోనైనా యువతకు తగిన ప్రాధాన్యత లభిస్తుందా? ప్రజాసేవ చేయాలనే ఆసక్తి, గ్రామాభివృద్ధిపై స్పష్టమైన ఆలోచనలు, మార్పు తీసుకురావాలనే సంకల్పం ఉన్న యువతకు రాజకీయంగా అవకాశం దక్కుతుందా? అన్న ప్ర శ్నలు గ్రామాల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి.ఎన్నికలంటే డబ్బు, మద్యం, వ్యక్తిగత పలుకుబడే ప్రధానమనే భావనకు స్వస్తి పలికి, అభివృద్ధి, పారదర్శకత, ప్రజాసేవకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఆలోచనతో కొందరు యువత ముందుకు రావాలని భావిస్తున్నా రు. అయితే వారి ఆశయాలకు రాజకీయ పరిస్థితు లు, ఆర్థిక పరిమితులు, సామాజిక సమీకరణలు అడ్డంకులుగా నిలుస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యువతలో ప్రజలకు సేవ చేయాలనే తపన ఉన్నప్పటికీ, వారికి అవకాశం కల్పించేందుకు రాజకీయ వర్గాలు ఎంతవరకు సిద్ధంగా ఉన్నాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. 'నీకు రాజకీయ అనుభవం లేదు కదా.. ప్రజలను ఎలా నడిపిస్తావు?' అంటూ అనుభవం పేరుతో యువతను వెనక్కి నెట్టే పరిస్థితులు కూడా కనిపి స్తున్నాయనే చర్చ సాగుతోంది.ఏళ్ల తరబడి పదవుల్లో కొనసాగిన నాయకులు మరోసారి తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలనే ప్రయత్నంలో యువతకు అవకాశాలు పరిమితం చేస్తున్నారా? లేక ప్రజల మధ్య పనిచేసిన అనుభవమే నాయకత్వానికి ప్రధాన అర్హతగా ఉండాలా? అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.ఓటమి భయం చూపిస్తూ, ఎన్నికల్లో పోటీ చేయాలనే యువత ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయడం ఎంతవరకు సమం జసం? రాజకీయ అనుభవం అనేది పోటీ చేయడా నికి ముందే రావాలా? లేక ప్రజల మధ్య పనిచేస్తూ, బాధ్యతలు నిర్వహిస్తూ సంపాదించుకోవాలా? అన్నది ఆలోచించాల్సిన అంశం.యువతకు అవకా శం ఇస్తేనే గ్రామ రాజకీయాల్లో కొత్త ఆలోచనలు, కొత్త నాయకత్వం, అభివృద్ధిపై కొత్త చర్చలకు అవకాశం ఏర్పడుతుంది. అయితే యువత కూడా కేవలం వయస్సును అర్హతగా భావించకుండా ప్రజల సమస్యలపై అవగాహన, సేవా దృక్పథం, బాధ్యతాయుతమైన నాయకత్వ లక్షణాలను నిరూ పించుకోవాల్సి ఉంది. మరి ఈసారైనా పంచాయ తీ ఎన్నికల్లో యువతకు సముచిత ప్రాధాన్యత దక్కు తుందా? అనుభవజ్ఞులైన నాయకత్వంతో పాటు కొత్త తరం నాయకత్వానికి కూడా అవకాశం కల్పి స్తారా? లేక యువత ఆశయాలు మరోసారి ఆశలు గానే మిగిలిపోతాయా? వేచి చూడాల్సిందే...!

అమరవీరుల ఆశయ సాధనకు ఉద్యమించాలి

-శాస్త్రీయ విద్యాసాధనతో సమసమాజ స్థాపనకు కృషి చేయాలి -పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు బాబావలి పిలుపు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



విద్యార్థి అమరవీరుల త్యాగాలు వృథా కాకుండా వారు కన్న కలల సమసమాజ స్థాపన కోసం ప్రతి విద్యార్థి ఉద్యమించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్షులు బాబావలి పిలుపునిచ్చారు. శాస్త్రీయ విద్యాసాధనతో పాటు విద్యార్థుల హక్కుల పరిరక్షణకు సంఘటితంగా పోరాడాలని కోరారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ కళాశాల వసతి గృహంలో కామ్రేడ్ జంపాల చంద్రశేఖర ప్రసాద్, శ్రీపాద శ్రీహరి 51వ వర్ధంతి నందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి విద్యార్థి సంఘం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ, ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో కామ్రేడ్ జంపాల చంద్రశేఖర ప్రసాద్, ఆనాటి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నీలం రామచంద్రయ్యలను విజయవాడలో అక్రమంగా అరెస్టు చేసి ఇల్లందు చీకటిగుండ్ల అడవులకు తీసుకెళ్లి దారుణంగా కాల్చి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. జంపాల చంద్రశేఖర ప్రసాద్‌ను హతమార్చితే ప్రగతిశీల విద్యార్థి ఉద్యమం కనుమరుగవుతుందని భావించిన పాలకుల ఆశలు నెరవేరలేదన్నారు. నేడు పీడీఎస్‌యూ దేశవ్యాప్తంగా విస్తరించి బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతోందన్నారు. పీడీఎస్‌యూ కేవలం విద్యార్థుల సమస్యలకే పరిమితం కాకుండా కార్మికులు, కర్షకులు, ప్రజాస్వామిక వాదులు, మహిళలు, మైనార్టీలు, వివిధ అస్తిత్వ వర్గాల హక్కుల కోసం జరిగే పోరాటాల్లోనూ భాగస్వామ్యం అవుతోందని తెలిపారు. విద్యారంగంలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ పెరిగిపోవడంతో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందని పరిస్థితి నెలకొందన్నారు. అనేక అవాంతరాలను అధిగమించి ఉన్నత విద్యను అభ్యసించినా తగిన ఉపాధి అవకాశాలు లభించడం లేదని, ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే ఇందుకు కారణమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా అక్రమంగా ఓట్లను తొలగిస్తూ ప్రజాస్వామిక విలువలకు తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. పేద విద్యార్థులకు అందించాల్సిన ఫీజు రీయిం బర్స్‌మెంట్, ఉపకార వేతనాలు విడుదల చేయకపోవడంతో అనేకమంది విద్యార్థులు చదువులను మధ్యలోనే ఆపివేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వవి ద్యాలయాల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయిం చాలని, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలా శంకర్, రంగవల్లి, రమణయ్య, స్నేహలత, మారోజు వీరన్న వంటి అమరవీరులు విద్యార్థుల హక్కుల సాధన, సమాజ మార్పు కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని గుర్తుచేశారు. వారి త్యాగాలు, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని వారు కలలుగన్న సమసమాజ స్థాపన కోసం విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ వ్యతిరేక విధానాలను విడనాడి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు దిలీప్ కుమార్, నవీన్, అజయ్, గణేష్, ఉమేష్, బసవ, మంజు, దినేష్, పవన్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

-విధులు బహిష్కరించిన న్యాయవాదులు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

విధి నిర్వహణలో ఉన్న న్యాయవాది వెంకటరెడ్డిపై దాడి చేసిన లేపాక్షి ఎస్సై నరేంద్ర పై చర్యలు తీసుకో వాలని హిందూపురం న్యాయవాదుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఎస్సై చర్యలను నివసిస్తూ గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, ఈ నెల 10వ తేదీన మత్తూరు మాజీ ఎంపీపీ పురుషోత్తం రెడ్డిని పోలీసుల అక్రమంగా అరెస్టు చేయడం జరిగిందన్నారు. న్యాయవాదిగా పురుషోత్తమ రెడ్డికి బెయిల్ వేసేందుకు వెంకటరెడ్డి ఆయన సంతకాల కోసం వెళ్లగా లేపాక్షి ఎస్ఐ నరేంద్ర న్యాయవాది చేతుల్లో ఉన్న కాగితాలను బలవంతంగా లాక్కోవడమే కాకుండా దాడికి ప్రయత్నించడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. పోలీసులు అక్రమంగా అరెస్టు చేస్తే బాధితుల తరపున తాము న్యాయవాదులుగా బెయిల్ వేయడం కోసం ప్రయత్నిస్తే ఇలా అడ్డుకోవడం తగదన్నారు. ఇటీవల కాలంగా న్యాయవాదులపై పోలీసుల దాడులు పెరిగిపోతున్నాయని, ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉద్ధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రామచంద్రారెడ్డి, ఇందాద్, వెంకటరెడ్డి, కృష్ణమూర్తి, నాగరాజు రెడ్డి, సదాశివరెడ్డి, హిదయతుల్లా ఖాన్, ఆసిఫ్, రకీబ్, అభిజిత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ బుక్ ఆఫ్ రికార్డ్'లో చోటు సంపాదించిన చిన్నారిలను అభినందించిన జిల్లా ఎస్పీ



ప్రజా భూమి ప్రతినిధి అనంతపురం

జాతీయ క్రీడల్లో సత్తా చాటిన అనంతపురం నామె రిట్ బుక్ ఆఫ్ రికార్డ్'లో చోటు సంపాదించిన చిన్నారిలను అభినందించిన జిల్లా ఎస్పీల్గవ వట్టణ కానిస్టే బుల్ కుమారుడు... 'మెరిట్ బుక్ ఆఫ్ రికార్డ్' లో చోటు సంపాదించిన చిన్నారిలను అభినందించిన జిల్లా ఎస్పీ హర్యానాలో జరిగిన 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం.. లాంగ్‌జంప్‌లో రజత పతకం మెరిట్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు సంపాదించిన మరో చిన్నారి చిన్నారుల ప్రతిభకు ప్రోత్సాహం అందించిన జిల్లా ఎస్పీ పి. జగదీష్ అనంతపురం ఫోర్ట్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ పి. హిమావంత్‌రెడ్డి కుమారుడు హర్యానాలోని రోతక్‌లో నిర్వహించిన ఒలింపిక్ నేషనల్ గేమ్స్ 2026--27లో ప్రతిభ చాటాడు. 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, లాంగ్‌జంప్‌లో రజత పతకం సాధించి జాతీయ స్థాయిలో సత్తా చాటాడు. అదేవిధంగా హిమావంత్‌రెడ్డి కుమార్తె బానుజ తిరుపతిలో ఇటీవల నిర్వహించిన 'నాట్యనీరాజనం--2' కార్యక్రమంలో ప్రతిభ కనబరిచి 'మెరిట్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించింది. ఇద్దరూ తమ ప్రతిభతో అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో కలిసి జిల్లా ఎస్పీ పి. జగదీష్‌ని కలిశారు. విద్యార్థుల ప్రతిభను అభినందించిన ఎస్పీ వారికి పతకాలు ధరింపజేసి, భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ప్రోత్సహించారు. పోలీసు విధులు నిర్వహిస్తూ పిల్లల ప్రతిభను ప్రోత్సహిస్తున్న హిమావంత్‌రెడ్డి కుటుంబాన్ని ఎస్పీ అభినందించారు. క్రీడలు, కళలు, విద్య తదితర రంగాల్లో పిల్లలు రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన ఈ చిన్నారులు అంతర్జాతీయ వేదికపై కూడా విజయాలు సాధించి అనంతపురం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఎన్నికల ఏర్పాట్లపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

-పోలింగ్ కేంద్రాల్లో భద్రత, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి



ప్రజాభూమి, హిందూపురం టౌన్

గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా గురువారం హిందూపురం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ దామోద రమ్మ, రూరల్ అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు సంయు క్తంగా తనిఖీ చేశారు. మండల పరిధిలోని మనేస ముద్రం, మలుగూరు, బాలంపల్లి, చలివెందుల, బీరేపల్లి, కగ్గల్లు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీ లించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసర మైన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, ఎన్నికల సిబ్బంది విధుల నిర్వహణకు సంబంధిం చిన అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులు సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ మునీర్ అహ్మద్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

తన నివాసంలో శింగణమల ఎమ్మెల్యే బండారు శ్రవణిశ్రీ ప్రెస్ మీట్

జడ్పిటిసీ, ఎంపిటిసి ఎన్నికల్లో కూటమిని 70 శాతం విజయంతో ఆశీర్వదించిన ప్రజలు



ప్రజాభూమి, పుట్లూరు.

ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నట్లు ఈ ఎన్నికలతో తెలుస్తోంది.. అందరికి కృతజ్ఞతలు .ప్రజల కోసం పని చేస్తున్న ప్రభుత్వం ఇది.. ఓటమి చూసిన ప్రాంతాల పై దృష్టి పెడతాం.శింగణ మల నియోజకవర్గం అంటే టీడీపీకి కంచుకోట.. 6 జడ్పిటిసీల్లో 4 గెలి చాం. పుట్లూరు, ఎల్లనూరులో ఫ్యాక్షన్ కి స్వస్తిపలికి టీడీపీని గెలిపించారు. గతంలో ప్రాణాలు తీసే ఎన్నికలను వైసీపీ నిర్వహించింది.. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదం. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదు.. గత అరాచక, అక్రమాలు ఇంకా మరవలేదు పోలీసు వ్యవస్థ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తే.. పోలీసులపై ఆరోపించారు.చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమంతో కూటమి పాలన ముందుకు వెళుతోంది. రానున్న పంచాయతీ ఎన్నికల్లోను సమన్వయ లోపం లేకుండా కూటమి విజయం సాధిస్తుంది. మాజీ జెడ్పిటిసి రామలింగారెడ్డి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మాజీ జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్ బాబు, టిడిపి నేతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7
శుక్రవారం 13 నవంబరు 2026

సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యం

- కార్యకర్తలు సమిష్టి కృషితో పనిచేయాలి: చమర్తి జగన్మోహన్ రాజు



ప్రజాభూమి, సిద్ధవటం: రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అంకితభావంతో సమిష్టి కృషి చేయాలని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన సిద్ధవటంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం స్థానిక సర్పంచ్ ఎన్నికలపై కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల సమయంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీ కార్యకర్తలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన విషయాన్ని కార్యకర్తలు గుర్తు చేసుకోవాలని అన్నారు. రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి పొత్తులో భాగంగా స్థానాలను సర్దుబాటు చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సీట్ల పంపకాల్లో తప్పనిసరిగా పొత్తు ధర్మాన్ని పాటిస్తోందన్నారు. ప్రతి గ్రామంలో పార్టీకి బలమైన నాయకత్వం ఉండాలని, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలకు గ్రామస్థాయి పదవులతో పాటు సర్పంచ్, నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత, న్యాయం కల్పిస్తామని చమర్తి జగన్మోహన్ రాజు హామీ ఇచ్చారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని పొత్తు ధర్మంలో భాగంగా రాష్ట్ర నాయకత్వం జనసేన పార్టీకి కేటాయించిందని, రాబోయే రోజుల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని టీడీపీ కార్యకర్తలకు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్పంచ్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని నాయకులు సూచించారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల టీడీపీ అధ్యక్షుడు రాజశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శనివారపు మోహన్‌రెడ్డి, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ దారపునేని రాజానాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు దారపునేని దశరథనాయుడు, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఆర్గనైజర్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సంజీవరాయుడు, మాజీ మార్కెట్ చైర్మన్ సయ్యద్ జవహర్ భాష, టీడీపీ పార్లమెంట్ మాజీ ఉపాధ్యక్షుడు పుత్త రామచంద్రయ్య తదితర ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

జనసేనలో చేరేందుకు యువత ఆసక్తి

-కొత్త మాధవరంలో అతికారి కృష్ణకు ఘనస్వాగతం



ప్రజాభూమి, ఒంటిమిట్ట: ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం గ్రామానికి చెందిన శ్రీను ఫోటో స్టూడియో అధినేత ఆమంచి శీను ఆధ్వర్యంలో పలువురు యువకులు జనసేన పార్టీలో చేరేందుకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణను ఘనంగా ఆహ్వానించి, శాలువాతో సత్కరించారు. జనసేన పార్టీ నాయకత్వంలో పనిచేస్తూ రానున్న స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తామని యువకులు తెలిపారు. తమకు అండగా నిలిచి రాజకీయంగా ప్రోత్సహించాలని అతికారి కృష్ణను కోరారు. ఈ సందర్భంగా అతికారి కృష్ణ మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావడం శుభపరిణామమన్నారు. స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కూటమి విజయానికి కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీని నమ్ముకుని పనిచేసే వారికి తగిన గుర్తింపు, సముచిత స్థానం కల్పిస్తామని, యువతకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొత్త మాధవరం గ్రామానికి చెందిన యువకులు, పెద్దలు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి విజయం.. బద్వేలు నియోజకవర్గ ప్రజల తీర్పుకు నిదర్శనం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమ పాలనకు ప్రజల మద్దతు: బద్వేలు ఏఎంసీ చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ



ప్రజాభూమి పోరుమామిళ్ల :
బద్వేలు నియోజకవర్గంలో కూటమి పార్టీల విజయం ప్రజల తీర్పుకు నిదర్శనమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పాలనకు ఈ విజయం ప్రతిబింబమని బద్వేలు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ అన్నారు. పోరుమామిళ్లలో మీడియాతో మాట్లాడిన ఆమె, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నిరంతరం అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తూ, ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తున్న దూరదృష్టి కలిగిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. బద్వేలు నియోజకవర్గ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణరెడ్డి నాయకత్వం, మార్గదర్శకత్వంలో కూటమి పార్టీల అభ్యర్థులు విజయం సాధించడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న సూర్యనారాయణరెడ్డి నాయకత్వంలో బద్వేలు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారం, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మద్దతు రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కీలకమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరింత ప్రగతి సాధిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టమైన విజన్ కలిగిన నాయకుడని, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నారని నారిశెట్టి సుప్రజ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బద్వేలు నియోజకవర్గ అభివృద్ధికి సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యం లో మరింత కృషి చేస్తామని ఆమె తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్త.. ప్రమాదాలపై అప్రమత్తత

విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళల భద్రతపై అవగాహన



ప్రజాభూమి,పులివెందుల
విద్యార్థులు ఆన్లైన్ మోసాలపై జాగ్రత్త వహించాలని అలాగే రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అర్బన్ సీఐ పురుషోత్తం రాజు విద్యార్థులకు సూచించారు.జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, పులివెందుల డీఎస్పీ బి. మురళి నాయక్ పర్యవేక్షణలో అర్బన్ సీఐ పురుషోత్తం రాజు ఆధ్వర్యంలో పోలీసులు పట్టణంలోని లయోల డిగ్రీ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న మోసపూరిత విధానాలు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సోషల్ మీడియా బాధ్యతాయుత వినియోగంపై విద్యార్థులకు వివరించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లు, ఉచిత ఆఫర్లు లేదా గేమింగ్ లింకులను క్లిక్ చేయవద్దు అని ఆయన తెలిపారు. వ్యక్తిగత ఫోటోలు, వీడియోలను పబ్లిక్ సెట్టింగ్స్‌లో పోస్ట్ చేయకుండా ప్రైవసీ ఫీచర్లను వాడాలన్నారు .మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు.కళాశాలల్లో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ లేదా స్టేకింగ్ వంటివి నేరాలు చేస్తున,వీటిని మౌనంగా భరించకుండా కళాశాల యాజమాన్యం లేదా పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలి అని ఆయన తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ తప్పనిసరిగా వినియోగించడం, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడిన వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు, అత్యవసర పోలీస్ సహాయం కోసం 112కు ఫోన్ చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిమోతి ,కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య లోపంతో ప్రజలకు ఇబ్బందులు

- కడపాయపల్లెలో పేరుకుపోయిన చెత్త..

అంటువ్యాధుల భయంతో స్థానికులు



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని కడపాయపల్లె గ్రామంలో పారిశుద్ధ్య లోపం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపంతో పాటు పలు ప్రాంతాల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయని, రాత్రి వేళల్లో దోమల బెడద అధికంగా ఉంటోందని గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య సమస్యను వెంటనే పరిష్కరించి, విషజ్వరాలు, అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని వారు కోరారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి నవీనను వివరణ కోరగా, నిల్వ ఉన్న వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులతో తొలగించి, పరిసర ప్రాంతాల్లో బ్లీచింగ్‌తో పాటు అవసరమైన క్రిమిసంహారక మందులు పిచికారీ చేయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మూడు రోజులుగా తాగునీటి కోసం అవస్థలు

- ఖాళీ బిందెలతో టక్కోలి ఎస్సీ కాలనీ మహిళల నిరసన



ప్రజాభూమి, సిద్ధవటం:
మండలంలోని టక్కోలి గ్రామ ఎస్సీ కాలనీలో గత మూడు రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో స్థానిక మహిళలు గురువారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. కాలనీలోని నీటి ట్యాంకుల వద్ద నీరు రాకపోవడంతో తాగునీటి కోసం రైతుల పంట పొలాల నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ తాగునీటి మోటార్లకు విద్యుత్ అంతరాయం ఏర్పడిందని, సమస్య పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఇంకా పరిష్కారం కాలేదన్నారు. కాలనీ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీటెక్ రవి ఇచ్చిన హామీని నెరవేర్చిన సింహాద్రిపురం జడ్పీటీసీ మారెడ్డి భరత్ రెడ్డి

బోనాల డప్పు కళాకారులకు డప్పులు పంపిణీ చేసిన



జడ్పీటీసీ భరత్ రెడ్డి
ప్రజాభూమి, పులివెందుల
ఇంటి ఇంటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా బోనాల గ్రామాన్ని సందర్శించిన సమయంలో డప్పు కళాకారులు డప్పులు ఇప్పించాలని పులివెందుల తెలుగుదేశం ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి ని కోరారు. కచ్చితంగా డప్పు కళాకారులకు డప్పులు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు గురువారం పులివెందుల తెలుగుదేశం కార్యాలయంలో సింహాద్రిపురం జడ్పీటీసీ మారెడ్డి భరత్ రెడ్డి డప్పు కళాకారులకు డప్పులను పంపిణీ చేశారు. బీటెక్ రవి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ డప్పులు అందజేయడంతో కళాకారులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లింగాల మండల తెలుగుదేశం అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి , లింగాల మండల తెలుగుదేశం ఇన్‌ఛార్జ్ దేవిరెడ్డి సంజీవ రెడ్డి , తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి అజ్జగుట్టు రవితేజ రెడ్డి,బోనాల తెలుగుదేశం నాయకుడు సోమశేఖర్ రెడ్డి , వెంకట్రామిరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ సేవలకు నగదు చెల్లింపులు నిలిపివేత

నేటి నుంచి ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు - మున్సిపల్ కమిషనర్ తనూజ



ప్రజాభూమి, పులివెందుల
నేటి నుంచి మున్సిపల్ సేవలకు సంబంధించి మున్సిపల్ కార్యాలయంలో గానీ, వార్డు సచివాలయాల్లో గానీ నగదు చెల్లింపులు స్వీకరించబ డవని మున్సిపల్ కమిషనర్ తనూజ తెలిపారు.మున్సిపల్ సేవలకు సంబంధించిన అన్ని చెల్లింపులు ఇకపై వెబ్‌సైట్, వాట్సాప్ మనమిత్ర ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో చేయాలని సూచించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఆన్‌లైన్ చెల్లింపు విధానాన్ని వినియోగించుకో వాలని కోరారు.

కార్తీక మాస తొలి గురువారం

- దీపకాంతుల్లో వెలిగిన సాయినాథుడు

- సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం



ప్రజాభూమి, పులివెందుల :
పులివెందుల పట్టణంలోని పార్నపల్లె రోడ్డులోని మొట్టమొదటి సాయిబాబా దేవాలయంలో కార్తీక మానం మొదటి గురువారాన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకులు మురళి స్వామి ఆధ్వర్యంలో సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి స్వామివారికి కాకడ హారతి, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అష్టోత్తరం, శతనామావళి తదితర పూజా కార్యక్రమాలు నిర్వ హించారు. అనంతరం స్వామివారు ప్రత్యేక అలం కరణలో కార్తీక మాస దీప వెలుగుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకు లు మురళీ మాట్లాడుతూ మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి, సాయంకాలం 6 గంటలకు సంధ్యా హారతి, రాత్రి 9 గంటలకు శేజ హారతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి గురువారం ఆలయంలో భక్తుల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకుంటున్నారన్నారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించే వారు ఆలయ అర్చకులను సంప్రదించాలని కోరారు.

విశ్వాస్ భారత్ పోటీల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ

- **కంబగిరి స్వామికి ప్రథమ బహుమతి.. నాసీర్ అహ్మద్‌కు తృతీయ బహుమతి**
- **విజేతలను అభినందించిన డైరెక్టర్ విజయ్ ప్రకాష్**



ప్రజాభూమి, వేంపల్లె
విశ్వాస్ భారత్ యువజన పార్లమెంట్ పోటీల్లో ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించడం అభినందనీయమని డైరెక్టర్ ప్రొఫెసర్ జీ. విజయ్ ప్రకాష్ అన్నారు. గురువారం విజేతలను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఇదే స్ఫూర్తితో ఉత్తమ ప్రతిభ కనబరిచి విశ్వవిద్యాలయానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన మార్గదర్శకులు, మెంటార్లను అభినందించారు. నవంబర్ 6న ప్రొద్దుటూరులోని సీబీఐటీ కళాశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్న కంబగిరి స్వామి ప్రథమ బహుమతి, నాసీర్ అహ్మద్ తృతీయ బహుమతి సాధించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారిణి డా. రత్నకుమారి, ఎన్ఎస్ఎస్ అధికారి డా. కోనప్ప పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆరేళ్లుగా మందుల సహాయం

నిరంతరం అండగా నిలుస్తున్న మనఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ



ప్రజాభూమి, సిద్ధవటం: మానవతా దృక్పథంతో 'మన ఊరికోసం' స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కడప ఇందిరానగర్‌కు చెందిన క్యాన్సర్ బాధితుడు బాబ్జీకి గత ఆరు సంవత్సరాలుగా ప్రతి నెలా రూ. 2 వేలకుపైగా విలువైన మందులను అందిస్తున్నారు. ఇందులో భాగంగా సంస్థ చైర్మన్ అవ్వారు రవిశంకర్ గురువారం బాబ్జీని పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ఈ నెలకు అవసరమైన మందులను అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో క్యాన్సర్ చికిత్స పొందుతున్న బాబ్జీకి నిరంతరం మందుల సహాయం అందిస్తున్న ముగ్గురు అజ్ఞాత దాతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేదలకు అండగా నిలిచే ఇటువంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు యాగల చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థులకు దోమతెరల పంపిణీ

- దోమకాటు వ్యాధుల నివారణపై విద్యార్థులకు అవగాహన- సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య



ప్రజాభూమి, వేంపల్లె
ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు దోమతెరలు పంపిణీ చేసినట్లు పులివెందుల మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. గురువారం వేంపల్లెలోని ఏపీ గురుకుల ఉర్దూ బాలికల పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు దోమతెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఉజ్వల భవిష్యత్తును సాధించగలరని అన్నారు. దోమల బెడద నుంచి రక్షణ పొందేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దోమతెరల వినియోగంతో దోమకాటు ద్వారా వ్యాపించే వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. మలేరియా తదితర వ్యాధుల నివారణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వసతి గృహాలు, విద్యాసంస్థల పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లు త్రినాథ్, సుగుణమ్మ, వైద్య ఆరోగ్య సిబ్బంది వెంకటరత్నం, ఫకృద్దీన్, అంకయ్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 8
శుక్రవారం 13 నవంబరు 2026

జనాభా గణన విజయవంతానికి సమన్వయం, టీమ్ వర్క్ అత్యంత ముఖ్యం -: సి.పి.ఓ రాజశేఖర్



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి. తిరువతి, గురువారం జిల్లాలో జనాభా గణన (సెన్సెస్--2027) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో, సమష్టి కృషితో పనిచేయాలని సి.పి.ఓ రాజశేఖర్ సూచించారు.గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మీటింగ్ హాల్ నందు జనగణన--2027లో భాగంగా నిర్వహించనున్న జనాభా గణన ప్రక్రియకు సంబంధించి జిల్లాలో జిల్లా స్థాయి, మున్సిపల్ కార్పొరేషన్ స్థాయి, ఛార్జ్ స్థాయి జనగణన అధికారులకు సి.పి.ఓ రాజశేఖర్, జిల్లా కో ఆర్డినేటర్ ఆఫ్ సెన్సస్ రమాదేవి జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి, మాస్టర్ ట్రైనర్ ఉదయ్, సుధా రాణి లతో కలసి సంబందిత జనగణన కు కేటాయించిన సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.పి.ఓ మాట్లాడుతూ.... జనాభా గణన కార్యక్రమంలో టీమ్ వర్క్ అత్యంత కీలకమని, ప్రతి అధికారి తమకు కేటాయించిన బాధ్యతలను స్పష్టంగా అర్థం చేసుకుని సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు టీమ్ లీడర్లుగా బాధ్యతలు చేపట్టి జనాభా గణన ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్లు ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు జనాభా గణన విధివిధానాలు, వివరాల సేకరణ ప్రక్రియపై సమగ్ర శిక్షణ అందించాలని తెలిపారు.శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు క్షేత్రస్థాయిలో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు నాణ్యమైన శిక్షణ అందించి, జనాభా గణన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని సూచించారు. ప్రతి దశలో సమన్వయం, ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ, బాధ్యతాయుతమైన విధుల నిర్వహణ ద్వారా తిరుపతి జిల్లాలో జనాభా గణన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు జన గణన పై సంబందిత సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సంబంధిత జనగణన అధికారులు, మాస్టర్ ట్రైనర్లు, తహశీల్దార్లు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శి ప్రత్యేక దృష్టి
నిల్వ నీటిపై బ్లీచింగ్ పౌడర్ చల్లింపు.. దోమల నివారణకు చర్యలు

ప్రజా భూమి ప్రతినిధి - బుచ్చినాయుడు కండ్రిగ



తిరువతి జిల్లా, బి.ఎన్. కండ్రిగ మండలం, నెలవాయి గ్రామపంచాయతీలో పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శి ప్రత్యేక దృష్టి సారించారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామంలోని రోడ్లకు ఇరువైపులా ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో దోమల బెడద పెరిగే అవకాశం ఉందని గుర్తించి నివారణ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రోడ్డు పక్కన నిల్వ ఉన్న నీటి ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించి దోమల వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు తీసుకున్నారు గ్రామంలో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. ప్రజలకు ఎలాంటి అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో భాగంగా ఈ చర్యలు చేపట్టడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన పేట వైకాపా నాయకులు- కిలివేటి సంజీవయ్య

ప్రజాభూమి ప్రతినిధి నాయుడుపేట.

తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డికి పూల బొకే అందజేశారు.నాయుడుపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించి,తంబిరెడ్డి రాజేశ్వరమ్మ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా విజయం సాధించిన సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను,రాజేశ్వరమ్మని మరియు నాయకులను అభినందించారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలపై నమోదైన కేసులు, పోలీసుల వేధింపులు, ముఖ్యంగా కిలివేటి సంజీవయ్యపై సీఐ దాడి ఘటనకు సంబంధించిన అంశాలను సజ్జల రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు,ఈ ఘటనలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన ఫిర్యాదు పత్రాన్ని కూడా ఆయనకు అందజేశారు.ఈ అంశాలపై చర్చించి,నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా నిలవడంతో పాటు న్యాయపరంగా తగిన చర్యలు తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తంబిరెడ్డి సుబ్బరమణ్యం రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి మోహన్ రెడ్డి,సూళ్లూరుపేట నియోజకవర్గ పరిశీలకులు బీరదవోలు శ్రీకాంత్ రెడ్డి గారు, నాయుడుపేట మున్సిపల్ చైర్‌పర్సన్ తంబిరెడ్డి రాజేశ్వరమ్మ,నాయుడుపేట మాజీ ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, టీఎంఆర్ గ్రూప్ అధినేత తంబిరెడ్డి మోహన్ రెడ్డి,నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి,జిల్లా కార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డి,ఓజిలి మండల అధ్యక్షులు పాదర్తి హరినాథరెడ్డి,నాయుడుపేట రూరల్ అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్,జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి చదలవాడ కుమార్,గొట్టికాట రవీందర్ రెడ్డి,తంబిరెడ్డి సురేష్ రెడ్డి,విజల్ రెడ్డి,తంబిరెడ్డి హేమకుమార్ రెడ్డి చంద్ర రెడ్డి,తోపాటు పలువురు నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



వైద్య వృత్తిలో నైతిక విలువలు, రోగి సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
విద్యార్థులకు ఆరు సంవత్సరాల వైద్య విద్య ఒక అద్భుతమైన ప్రయాణం - జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్







ప్రజా భూమి ప్రతినిధి,రేణిగుంట / తిరుపతి, వైద్య వృత్తి దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అత్యంత గౌరవప్రదమైన వృత్తి అని, వైద్య విద్యను అభ్యసించే ప్రతి విద్యార్థి రోగి సంక్షేమాన్ని, వైద్య నైతిక విలువలను అత్యంత ప్రాధాన్యతగా పరిగణించాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం ఉదయం రేణిగుంట ఎయిర్‌పోర్ట్ సమీపంలో వున్న శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్, హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమం, వైట్ కోట్ సెరిమనీ, ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వైద్య విద్యార్థులుగా తమపై ఉన్న బాధ్యతను గుర్తించి, వైద్య వృత్తిని ఒక గొప్ప సవాల్‌గా స్వీకరించాలని సూచించారు. ఏ చికిత్స అందించినా, రోగ నిర్ధారణ చేసినా రోగి పట్ల శ్రద్ధ, బాధ్యత, మానవతా దృక్పథం కలిగి ఉండాలన్నారు. వైద్య రంగంలో వైద్య నైతికతకు ఎంతో ప్రాధాన్యత ఉందని, గత రెండు మూడు దశాబ్దాల్లో వైద్య నైతిక ప్రమాణాల్లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఎక్కడ పనిచేసినా ఆర్థిక, భౌతిక ప్రయోజనాల కంటే వృత్తిపరమైన ప్రమాణాలు, నైతిక విలువలకు కట్టుబడి ఉండాలన్నారు. తాను గతంలో రాష్ట్ర ఆరోగ్య శాఖలో, ఎండీ ఎన్‌హెచ్‌ఎం కమిషనర్‌గా పనిచేసిన అనుభవంతో వైద్య రంగంలో ఎదురయ్యే అనేక పరిస్థితులను పరిశీలించానని, అందువల్ల వైద్య విద్యార్థులు ప్రారంభం నుంచే నైతిక విలువలను అలవర్చుకోవాలని సూచించారు.రాబోయే ఆరు సంవత్సరాలు విద్యార్థుల జీవితంలో అత్యంత కీలకమైనవని, ఈ సమయాన్ని చదువుతో పాటు మంచి స్నేహ సంబంధాలు ఏర్పరచుకోవడానికి, అనుభవాలను పంచుకోవడానికి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వైద్య విద్యలో సహచరులతో కలిసి ఆరు సంవత్సరాలు గడిపే అరుదైన అవకాశం లభిస్తుందని, ఈ ప్రయాణాన్ని ఆనందంగా ఆస్వాదించాలన్నారు. వైద్య విద్యార్థులు చదువులో అనవసరమైన ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలని, కేవలం పాఠ్యాంశాలను కంఠస్థం చేయడానికే పరిమితం కాకుండా వాటిలోని ప్రాథమిక సూత్రాలు, అంతర్లీన విషయ పరిజ్ఞానాన్ని అర్థం చేసుకుంటూ ఆచరణాత్మకంగా నేర్చుకోవాలని సూచించారు. ఫార్మకాలజీ వంటి కొన్ని వైద్య శాస్త్ర అంశాల్లో గుర్తుంచుకోవాల్సిన విషయాలు ఉన్నప్పటికీ, వాటి సారాంశాన్ని అర్థం చేసుకుంటే భవిష్యత్తులో వైద్య సేవలు అందించడం మరింత సులభమవుతుందని వివరించారు. విద్యార్థులు తమ వృత్తిని ప్రేమించాలని, మంచి స్నేహాలను ఏర్పరచుకోవాలని, గురువులను గౌరవించాలని, ఉన్నతమైన లక్ష్యాలతో ముందుకు సాగుతూ సమాజానికి ఉత్తమ వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. 2026-27 బ్యాచ్ విద్యార్థులందరికీ కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడు, తిరువనంతపురం ఆదాయపు పన్నుల శాఖ కమిషనర్ సురేష్ శివానందన్, ఐఆర్ఎస్, పరాలాఖేముండి ఎమ్మెల్యే రూపేష్ కుమార్ పాణిగ్రాహి, శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్ సీఈఓ డా. తిరుపతి పాణిగ్రాహి, శ్రీ సాయిరామ్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ శ్రీసాయి ప్రకాష్ లీలాముత్తు, సురేష్ కుమార్ పాణిగ్రాహి, డా. రాకేష్ కుమార్ పాణిగ్రాహి, భిలాయ్ సూరజ్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. ఎం. రాజశేఖర్, భువనేశ్వర్ హైటెక్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ ప్రిన్సిపాల్ డా. దేవానంద మహాపాత్ర, కళాశాల యాజమాన్య ప్రతినిధులు, విభాగాధిపతులు, అధ్యాపకులు, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నం.. నిందితుడి అరెస్ట్
పోలీసుల చాకచక్యంతో నిందితుడి పట్టివేత.. ప్రజలకు అవగాహన కల్పించిన అధికారులు

ప్రజా భూమి ప్రతినిధి - బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా, బి.ఎన్. కండ్రిగ పోలీస్ స్టేషన్ పరిధిలో పదేళ్ల మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నించిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ పావని, సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై హరిప్రసాద్ వివరాలను వెల్లడించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం వరదయ్యపాలెం మండలం చెన్నవారిపాలెం గ్రామానికి చెందిన బి. పోలయ్య (41) ఈ నెల 10వ తేదీన మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో గ్రామ సమీపంలో ఆడుకుంటున్న పదేళ్ల బాలికను మాయమాటలతో నమ్మించి తన మోటార్ సైకిల్‌పై ఎక్కించుకున్నాడు అనంతరం ఉబ్బలమడుగు జలపాతాలకు వెళ్లే మార్గంలోని తెలుగు గంగ కాలువ కట్ట వైపు తీసుకెళ్లి కుక్కంబాకం గ్రామ శివారులోని చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగిక దాడికి యత్నించినట్లు తెలిపారు. ఈ క్రమంలో బాలిక గట్టిగా కేకలు వేయడంతో ఆమె బంధువులతో పాటు అక్కడికి చేరుకున్న ఇద్దరు అటవీశాఖ ఫారెస్ట్ గార్డులను గమనించిన నిందితుడు బాలికను అక్కడే వదిలేసి, తన మోటార్ సైకిల్‌ను సైతం విడిచిపెట్టి పరారయ్యాడుసంఘటనా స్థలంలో లభించిన మోటార్ సైకిల్‌లోని పౌచ్‌లో ఉన్న ఆధార్ కార్డు, సెక్యూరిటీ ఐడెంటిటీ కార్డు, ఆర్‌సీ పత్రాల ఆధారంగా పోలీసులు నిందితుడిని గుర్తించారు. బాధిత బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బి.ఎన్. కండ్రిగ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 122/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం ఉదయం 10 గంటల సమయంలో కడూరు క్రాస్ వద్ద నిందితుడు బి. పోలయ్యను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు అధికారులు వెల్లడించారు భారతీయ న్యాయ సంహిత పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు

బాలికల భద్రత అందరి బాధ్యత

ఈ సందర్భంగా డీఎస్పీ పావని మాట్లాడుతూ బాలికలు, చిన్నారుల భద్రత విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల మాయమాటలు నమ్మవద్దని, వారు ఇచ్చే బహుమతులుదబ్బులు, తప్పుడు హామీలకు ఆకర్షితులు కావద్దని తెలిపారు చిన్నారులను ఒంటరిగా నిర్మానుష్య ప్రాంతాలకు పంపించకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.ఎవరైనా బలవంతంగా వాహనంపై ఎక్కించేందుకు ప్రయత్నించినాఅసభ్యంగా ప్రవర్తించినా వెంటనే గట్టిగా కేకలు వేస్తూ సమీపంలోని వారి సహాయం కోరాలని బాలికలకు సూచించారు గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు గుర్తించినా బాలలపై వేధింపులకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. అత్యవసర పోలీస్ సహాయం కోసం 112, బాలల సహాయం కోసం 1098, మహిళా హెల్ప్‌లైన్ కోసం 181 నంబర్లను సంప్రదించాలని పోలీసులు సూచించారు. బాలికల భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు.. ప్రతి తల్లిదండ్రి, ప్రతి గ్రామస్తుడి సామాజిక బాధ్యత చిన్నారుల రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బి.ఎన్. కండ్రిగ పోలీసులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

నాయుడుపేట మున్సిపల్ విజయంపై వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన చైర్‌పర్సన్ రాజేశ్వరమ్మ..
సూళ్లూరుపేట నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై కాకాణి, కిలివేటితో జగన్ ప్రత్యేక చర్చ



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట: నాయుడుపేట మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన తంబిరెడ్డి రాజేశ్వరమ్మ, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, టీఎంఆర్ గ్రూప్ అధినేత తంబిరెడ్డి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రాజేశ్వరమ్మ వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. నాయుడుపేట మున్సిపాలిటీలో పార్టీ సాధించిన విజయానికి సంబంధించిన పోలింగ్ బుక్‌ను అందజేశారు. నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికైన రాజేశ్వరమ్మను జగన్ ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం కాకాణి గోవర్ధన్ రెడ్డి, కిలివేటి సంజీవయ్యతో జగన్ ప్రత్యేకంగా సమావేశమై సూళ్లూరుపేట నియోజకవర్గ రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా కిలివేటి సంజీవయ్య ఎదుర్కొంటున్న పోలీసుల వేధింపులు, ముందస్తు నోటీసులు, హౌస్ అరెస్టులు, రాజకీయపరమైన ఇబ్బందులను జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలుస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని జగన్ సూచించారు. నాయుడుపేట మున్సిపాలిటీలో సాధించిన విజయం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని, ఇదే ఐక్యతతో సూళ్లూరుపేట నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కిలివేటి సంజీవయ్యకు దిశానిర్దేశం చేశారు.

పోషన్ భి పఢాయీభి పై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

సరస్వతి బాయ్ మునిసిపల్ హై స్కూల్ నందు రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా తోటంబెడు మండలం అంగన్వాడి కార్యకర్తలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ శాంతి దుర్గ ఆధ్వర్యంలో జరిగినది. ఆరు సంవత్సరాల లోపల పిల్లల యొక్క బాల్య రంభ పూర్వ ప్రాథమిక విద్య ను బలోపేతం చేయడమే దీని యొక్క ముఖ్య ఉద్దేశం. పుట్టిన వెంటనే బిడ్డ అభివృద్ధి, డెవలప్మెంట్ మైల్ స్టోన్స్, పోషన్ పక్వాడ, గ్రోత్ మానిటరింగ్, కమిటీ మేనేజ్మెంట్ ఆఫ్ మాల్ నరిషెడ్ చిల్డన్, పోషన్ ట్రాకర్ ఆప్ ని వాడకం, గృహ సందర్శనలో షెడ్యూలు గురించి తెలియజేశారు. ఇందులో అంగన్వాడీ కార్యకర్తలు ద్వారా గ్రూప్ యాక్టివిటీస్ ప్రజెంటేషన్లు చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్స్ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



నాయుడుపేట మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు ముమ్మర ఏర్పాట్లు
పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా విడుదల చేసిన ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ.



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట..

రానున్న గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల--2026 నేపథ్యంలో నాయుడుపేట మండల పరిధిలో ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా మండలంలోని గ్రామ పంచాయతీల వారీగా పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ విడుదల చేశారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల వారీగా ఓటర్ల సంఖ్య, ప్రతిపాదిత పోలింగ్ కేంద్రాల వివరాలు, నిర్వహణ భవనాలు, ప్రతి కేంద్రానికి సగటు ఓటర్ల సంఖ్య వంటి వివరాలను ఈ జాబితాలో పొందుపరిచారు. అన్నమేడు, అరవపెరిమిడి, భీమవరం, చిగురుపాడు, చిలమత్తూరు, ద్వారకాపురం, గొట్టిప్రోలు, జువ్వలపాళెం, కల్లిపేడు, కాపులూరు, కూచివాడ, మర్లపల్లి, మేముగుంటపాలెం, మేనకూరు, పండ్లూరు, పూడేరు, పుదూరు, తిమ్మాజికండ్రిగ, విన్నమాల సహా మండలంలోని గ్రామ పంచాయతీలకు సంబంధించిన వివరాలు అందుబాటులో ఉన్నాయి. ఎన్నికల మార్గదర్శకాల ప్రకారం ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించారు. ఓటర్లకు సౌకర్యంగా ఉండేలా, ఎన్నికల విధులు సజావుగా సాగేలా కేంద్రాల ఎంపికపై అధికారులు దృష్టి సారించారు. ముసాయిదా జాబితాలో పొందుపరిచిన వివరాలను పరిశీలించి, అవసరమైతే సర్దుబాట్లు చేసే అవకాశం ఉంటుంది.ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను చేస్తున్నట్లు ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ తెలిపారు.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు
9
శుక్రవారం 13 నవంబరు 2026

క్రమశిక్షణే పునాది.. ప్రపంచ స్థాయి కొలువులే లక్ష్యం..!

విద్యార్థులు, తల్లిదండ్రులతో ఎంబీయూ ఛాన్సలర్ డాక్టర్ మోహన్ బాబు..

ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి:





క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యే తమ ప్రధాన ధ్యేయమని, క్యాంపస్‌లో అడుగుపెట్టిన ప్రతి విద్యార్థి తన బిడ్డతో సమానమని ప్రముఖ విద్యావేత్త, మోహన్ బాబు యూనివర్సిటీ ఛాన్స్‌లర్ డాక్టర్ మంచు మోహన్ బాబు పేర్కొన్నారు. గురువారం యూనివర్సిటీ ఓపెన్ ఆడిటోరియంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఆయన ఈ విద్యా సంవత్సరంలో (2026- 27) జాయిన్ అయిన విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు. కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, విలువలతో కూడిన విద్యను అందిస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నామని ఆయన తెలిపారు. తమ ప్లేస్‌మెంట్ సెల్ ద్వారా ఎంతోమంది విద్యార్థులు అత్యున్నత వేతనాలతో ప్రపంచవ్యాప్తంగా ప్రతిష్టాత్మక సంస్థల్లో ఉద్యోగాలు సాధించడం ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు. వివిధ ఉన్నత స్థానాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు అప్పుడప్పుడు ఫోన్ చేసి, తమ విజయానికి యూనివర్సిటీ వేసిన బాటలే కారణమని కృతజ్ఞతలు తెలుపుతుంటే ఒక విద్యాసంస్థ అధినేతగా ఎంతో గర్వంగా అనిపిస్తుందని మోహన్ బాబు అన్నారు. అంతేకాకుండా, సివిల్ సర్వీసెస్ వైపు అడుగులు వేయాలనుకునే విద్యార్థులకు ఆయన ఒక గొప్ప వరాన్ని ప్రకటించారు. యూనివర్సిటీలో చదువుకుని ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ వంటి ఉన్నత సివిల్ సర్వీస్ ఉద్యోగాలను సాధించాలనే లక్ష్యం ఉన్న విద్యార్థులకు సంస్థ తరపున పూర్తిగా ఉచిత శిక్షణ అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ ప్రకటనతో ప్రాంగణమంతా విద్యార్థులు, తల్లిదండ్రుల హర్షధ్వానాలతో మారుమోగింది. తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో తమ పిల్లలను యూనివర్సిటీకి పంపిస్తున్నారని, వారి ఆశయాలను నిజం చేసే బాధ్యత తమపై ఉందని ఛాన్స్‌లర్ స్పష్టం చేశారు. విద్యాప్రమాణాల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, క్రమశిక్షణతో కూడిన వాతావరణంలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. ఆత్మీయ వాతావరణంలో సాగిన ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పి.వి. రమణ, రిజిస్ట్రార్ సారథి, ఫైనాన్స్ ఆఫీసర్ రవిశంకర్, వివిధ విభాగాల డీన్స్, అధ్యాపకులు, సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చదువుకు దూరమైన వారికి ఓపెన్ స్కూల్‌తో మరో అవకాశం!

ఈ నెల 30 వరకు పదో తరగతి, ఇంటర్ ప్రవేశాల గడువు పొడిగింపు.. అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలి: ఎంఈఓలు

ప్రజా భూమి ప్రతినిధి
– బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా, బి.ఎన్. కండ్రిగ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారువివిధ కారణాలతో చదువును మధ్యలోనే నిలిపివేసిన వారికి తిరిగి విద్యను కొనసాగించే అవకాశం కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు కె. రవీంద్రనాథ్, ఏ. మునిసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పదో తరగతి పూర్తి చేయకుండా చదువుకు దూరమైన వారిని గుర్తించి ఓపెన్ స్కూల్‌లో చేర్పించాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసేలా వారికి తగిన అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ ఉపాధ్యాయినులు, గ్రామ విద్యావేత్తలను కోరారు. ఓపెన్ స్కూల్ ద్వారా విద్యను పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేటు పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు పొందడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ తదితర అవసరాలకు కూడా విద్యార్హత ధ్రువపత్రాలు ఉపయోగపడతాయని వివరించారు. చదువును మధ్యలో ఆపేసిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ విద్యార్హతలను పెంపొందించుకోవాలని తెలిపారు.

ఈ నెల 30 వరకు ప్రవేశాల గడువు పొడిగింపు ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు అధికారులు వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో చదువుకు దూరమైన వారిని గుర్తించి ప్రవేశాలు పొందేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయినులు, గ్రామంలోని పలువురు విద్యావేత్తలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కె. రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకులతో ఆత్మీయ సమావేశం





ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట

ప్రస్తుతం జరిగిన జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికలలో రేణిగుంట పట్టణంలో పార్టీ కోసం పనిచేసిన వైయస్సార్సీపి నాయకులు, కార్యకర్తల తో పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ అధ్యక్షతన గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా డిసిసిబి మాజీ అధ్యక్షుడు సిద్ధగుంట సుధాకర్ రెడ్డి జడ్పిటిసి మాజీ సభ్యులు తిరుమలరెడ్డి, ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గంగారి రవేష్ పాల్గొని కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం జరిగిన జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికలలో పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అధికార పార్టీ ప్రలోభాలకు లోను కాకుండా జడ్పిటిసి ఎన్నికలలో విజయం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరిని అభినందించారు. జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల సందర్భంగా నామినేషన్ల దగ్గర నుంచి అధికార పార్టీ ఎన్ని అడ్డంకులు కల్పించిన వాటినన్నిటిని దాటి ముందుకెళ్లామని, అధికారం వాళ్ల చేతిలో ఉండడం వలన కౌంటింగ్ కేంద్రంలో కొన్ని కుతంత్రాలు చేసి విజయాన్ని సొంతం చేసుకున్నారని తెలిపారు.

నైతికంగా విజయం సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. కౌంటింగ్ కేంద్రంలో జరిగిన అవకతవకలపై న్యాయపరంగా పోరాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న పంచాయతీ ఎన్నికలలో ప్రతి ఒక్కరు పోటీ చేసి గెలుపును సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుజాత, మాజీ సర్పంచ్ నగేషం, మాజీ ఉప సర్పంచ్ ఇర్ఫాన్, తిరుపతి వెంకటరమణ, జువ్వల దయాకర్ రెడ్డి, యోగేశ్వర్ రెడ్డి, హాసన్ సాహెబ్, మహమ్మద్ రసూల్, అబ్దుల్ ఖదీర్, షబీర్ అహ్మద్, ఇరానీ ఖాదర్, మాజీ ఎంపీటీసీ నాగరాజు, శ్రీకాంత్, ఇస్మనాధన్, జాన్ బాబు, వెంకటరమణ, అరుణ్, నయ్యద్ అలీ, రమణ, చైతన్య, సుబ్బమ్మ, కృష్ణమూర్తి, పర్వీనా, జ్యోతి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల నిర్వహణలో నిబంధనలు పక్కాగా పాటించాలి

-నామినేషన్లు, ఉపసంహరణ ప్రక్రియల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదు

- ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి విధులు నిర్వహించాలి- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి కడప అర్బన్



అన్నమయ్య జిల్లాలో త్వరలో నిర్వహించనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను ఎన్నికల కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం మదనపల్లిలోని ఎన్.జె.ఆర్.ఫంక్షన్ హాలులో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి స్టేజ్-1 అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియలో స్టేజ్-1 అధికారుల పాత్ర, బాధ్యతలు, విధుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల స్వీకరణ, నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ తదితర ప్రతి దశలోనూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన హ్యాండ్‌బుక్‌ను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, అందులోని మార్గదర్శకాల ప్రకారం విధులు నిర్వహించాలన్నారు. ప్రతి అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, సందేహాలు ఉంటే ముందుగానే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలు, వివాదాలు, సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ వంటి కీలక సందర్భాల్లో అవసరమైన చోట వీడియో రికార్డింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల విధులను అత్యంత బాధ్యతాయుతంగా, పారదర్శకంగా నిర్వహిస్తూ, ఎక్కడా నిబంధనల ఉల్లంఘనకు అవకాశం లేకుండా చూడాలన్నారు. అనంతరం ఎన్నికల విధులు, నిర్వహణపై శిక్షణా కార్యక్రమాన్ని కొనసాగించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ, జిఎస్డబ్ల్యూఎస్ అధికారి అమర్నాథరెడ్డి, డీఈవో సుబ్రమణ్యం, డిఎల్డిఓలు, ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, సంబంధిత ఎన్నికల అధికారులు, స్టేజ్-1 అధికారులు తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధి సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం..- నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి పాలన

ప్రజా భూమి ప్రతినిధి కడప

-గాజుల ఖాదర్ బాషా.



అభివృద్ధి సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి పాలన జరుగుతోందని టీడీపీ సీనియర్ నేత గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. చిన్నమండెం జడ్పిటిసి ఎన్నికల్లో డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డికి,గాలివీడు జడ్పిటిసి ఎన్నికల్లో సుగవాసి ప్రసాద్ బాబు కు, సంబేపల్లి జడ్పిటిసి ఎన్నికల్లో మల్లు కరుణ గారికి. వీరి ముగ్గురి గెలుపుకు ప్రతి ఇంట ముందస్తు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారని గాజుల ఖాదర్బాషా పేర్కొన్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో సంబేపల్లి జడ్పిటిసి అభ్యర్థి కరుణతో, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి దేవపట్ల లో గాజుల ఖాదర్బాషా ఇంటింటికి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అన్ని విధాలుగా రాయచోటి నియోజకవర్గాన్ని ఇతర నియోజకవర్గాల కంటే కూడా అభివృద్ధి సంక్షేమంలో ముందుండాలని కష్టపడుతున్న ఏకైక మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అని తెలిపారు సంబేపల్లి మండలంలో ఒకపక్క నూతన రోడ్లు మరొక పక్క గ్రామీణ ప్రాంతాలలో బోర్లు వేయించి వాటికి మోటర్లు బిగించి త్రాగునీటి సమస్యను పరిష్కరిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఒక్కరే అని తెలిపారు. సంబేపల్లి మండలంలో ఉన్న రైతులకు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద వారి ఖాతాలో 7000 రూపాయలు జమ చేయడం జరిగిందని. తెలిపారు. కూటమి ప్రభుత్వం అందించిన సూపర్ సెక్స్ పథకాల వల్ల ప్రతి గ్రామంలో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

వీరస్వామికి టైలర్ సంఘం ఘన నివాళి

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి టైలర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తొట్టంబేడు బాలయ్య ఆధ్వర్యంలో వీరస్వామి మృతికి టైలర్ సంఘం సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులందరూ హాజరై సంఘం తరపున మృతుడి కుటుంబానికి అండగా రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం వీరస్వామి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలూరు శ్రీనివాసులు రెడ్డి, చెంగయ్య, రాము టైలర్, చరణ్, రమేష్, వెల్సన్ టైలర్, వాసు తదితరులు పాల్గొని వీరస్వామికి నివాళులర్పించారు.

తిరుపతిలో ఘనంగా 'జాతీయ దేవాలయ ప్రవేశ ఉత్సవం'



ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి:

''దేవుడు అందరివాడు - దేవాలయం అందరిదీ'' అనే నినాదంతో సామాజిక సమరసత వేదిక, ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో



గురువారం సాయంత్రం 6 గంటలకు తిరుపతిలోని శ్రీనివాసపురం శ్రీ శిరిడి సాయిబాబా మందిరంలో 'జాతీయ దేవాలయ ప్రవేశ ఉత్సవం' అత్యంత వైభవంగా నిర్వహించారు. 1936 నవంబరు 12న తిరువాన్మూర్ మహారాజు శ్రీ చితిర తిరునాళ్ బలరామ వర్మ అందరికీ దేవాలయ ప్రవేశం కల్పిస్తూ చేసిన చారిత్రాత్మక ప్రకటనకు గుర్తుగా ఈ ఉత్సవాన్ని జరిపారు. సామాజిక సమరసత వేదిక తిరుపతి జిల్లా అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది మోమిడి లీలాకృష్ణ దంపతులు మరియు ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక జిల్లా అధ్యక్షులు సూర్యకిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా శ్రీ శాంతి ఆశ్రమం పీఠాధిపతులు శ్రీ వేదాంత అనుభవానంద స్వామి, ఆర్ఎస్ఎస్ ధర్మ ప్రచారకులు భరత్, కిరణ్ కుమార్, శిరిడి సాయిబాబా మందిర వ్యవస్థాపకులు గంగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోమిడి లీలాకృష్ణ, సూర్యకిరణ్ మాట్లాడుతూ.. చరిత్రలో వైకోం సత్యాగ్రహం, కాలారాం మందిర ఉద్యమం, నెల్లూరులో పొట్టి శ్రీరాములు దీక్ష వంటి ఎన్నో పోరాటాల ఫలితంగా నేడు ఆలయాల్లో అందరికీ సమాన ప్రవేశం లభించిందని గుర్తుచేశారు. హిందూ సమాజం కాలానుగుణంగా సంస్కరణలను, మార్పులను ఆహ్వానించే సజీవ సమాజమని, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఆలయ ప్రవేశం లేదనే అపోహలను తొలగించి, తద్వారా జరుగుతున్న మత మార్పిడులను అరికట్టడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కమిటీ సభ్యులు, భక్తులు, స్థానికులు పాల్గొని సామాజిక సమరసత చాటారు.

రేణిగుంట గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడండి మహాప్రభో ప్లాస్టిక్ వినియోగాన్ని కట్టడి చేయండి

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



రేణిగుంట గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న అనేక కాలనీలలో చాలా రోజులు గా చెత్త కాలువల్లో పేరుకుపోయి విపరీతమైనటువంటి దుర్గంధవాసనతో, దోమల బెడదతో ప్రజలందరూ ఇబ్బంది పడుతున్నారు . ప్లాస్టిక్ వ్యర్థాల తో పట్టణమంతా పేరుకుపోతున్న చెత్త పై పంచాయతీ అధికారులు ప్లాస్టిక్ వినియోగాన్ని కట్టడి చేయవలసినఅవసరం ఎంతైనా ఉంది, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పట్టణ పురవీధుల్లో పేరుకుపోతున్న చెత్త పై, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురి అవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించితగు చర్యలు తీసుకొని గ్రామపంచాయతీని పరిశుభ్రంగా ఉంచాలని రేణిగుంట పట్టణప్రజలు ఆవేదన వ్యక్తులు చేస్తున్నారు. వాతావరణ మార్పు వల్ల , విష జ్వరాలు డెంగ్యూ, మలేరియా జరాలు, వృద్ధులు, పిల్లలు తేడా లేకుండా ప్రజలు రోగా పీడితులవుతు, అనారోగ్య పాలవుతూ, ఆసుపత్రుల కే పరిమితం అవుతున్నారు. రేణిగుంట గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర. బుగ్గ వీధిలో. వినాయక నగర్ లో. గౌరీ నగర్ లో. పాంచాలి నగర్లో కాలవలను , శుభ్రపరచాలని, పంచాయతి అధికారులు దృష్టిచారించాలని, రేణిగుంట పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి అభినయ్ రెడ్డి అభినందనలు

-తిరుపతి రూరల్ జడ్పీటీసీగా ఘన విజయం సాధించడంపై ప్రశంసలు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్



తిరుపతి రూరల్ మండల జడ్పీటీసీగా విజయం సాధించిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు భూమన అభినయ్‌రెడ్డి అభినందించారు. గురువారం భూమన అభినయ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన హర్షిత్‌రెడ్డిని ఆయన ఆప్యాయంగా కౌగిలించుకుని అభినందనలు తెలిపారు.ఎన్నికల సమయంలో ఎదురైన ప్రతికూల పరిస్థితులు, దౌర్జన్యాలను ఎదుర్కొని పోరాడి విజయం సాధించడం అభినందనీయమని అభినయ్ రెడ్డి కొనియాడారు. చంద్రగిరి నియోజకవర్గంలోనే అతిపెద్ద మండలమైన తిరుపతి రూరల్ నుంచి జడ్పీటీసీగా గెలుపొందిన హర్షిత్‌రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ ఇదే స్ఫూర్తితో పనిచేసి వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల విజయానికి కృషి చేయాలని, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని హర్షిత్‌రెడ్డికి సూచించారు.

వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని కలిసిన కొటాల చంద్రశేఖర్ రెడ్డి..!



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిగూడెం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చంద్రగిరి మండల అధ్యక్షుడు కొట్టాల చంద్రశేఖర్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో వైఎస్ఆర్ సిపి జడ్పిటిసి అభ్యర్థిగా పోటీచేసిన కొటాల చంద్రశేఖర్ రెడ్డి సతీమణి కొటాల పద్మజ ను జగన్మోహన్ రెడ్డి అభినందించారు.

ప్రజాభూమి
జనరల్ 10
శుక్రవారం 13 నవంబరు 2026

శ్రీ భవాని రామలింగేశ్వర స్వామికి కార్తీకమాస అభిషేకాలు

- వేద మంత్రోచ్చారణలతో పంచామృతాభిషేకం.. భక్తుల సందడి

ప్రజాభూమి, వేంపల్లె



స్థానిక పట్టణంలోని 90 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి దేవాలయం (మఠం) లో కార్తీకమాస అభి షేకాలు, పూజలు ప్రారంభమ య్యాయని ఆలయ అర్చకులు దుర్భాక వెంకట నరసయ్య తెలిపారు. కార్తీకమాసం మూడో రోజు సందర్భంగా స్వామివారికి వేద మంత్రోచ్చారణలతో పంచామృతాభిషేకం నిర్వహించడంతో పాటు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకు న్నారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. నివేదన, అర్చన, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్తీకమాసం మొత్తం ప్రతిరోజూ స్వామివారికి అభిషేకాలతో పాటు విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. అంతేకాకుండా వేంపల్లెకు చెందిన ఆర్యవైశ్యులు, పెంటంశెట్టి వంశీయులు ప్రతిరోజూ స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తున్నారు.

ఇఎస్ఐ కార్యాలయ నిర్వహణకు అద్దె భవన లీజుదారులకు ఆహ్వానం..

- అర్హతలు కలిగిన భవన యజమానులు సంప్రదించాలి

- డాక్టర్ కే. విష్ణువర్ధన్ రెడ్డి..

ప్రజాభూమి, కడప అర్బన్

కడప నగరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర బీమా వైద్య సేవల (ఇ.ఎస్.ఐ.) కార్యాలయ నిర్వహణ కోసం అద్దె భవనం అవసరమని ఇఎస్ఐ కడప డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ కే. విష్ణువర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కడప నగర పరిధిలో 1,650 నుంచి 2,000 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన విశాలమైన భవనం అవసరమని పేర్కొన్నారు. కార్యాలయానికి వచ్చే వారి వాహనాల పార్కింగ్‌కు అనువుగా కార్లు, ద్విచక్ర వాహనాలు నిలిపేందుకు తగినంత స్థలం ఉండాలని స్పష్టం చేశారు. ఈ అర్హతలు కలిగిన భవనాలు ఉన్న ఆసక్తిగల యజమానులు తక్షణమే సంబంధిత అధికారులను లేదా కడపలోని ఇ.ఎస్.ఐ. డిస్పెన్సరీ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన కోరారు.

ఏపీకార్ల్ ప్రాంగణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

ఉద్యోగులు, విద్యార్థులకు ఆరోగ్య సేవలు



ప్రజాభూమి, పులివెందుల

ఏపీకార్ల్ ప్రాంగణంలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఏపీకార్ల్ పరిపాలనాధికారి శివప్రసాద్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పశుసంపదపై ఉన్నత పరిశోధన కేం ద్రం ప్రాంగణంలో ఈ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రాంగణంలోనే వైద్య సేవలు అందుబాటులో ఉండటం వల్ల ఉద్యోగులు, విద్యార్థులు, నివాసితులకు ఆరోగ్య సమస్యలపై సకాలంలో వైద్య సహాయం అందనుంది. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, ప్రాంగణ యాజమాన్యం, వైద్య సిబ్బంది సమన్వయంతో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రతి గురువారం వైద్యుడు ప్రాంగణంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలు అందించనున్నారు.సాధారణ ఆరోగ్య పరీక్షలు, ప్రాథమిక చికిత్సలు, ఆరోగ్య పరిరక్షణపై సూచనలు అందించడంతో పాటు అవసరమైన వారికి తదుపరి వైద్య సేవలు పొందేలా మార్గదర్శనం చేయనున్నారు.ఈ ఆరోగ్య కేంద్రం ఏర్పాటుతో ప్రాంగణంలో నివసించే వారు, ఉద్యోగులు, విద్యార్థులకు ఆరోగ్య సంరక్షణ మరింత చేరువ కానుందని, ప్రజారోగ్యం, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించేందుకు ఇది ఉపయోగకరంగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు.

కార్తీక మాసంలో భక్తిశ్రద్ధలతో ఆకాశదీపం కార్యక్రమం

ప్రజాభూమి పోరుమామిళ్ల :



కడప జిల్లా, పోరుమామిళ్ల మండలం, బ్రాహ్మణ వీధిలో వెలసిన శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రదోష వేళ ఆకాశదీపం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆకాశదీప ఉభయదారులుగా చప్పరపు వెంకట సుధాకర్ శ్రేష్టి ధర్మపత్ని శ్రీదేవి కుటుంబ సభ్యులు పాల్గొని దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మధు శర్మ మాట్లాడుతూ. కార్తీక మాసంలో ఆకాశ దీపం వెలిగించడం అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక సంప్రదాయమని, ఆకాశదీపం ద్వారా పరమశివుని అనుగ్రహం పొందాలని భక్తులు ప్రార్థిస్తారని తెలిపారు. ఈ దీపారాధన వల్ల సకల శుభాలు, అష్టైశ్వర్యాలు కలిగి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. కార్తీక మాసంలో ఆకాశదీప దర్శనం, దీపారాధన భక్తులలో ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తాయని తెలియజేశారు.

వై యస్ ఆర్ కడప జిల్లాలో సాన్స్ కార్యక్రమం ప్రారంభం

చిన్నారుల్లో న్యుమోనియా నివారణ, సమర్థవంతమైన చికిత్సపై అవగాహన కల్పించాలి - డి ఎం హెచ్ ఓ డా. పి. యుగంధర్



ప్రజా భూమి, కడప సిటీ :

వై యస్ ఆర్.కడప జిల్లాలో చిన్నారుల్లో న్యుమోనియా వ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపు, సమర్థవంతమైన చికిత్స అందించడమే లక్ష్యం శీగా నిర్వహిస్తున్న సోషల్ అవగాహన,నియంత్రణ నిట్రోలైజ్ నిమోనియాపై కా ర్యక్రమాన్ని గురువారం కడ పలోని రిమ్స్ ఆసుపత్రి పీడి యాట్రిక్స్ఓపీడీలో న్యుమోనియా లేని బాల్యం, ఆరోగ్యక రమైన భవిష్యత్తు అనే నినా దంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.పి.యుగ శీధర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు. తు,ఐదేళ్లలోపు చిన్నారుల్లో న్యుమోనియా వ్యాధిని సకా లంలో గుర్తించి తగిన చికి త్స అందించడం అత్యంత ముఖ్యమని తెలిపారు.చి న్నారుల్లో వేగంగా శ్వాస తీ సుకోవడం, ఛాతీ లోపలికి లాగడం,దగ్గు,శ్వాస తీసుకో వడంలో ఇబ్బంది వంటి లక్ష ణాలను తల్లిదండ్రులు నిర్ల క్ష్యం చేయకుండా వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేశీ ద్రాన్ని సంప్రదించాలని సూ చించారు.నివోనియా నివారణలో తల్లిపాల ప్రాముఖ్యత, పూర్తి స్థాయి టీకాలు,పో షకాహారం, వ్యక్తిగత పరిశు భ్రత వంటి అంశాలపై తల్లి దండ్రులకు అవగాహన క ల్పించడం అవసరమని వివ రించారు 2026 నవంబర్1 2 నుంచి 2027 ఫిబ్రవరి 28 వరకు నిర్వహించనున్న ఈ సాన్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నవజాత శిశువులు,చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తూ,న్యు మోనియా లక్షణాలు, నివారణ చర్యలు,సకాలంలో వై ద్య చికిత్స పొందాల్సిన ఆ వశ్యకతపై తల్లిదండ్రులకు అవగా హన కల్పించవల యునని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. యుగంధర్ తెలియజేశారు. ఈకార్యక్రమంలో రిమ్స్ పీడియాట్రిక్స్ విభాగాధిపతి డా. వంశీ,జి ల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. ప్రవీణ్ కుమార్,ఎన్ హె చ్ ఎంజిల్లా ప్రోగ్రామ్ అధికారి డా.మొహమ్మద్ తాహా, రి మ్స్ పీడియా ట్రిక్స్ అసోసి యేట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీవైద్య విద్యార్థులు, ఇతర ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

కడపలో రైతు మాస్టర్ ట్రైనర్లకు మూడు రోజుల నివాస శిక్షణ

ప్రకృతి వ్యవసాయంలోని తొమ్మిది సార్వత్రిక సూత్రాలు, వాటి వెనుక ఉన్న శాస్త్రీయతపై అవగాహన

ప్రజాభూమి, పులివెందుల



రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ సమాజ నిర్వహణ సహజ వ్యవసాయం ఆధ్వర్యంలో రైతు మాస్టర్ శిక్షకులకు మూడు రోజుల నివాస శిక్షకుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లా ప్రాజెక్టు నిర్వాహకులు ఎస్ వి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో, ఇండో జర్మన్ ప్రపంచ వ్యవసాయ పర్యావరణ పరిశోధన, అభ్యాస అకాడమీ వారి సహకారంతో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు.శిక్షణార్థులను రెండు బృందాలుగా విభజించి, ఒక బృందానికి జిల్లా ప్రాజెక్టు నిర్వహణ కార్యాలయంలో, మరో బృందానికి కడపలోని సింధూర్ కళ్యాణ మండపంలో శిక్షణ అందిస్తున్నారు.ప్రార్థనతో కార్యక్రమం ప్రారంభమైంది. మొదటి రోజు శిక్షణలో భాగంగా ప్రకృతి వ్యవసాయంలోని తొమ్మిది సార్వత్రిక సూత్రాలను, వాటి వెనుక ఉన్న శాస్త్రీయతను రైతు మాస్టర్ శిక్షకులకు వివరించారు. అలాగే ప్రకృతి వ్యవసాయానికీ, రసాయన వ్యవసాయానికీ మధ్య ఉన్న తేడాలను రొట్టె, గోధుమ పిండితో నిర్వహించిన ప్రత్యక్ష ప్రయోగం ద్వారా వివరించి చూపించారు.ఈ శిక్షణ ద్వారా పొందిన జ్ఞానం, నైపుణ్యాలను గ్రామస్థాయిలోని రైతులకు సమర్థవంతంగా బోధించి, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంపొందించడంతో పాటు, జిల్లాలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు కృషి చేయాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు మాస్టర్ శిక్షకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ సురక్ష కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి

లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

ప్రజాభూమి,పులివెందుల



ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి నిర్వహిస్తున్న మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమాలను ఎన్జీవోలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఉమ్మడి జిల్లాల ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి వేంపల్లి భాస్కర్ సూచించారు. గురువారం ఆయన ఎన్జీవో కార్యాల యాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్ర మాల లక్ష్యాలను వివరించారు. నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని, హైరిస్క్ గ్రూపులను గుర్తించి వారికి హెచ్ఐవి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షలు, కౌన్సెలింగ్, మందుల సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. హెచ్ఐవి స్క్రీనింగ్ లక్ష్యాలను 95 శాతం వరకు చేరుకోవడంతో పాటు, హెచ్ఐవి ఉన్న వారిలో 95 శాతం మందికి చికిత్స అందించాలని, వైరల్ లోడ్ నియంత్రణలోనూ 95 శాతం లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు.అనంతరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని ఐసీటీసీ, డీఎస్ఆర్సీ, రక్తనిధి, లింక్ ఏఆర్టీ కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాల్లో రికార్డులు, కార్యక్రమాల అమలు తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, రికార్డుల నిర్వహణలో లోపాలు ఉంటే సంబంధిత బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.హెచ్ఐవి నియంత్రణ కార్యక్రమాల లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రివెన్షన్ ఆఫీసర్ ఆనంద్ కుమార్, ఐసీటీసీ కౌన్సిలర్ సుబ్బయ్య, కౌన్సిలర్ భదర్ వలి, రక్తనిధి టెక్నీషియన్ రాజు, సీడీఎస్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డు కాలనీలో కుక్కల స్వైర విహారం

-మహిళపై పిచ్చికుక్క దాడి.. తీవ్ర గాయాలు

- ఇప్పటికే ముగ్గురిపై దాడులు..

-అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం...

ప్రజాభూమి,– కడప అర్బన్



నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ తీవ్రమవుతోంది. రహదారు లపై గుంపులుగా సంచరిస్తూ కనిపించిన వారిపై విరుచుకుపడుతున్న కుక్కలు స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కోదండ రామాల యం పరిసరాల్లో వీధి కుక్కల స్వైరవిహారం మితిమీరిపోవడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. తాజాగా ఆలయం సమీపంలో ఓ మహిళపై పిచ్చి కుక్క దాడి చేసి తీవ్రంగా కరిచింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఇప్పటికే కాలనీలో ముగ్గురిపై కుక్కలు దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. వరుస ఘటనలు జరుగుతున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో నగరపా లక సంస్థ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీధుల్లో కుక్కలు స్వేచ్ఛగా తిరుగుతూ ప్రజలపై దాడులు చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారంటూ స్థానికులు నిలదీస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు పాఠశా లలకు వెళ్లే సమయంలో, వృద్ధులు నిత్యావసరాల కోసం బయటకు వచ్చే వేళ కుక్కల దాడి భయం వెంటాడుతోంది. రోడ్లపైకి రావాలంటేనే ప్రజలు వణికిపోతున్న పరిస్థితి నెలకొంది. ఎప్పుడు ఏ కుక్క దాడి చేస్తుందోనన్న ఆందోళనతో కాలనీవా సులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుక్కల బెడదపై అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతున్నా అధికారుల్లో చలనం లేకపోవడం దారుణమని మండిపడుతున్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత అధికారులపై లేదా? మరో వ్యక్తి కుక్కకా టుకు గురయ్యే వరకు వేచి చూస్తారా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు కళ్లు తెరిచి హౌసింగ్ బోర్డు కాలనీలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వీధి కుక్కలను సురక్షితంగా పట్టుకుని నియంత్రణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. మరో ప్రమాదం జరగకముందే తక్షణమే స్పందించి ప్రజలకు కుక్కల భయం నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు

-జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



ప్రజాభూమి,– కడప కలెక్టరేట్

జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో ప్రశాంతంగా, కట్టుదిట్టంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు.గురువారం రాష్ట్ర రాజధాని నుండి.. స్థానిక సంస్థల పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి స్థానిక కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలు నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జేసీ డా. నిధి మీనా హాజరయ్యారు.ఈ సందర్భంగా పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో.. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, అధికారుల బాధ్యతలు, ఎన్నికల సిబ్బంది నియామకం తదితర అంశాలను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్షించారు. విని ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ... జిల్లాలో ఎన్నికలను మూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు చేయాలని, సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ వారికి బాధ్యతలు అప్పగించాలన్నారు. ఎన్నికల నిర్వహణపై శిక్షణా తరగతులు కూడా నిర్వహించాలని డిపివోకు జిల్లా కలెక్టర్ సూచించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎన్నికల సామగ్రి పంపిణీ, సిబ్బంది నియామకం, విధుల కేటాయింపు, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్ఓ కె. మల్లికార్జునుడు, ఎస్డీసీలు ప్రతాప్ రెడ్డి, శివరామిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి రామచంద్ర, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, ఎస్ఎస్ఏ ఏపిని అనురాధ, సంబంధిత అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకుల ఆత్మీయ సమ్మేళనానికి కొటిపి బాలకృష్ణ ఎంపిక

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మండలం, కొటిపి గ్రామానికి చెందిన ఏ.హెచ్.ఓ ఫౌండేషన్ అధ్యక్షులు బాలకృష్ణ 8వ సమాజ సేవకుల ఆత్మీయ సమ్మేళనానికి ఎంపికయ్యారు. ఆల్ ఇండియా ఎన్జీవోస్ వెల్ఫేర్‌అసోసి యేషన్ , కెబిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో ఈ సమ్మేళనం నిర్వహించనున్నారు. సమాజ సేవా కార్యక్రమాల్లో మురుకుగా పాల్గొంటూ, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో పనిచేస్తున్న బాలకృష్ణ ఈ సమ్మేళనానికి ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆల్ ఇండియా ఎన్జీవోస్ వెల్ఫేర్ అసోసియేషన్ కె బిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ కొడవటికంటి బాలరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కొటిపికి చెందిన బాలకృష్ణ ఉత్తమ సమాజ సేవ ఆత్మీయ సమ్మేళనానికి ఎంపిక కావడం పట్ల స్థానికులు అభినందించడంతో పాటు ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభూమి
పోలవరం
11
శుక్రవారం 13 నవంబరు 2026

చింతూరు డిగ్రీ కళాశాలలో మినీ జాబ్ మేళాకు విశేష స్పందన!

34 మంది నిరుద్యోగ యువతీ యువకుల హాజరు.. 14 మందికి ఉద్యోగ అవకాశాలు





ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతూరులో నిర్వహించిన మినీ జాబ్ మేళా విజయవంతమైంది. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు పరిసర ప్రాంతాల యువతీ యువకుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా. ఎన్. మణిమాల మాట్లాడుతూ అపోలో టైర్స్ లిమిటెడ్, ఫాక్స్‌కాన్ వంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులు ఈ జాబ్ మేళాలో పాల్గొన్నట్లు తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించినప్పటికీ సరైన ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఇటువంటి జాబ్ మేళాలు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ముల్లి శేఖర్ మాట్లాడుతూ యువత ఇటువంటి ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను నిరూపించుకోవాలని, ఉద్యోగాలు సాధించి ఉన్నతమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఈ మినీ జాబ్ మేళాలో మొత్తం 34 మంది నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొనగా, వివిధ కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూల అనంతరం 14 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. పాల్గొన్న వారిలో దాదాపు సగం మందికి ఉద్యోగ అవకాశాలు లభించడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ హర్షం వ్యక్తం చేస్తూ ఎంపికైన అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికాస ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ ధనేష్ వర్మ, డా. వై. పద్మ, ఎం. రాకేష్ రాజ్, ఎం. దివ్యజ్యోతి, జె. శివకృష్ణ, కె. సత్య గణేష్, డా. జి. ఝాన్సీ, జి. సాయికుమార్, బి. శ్రీనివాసరావు, ఎన్. ఆనంద్, కె. లక్ష్మీ ప్రసన్న, కె. కీర్తితో పాటు కళా శాల తృతీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

పరిషత్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాలతో ధనలక్ష్మి జోరు!

- తాడేపల్లిలో వైఎస్ జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి.
- గెలిచిన జడ్పీటీసీలను పరిచయం చేసి ఎన్నికల ఫలితాలను వివరించిన నేతలు





ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున విజయం సాధించిన జడ్పీటీసీ అభ్యర్థులను ఆమె జగన్‌కు పరిచయం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ సాధించిన ఎన్నికల ఫలితాలు, అభ్యర్థుల విజయాలు, ఎన్నికల సమయంలో ఎదురైన పరిస్థితులను వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వ రాజకీయ వ్యూహాలు, ఒత్తిళ్లు, ప్రతికూల పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ప్రజల మద్దతుతో విజయం సాధించారని నాగులపల్లి ధనలక్ష్మి పేర్కొన్నారు. పోలవరం జిల్లాలో మొత్తం 12 జడ్పీటీసీ స్థానాలకు గాను ఐదు స్థానాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందన్నారు. అదేవిధంగా రంపచోడవరం నియోజకవర్గ పరిధిలో 93 ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేసి 41 స్థానాలను గెలుచుకోవడం పార్టీకి లభించిన ప్రజా మద్దతుకు నిదర్శనమని ఆమె వివరించారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి విజయం సాధించిన జడ్పీటీసీ అభ్యర్థులను అభినందిస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేయాలని సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. స్థానిక సంస్థల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని, గ్రామీణ ప్రాంతాల సమస్యలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, ప్రజల అవసరాలపై నిరంతరం దృష్టి సారించాలని నాయకులకు సూచించినట్లు వెల్లడించాయి. ముఖ్యంగా రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో పార్టీ పటిష్టతకు స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు దోహదపడతాయని నాగులపల్లి ధనలక్ష్మి ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల ప్రజల సమస్యలు, పోలవరం నిర్వాసితుల ఇబ్బందులు, రహదారులు, విద్య, వైద్యం, తాగునీరు వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రజల తరఫున నిరంతరం పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన జడ్పీటీసీలు, ఎంపీటీసీలకు పార్టీ నాయకత్వం నుంచి లభించిన అభినందనలు, ప్రోత్సాహం కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపాయని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. రంపచోడవరం నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేస్తామని నాయకులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.


అడ్డతీగల మండలంలో గ్రామ పంచాయతీల వారీగా వార్డు రిజర్వేషన్లు ఖరారు

ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

2026 గ్రామ పంచాయతీల రెండో సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలవరం జిల్లా అడ్డతీగల మండలంలోని గ్రామ పంచాయతీల వార్డు సభ్యుల రిజర్వేషన్ల వివరాలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రకటించారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు సంబంధించిన సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఈ విధంగా ఉన్నాయి.

1. అడ్డతీగల గ్రామ పంచాయతీ: సర్పంచ్ – ఎస్టీ మహిళ. మొత్తం 14 వార్డులు. 1, 2, 10, 13 వార్డులు ఎస్టీ; 3, 7, 9 వార్డులు జనరల్ మహిళ; 4, 6, 8 వార్డులు జనరల్; 5, 11, 12, 14 వార్డులు ఎస్టీ మహిళ.
2. భీముడుపాకలు: సర్పంచ్ – ఎస్టీ మహిళ. మొత్తం 8 వార్డులు. 1, 2, 4, 8 వార్డులు ఎస్టీ; 3, 5, 6, 7 వార్డులు ఎస్టీ మహిళ.
3. బొడ్లంక: సర్పంచ్ – ఎస్టీ. మొత్తం 8 వార్డులు. 1, 5, 7 వార్డులు ఎస్టీ మహిళ; 2, 6, 8 వార్డులు ఎస్టీ; 3వ వార్డు జనరల్; 4వ వార్డు జనరల్ మహిళ.
4. డి.భీమవరం: సర్పంచ్ – ఎస్టీ మహిళ. మొత్తం 10 వార్డులు. 1, 5, 7, 10 వార్డులు ఎస్టీ మహిళ; 2, 3, 6, 8, 9 వార్డులు ఎస్టీ; 4వ వార్డు జనరల్.
5. డి.రామవరం: సర్పంచ్ – ఎస్టీ. మొత్తం 10 వార్డులు. 1, 5, 8, 10 వార్డులు ఎస్టీ; 3, 6, 7, 9 వార్డులు ఎస్టీ మహిళ; 2వ వార్డు జనరల్; 4వ వార్డు జనరల్ మహిళ.
6. డకోడు: సర్పంచ్ – ఎస్టీ మహిళ. మొత్తం 8 వార్డులు. 1, 3, 4, 6 వార్డులు ఎస్టీ; 2, 5, 7 వార్డులు ఎస్టీ మహిళ; 8వ వార్డు జనరల్ మహిళ.

22 గ్రామ పంచాయతీలకు రిజర్వేషన్ల ప్రకటన



7. ధన్యంపాలెం: సర్పంచ్ – ఎస్టీ. మొత్తం 10 వార్డులు. 2, 3, 4, 7, 8 వార్డులు ఎస్టీ; 1, 5, 6, 9, 10 వార్డులు ఎస్టీ మహిళ.
8. దొరమామిడి: సర్పంచ్ – ఎస్టీ మహిళ. మొత్తం 8 వార్డులు. 1, 3, 6, 7 వార్డులు ఎస్టీ మహిళ; 2, 8 వార్డులు ఎస్టీ; 4వ వార్డు జనరల్ మహిళ; 5వ వార్డు జనరల్.
9. దుచ్చర్తి: సర్పంచ్ – ఎస్టీ. మొత్తం 10 వార్డులు. 1, 2, 6, 8, 10 వార్డులు ఎస్టీ; 3, 4, 5, 7, 9 వార్డులు ఎస్టీ మహిళ.
10. గొండోలు: సర్పంచ్ – ఎస్టీ. మొత్తం 8 వార్డులు. 1, 4, 5 వార్డులు ఎస్టీ; 2, 3, 6 వార్డులు ఎస్టీ మహిళ; 7వ వార్డు జనరల్; 8వ వార్డు జనరల్ మహిళ.
11. గొంటువానిపాలెం: సర్పంచ్ – ఎస్టీ. మొత్తం 10 వార్డులు. 2, 3 వార్డులు ఎస్టీ; 7వ వార్డు ఎస్టీ మహిళ; 1, 4, 5, 6 వార్డులు జనరల్ మహిళ; 8, 10 వార్డులు జనరల్; 9వ వార్డు ఎస్టీ.
12. కిమ్మూరు: సర్పంచ్ – ఎస్టీ మహిళ. మొత్తం 8 వార్డులు. 3, 5 వార్డులు ఎస్టీ; 4, 6 వార్డులు ఎస్టీ మహిళ; 1, 2 వార్డులు జనరల్ మహిళ; 7, 8 వార్డులు జనరల్.
13. కోనలోవా: సర్పంచ్ – ఎస్టీ. మొత్తం 10 వార్డులు. 1, 3, 4 వార్డులు ఎస్టీ; 6, 8 వార్డులు ఎస్టీ మహిళ; 2, 5, 7, 9, 10 వార్డులు జనరల్ మహిళ.
14. మట్లపాడు: సర్పంచ్ – ఎస్టీ. మొత్తం 8 వార్డులు. 1, 2, 6 వార్డులు ఎస్టీ; 3, 4 వార్డులు ఎస్టీ మహిళ; 5, 8 వార్డులు జనరల్ మహిళ; 7వ వార్డు జనరల్.
15. పులిగోగులపాడు: సర్పంచ్ – ఎస్టీ మహిళ. మొత్తం 8 వార్డులు. 1, 2, 3, 5 వార్డులు ఎస్టీ; 4, 6, 8 వార్డులు ఎస్టీ మహిళ; 7వ వార్డు జనరల్ మహిళ.
16. రాయపల్లి: సర్పంచ్ – ఎస్టీ మహిళ. మొత్తం 10 వార్డులు. 2, 5, 6, 9 వార్డులు ఎస్టీ; 4, 7, 8, 10 వార్డులు ఎస్టీ మహిళ; 1వ వార్డు జనరల్; 3వ వార్డు జనరల్ మహిళ.
17. సోమన్నపాలెం: సర్పంచ్ – ఎస్టీ మహిళ. మొత్తం 8 వార్డులు. 2, 3, 6, 8 వార్డులు ఎస్టీ; 1, 4, 5 వార్డులు ఎస్టీ మహిళ; 7వ వార్డు జనరల్ మహిళ.
18. తిమ్మాపురం: సర్పంచ్ – ఎస్టీ. మొత్తం 10 వార్డులు. 2, 3, 7 వార్డులు ఎస్టీ; 1, 4 వార్డులు ఎస్టీ మహిళ; 5, 6, 9 వార్డులు జనరల్ మహిళ; 8, 10 వార్డులు జనరల్.
19. తుంగమడుగుల: సర్పంచ్ – ఎస్టీ మహిళ. మొత్తం 10 వార్డులు. 2, 5, 8, 10 వార్డులు ఎస్టీ; 1, 4, 7, 9 వార్డులు ఎస్టీ మహిళ; 3వ వార్డు జనరల్ మహిళ; 6వ వార్డు జనరల్.
20. వీరవరం: సర్పంచ్ – ఎస్టీ మహిళ. మొత్తం 8 వార్డులు. 1, 2, 3, 5 వార్డులు ఎస్టీ; 4, 6, 7, 8 వార్డులు ఎస్టీ మహిళ.
21. వెటమామిడి: సర్పంచ్ – ఎస్టీ. మొత్తం 8 వార్డులు. 2, 3, 4, 6 వార్డులు ఎస్టీ; 5, 7, 8 వార్డులు ఎస్టీ మహిళ; 1వ వార్డు జనరల్ మహిళ.
22. ఎల్లవరం: సర్పంచ్ – ఎస్టీ. మొత్తం 10 వార్డులు. 1, 4, 5 వార్డులు ఎస్టీ; 2, 3 వార్డులు ఎస్టీ మహిళ; 6, 8 వార్డులు జనరల్; 7, 9, 10 వార్డులు జనరల్ మహిళ.

దోమల నివారణకు గంబుషియా చేపల విడుదల

గంగవరం, పిడతమామిడి పీహెచ్‌సీల పరిధిలో ప్రత్యేక డ్రైవ్





ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం

దోమల నియంత్రణతో పాటు మలేరియా డెంగ్యూ చికెన్‌గున్యా,ఫైలేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణే లక్ష్యంగా గంగవరం పిడతమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు వైద్యాధికారులు ఓ.భావన హార్షిని ఆధ్వర్యంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో దోమల లార్వాలను తినే గంబుషియా చేప పిల్లలను చెరువులు నీటి నిల్వ ప్రాంతాలు నిరుపయోగంగా ఉన్న బావులు నీటి గుంటల్లో విడుదల చేశారు ఈ చేపలు నీటిలోని దోమల లార్వాలను తినడం ద్వారా దోమల వృద్ధిని సహజసిద్ధంగా అరికట్టేందుకు దోహదపడతాయని వైద్యాధికారులు తెలిపారు ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమలు అధికంగా వృద్ధి చెందే అవకాశం ఉందని తద్వారా వివిధ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని పేర్కొన్నారు ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రై డే'పాటిస్తూ నీటి నిల్వ పాత్రలను శుభ్రం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎస్‌యూఓ సూరిబాబు హెల్త్ అసిస్టెంట్లు,ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు,ఇతర వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం రామాలయంలో ఘనంగా అయ్యప్ప స్వామి అభిషేక పూజలు

-పంచలోహ అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ఆలయానికి బహుకరించిన భక్తులు



ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం

గంగవరం గ్రామంలోని స్థానిక రామాలయంలో అయ్యప్ప స్వామి అభిషేక పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు అర్చకులు శ్రీ సాయి,గురుస్వామి శేషాచార్యులు, నాగూరయ్య ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు మల్ల భవాని ప్రశాంత్ అయ్యప్ప స్వామివారి పంచలోహ విగ్రహాన్ని ఆలయానికి భక్తిపూర్వకంగా బహుకరించారు అనంతరం స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించి,ప్రత్యేక అయ్యప్ప పూజలు,ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు ఈ పూజా కార్యక్రమంలో గంగవరం గ్రామానికి చెందిన అయ్యప్ప స్వాములు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం అయ్యప్ప నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

కుర్ల రాజశేఖర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నాయకులు



ప్రజాభూమి ప్రతినిధి-అడ్డతీగల

రంపచోడవరం నియోజకవర్గ జనసేన పార్టీ పొయింట్ ఆఫ్ కాంటాక్ట్ (పీఓసీ), జెడ్పీటీసీ అభ్యర్థిగా విజయం సాధించిన కుర్ల రాజశేఖర్ రెడ్డిని గురువారం అడ్డతీగల మండల జనసేన పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు రాజశేఖర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడ్డతీగల మండల జనసేన పార్టీ నాయకులు కుప్పాల జయరాం, పొడుగు సాయి, చోళ్ళ కృష్ణారెడ్డి, మాడుగుల అప్పన్న, గుర్తుల చిన్న, షేక్ ముస్తఫా, గుత్తుల నాగేంద్ర, కొనదాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో ఎదగడానికి షార్ట్ కట్ ఉండదు... శ్రమించాలి


పోలవరం జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ పేర్కొన్నారు. గురు వారం రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువ జన సాంస్కృతిక పోటీలు 2026 కార్యక్రమా నికి పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలవ రం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ మనమందరం సాధారణంగా ఇతరుల విజయాన్ని,వారు సాధించిన ఉన్నత స్థానాన్ని మాత్రమే చూస్తామని, కానీ ఆ స్థాయి కి చేరుకోవడం వారు పడిన కష్టాన్ని, చేసిన శ్రమను గుర్తించమని ఆయన అన్నారు. విజయం వెనుక ఎంతో కృషి, పట్టుదల, నిరం తర సాధన ఉంటాయని,ఆ కష్టాన్ని అర్థం చేసుకుని ముందుకు సాగిన వారే జీవితంలో విజయం సాధిస్తారని కలెక్టర్ తెలిపారు. జీవితంలో విజయానికి ఎలాంటి షార్ట్‌కట్ ఉండదని స్పష్టం ఆయన చేశారు.ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగంలో ప్రతి ఒక్కరూ చాట్ జీపీటీ వంటి కృత్రిమ మేధస్సు సాధనాలను



ఉపయోగించుకుంటున్నారని, విద్యార్థులు కూడా వాటిని విద్యాభ్యాసానికి సద్వినియోగం చేసుకోవాలని ఆయన విద్యా ర్థులను సూచించారు.విద్యార్థులు ప్రతిరోజూ కొత్త విషయాలను తెలుసుకోవాలని, ప్రశ్నలు అడగాలని,ఉపాధ్యాయులు తరగతి గదిలో బోధించిన పాఠ్యాంశాలను ఇంటికి వెళ్లిన తర్వాత మరోసారి అభ్యసించే సబ్జెక్టులపై మరింత పట్టు సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు. అలాగే జిల్లాస్థాయి సాంస్కృతిక ఉత్సవాల ద్వారా మన సంప్రదాయాలు, సంస్కృతి,జీవన శైలిని సృజనాత్మకంగా ప్రజల కు పరిచయం



చేయాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. ముందుగా జిల్లా కలెక్టర్ అల్లూరి సీతారామరాజు వారి విగ్రహానికి పూల మాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించా రు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో పురుషోత్తం, డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, ప్రిన్సిపల్ డాక్టర్. వి.కే.సి.మహాలక్ష్మి, ముఖ్యకార్య నిర్వహణ అధికారి కే.ప్రభాకర్ రావు,ఆచార్య రాజేష్, పట్టాభిరామం,జే.బుజ్జి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్

శుక్రవారం, నవంబర్ 13, 2026

12

ఏకాంబరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం

కార్తీక మాసం ప్రకృతి సజావుగా నడవడానికి అరమరికల్లేని ఏకత్త భావనకు ప్రతీక. కార్తీక మాసం పవిత్రతను పురస్కరించుకుని నగర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ బందరు కోటలో వెంచేసి ఉన్న శ్రీ కంచికామాక్షి సమేత ఏకంబారేశ్వరా స్వామి వారి దేవస్థానంలో కార్తీక మాస పురస్కరించుకొని మచిలీపట్టణం మేయర్ అబ్దుల్ అబిద రాష్ట్ర మైనారిటీ డైరెక్టర్ హసీంబైగ్ ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలోదేవాలయం చైర్మన్ బచ్చుల హరి, బచ్చులఅనిల్ డివిజన్ కార్పొరేటర్ బచ్చుల కల్పన 53 డివిజన్ కార్పొరేటర్ కాశీబాట్ల రాధాకృష్ణ సుమన్ దేవాలయం అర్చకులు భాస్కర్ నాగసాయి, తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి దేవస్థానం భూముల పరిరక్షణకు కలెక్టర్ కీలక ఆదేశాలు

22.90 ఎకరాల భూమిపై సమగ్ర విచారణకు శ్రీకారం.. రెవెన్యూ, సర్వే, దేవాదాయ శాఖల సంయుక్త సర్వేకు ఆదేశాలు



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

కృష్ణా జిల్లా మోపిదేవి గ్రామంలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానానికి చెందిన భూముల పరిరక్షణపై జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డి.కె. బాలాజీ కీలక ఆదేశాలు జారీ చేసినట్లు ఫిర్యాదుదారుడు బి.డి.ఆర్. ప్రసాద్ వెల్లడించారు. మోపిదేవి సర్వే నంబర్ 633లో ఉన్నట్లు పేర్కొంటున్న 22.90 ఎకరాల దేవస్థాన భూమికి సంబంధించి నెలకొన్న వివాదంపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించినట్లు ఆయన తెలిపారు.దేవస్థాన భూమికి సంబంధించి పూర్తిస్థాయి సర్వే నిర్వహించకుండానే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడం, వేలాలు నిర్వహించడం వంటి అంశాలపై బి.డి.ఆర్. ప్రసాద్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో లేవనెత్తిన అంశాలను పరిగణనలోకి తీసుకున్న జిల్లా యంత్రాంగం, రెవెన్యూ, సర్వే, దేవాదాయ శాఖల అధికారులతో సంయుక్తంగా సర్వే నిర్వహించి భూమి విస్తీర్ణం, హద్దులు, వాస్తవ స్వరూపాన్ని ఖచ్చితంగా నిర్ధారించాలని ఆదేశించినట్లు వెల్లడించారు.అంతేకాకుండా వివాదాస్పద భూమిలో ఎలాంటి అనధికార నిర్మాణాలు చేపట్టకుండా, ఇతరులకు హక్కులు కల్పించే విధంగా ఎటువంటి చర్యలు తీసుకోకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా రెవెన్యూ అధికారి ద్వారా మోపిదేవి దేవస్థాన కార్యనిర్వహణాధికారికి ఆదేశాలు జారీ చేసినట్లు ఫిర్యాదుదారుడు పేర్కొన్నారు.దేవస్థానానికి చెందిన విలువైన భూముల పరిరక్షణ, వాటి వినియోగంలో పారదర్శకత, ప్రభుత్వ నిబంధనల అమలు దిశగా జిల్లా కలెక్టర్ స్పందించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సంయుక్త సర్వే ద్వారా భూముల హద్దులు స్పష్టమై, వివాదానికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని భక్తులు, స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.కలెక్టర్ జారీ చేసిన ఆదేశాల లేఖను మీడియాకు చూపిస్తూ వివరాలు వెల్లడించిన బి.డి.ఆర్. ప్రసాద్, దేవస్థాన భూములకు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించి, అక్రమాలు ఏమైనా జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

ఎన్నికల వ్యయ నియంత్రణ, ప్రలోభాల నివారణపై ప్రత్యేక నిఘా ఉంచాలి
రాష్ట్ర ఎన్నికల సంఘం వర్చువల్ సమావేశంలో పాల్గొన్న ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి. విజయ కుమార్



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి.విజయ కుమార్ గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహించిన వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు. రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల మొదటి దశకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ 13, 2026న సమగ్ర నోటిఫికేషన్లు జారీ చేయనున్న నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు, ఎన్నికల నిర్వహణ మార్గదర్శకాలు, ఎన్నికల వ్యయ పరిశీలకులు చేపట్టాల్సిన విధులపై రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు దిశానిర్దేశం చేశారు. అభ్యర్థులు ఎన్నికల సంఘం నిర్దేశించిన వ్యయ పరిమితులకు లోబడి ఖర్చు చేసేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అభ్యర్థుల వ్యయ రిజిస్టర్లతో పాటు షాడో రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహిస్తూ, నిర్ణీత గడువులో వ్యయ వివరాలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల సమయంలో నగదు, మద్యం, బహుమతులు, ఇతర కానుకల పంపిణీ వంటి ప్రలోభాలను అరికట్టేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్, వీడియో సర్వైలెన్స్ టీమ్స్ బృందాలను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ఎన్నికల సభలు, ర్యాలీలు, వాహనాల వినియోగం, ప్రచార సామగ్రికి సంబంధించిన అనుమతులను నిశితంగా పరిశీలించాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా బి.విజయ కుమార్ మాట్లాడుతూ, ఎన్టీఆర్ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా అమలు చేస్తామన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు ఎక్కడైనా గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో నిబంధనలను పాటించాలి

❖ నామినేషన్ల స్వీకరణ నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలో అప్రమత్తంగా ఉండాలి
❖ ఆర్వోలు, ఏఆర్వోలకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజి సూచనలు



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:

రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలు–2026 నిర్వహణలో భాగంగా ఎన్నికల ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ నుంచి పరిశీలన, ఉపసంహరణ, పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రచురణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలో ఎన్నికల నిబంధనలను తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు.గురువారం కృష్ణా విశ్వవిద్యాలయంలోని అల్లూరి సీతారామరాజు ఆడిటోరియంలో మచిలీపట్నం డివిజన్ పరిధిలోని రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), సహాయ రిటర్నింగ్ అధికారులకు (ఏఆర్వోలు) నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అత్యంత కీలకమైన ప్రక్రియ అని, నోటిఫికేషన్‌లో నామినేషన్లు స్వీకరించే ప్రదేశం, తేదీలు, సమయాలు తదితర వివరాలను స్పష్టంగా, తప్పులు లేకుండా పొందుపరచాలన్నారు. ఒక ఆర్వో పరిధిలో మూడు గ్రామపంచాయతీలు ఉన్నట్లయితే, నామినేషన్లు ఒక గ్రామ పంచాయతీలో స్వీకరించినప్పటికీ, సంబంధిత ఎన్నికల నోటీసును మూడు గ్రామపంచాయతీల్లోనూ మూడు ముఖ్యమైన ప్రదేశాల్లో ప్రచురించాలని సూచించారు. అయితే నామినేషన్లు స్వీకరించే ప్రదేశం వివరాలు అన్ని చోట్లా ఒకే విధంగా, కచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు.నామినేషన్ల స్వీకరణ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాలన్నారు. చివరి రోజు సాయంత్రం 5 గంటలలోపు వచ్చిన ప్రతి అభ్యర్థి నుంచి నామినేషన్ స్వీకరించాలన్నారు. ఇందు కోసం ప్రతి నామినేషన్ గదిలో డిజిటల్ గడియారాన్ని ఏర్పాటు చేయాలని, చివరి రోజు నామినేషన్ల స్వీకరణ ముగింపు సమయంలో గది తలుపులు మూసివేసే ప్రక్రియను వీడియో చిత్రీకరించాలని సూచించారు. చివరి నిమిషాల్లో ఎక్కువ మంది అభ్యర్థులు వచ్చినా, సమయానికి వచ్చిన వారందరి నామినేషన్లను స్వీకరించి, ప్రాథమిక పరిశీలనను అనంతరం చేపట్టాలన్నారు.ప్రతి నామినేషన్‌కు క్రమసంఖ్య కేటాయించడంతోపాటు స్వీకరించిన తేదీ, సమయాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలని, ఒకే పేరుతో ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉన్నప్పుడు నామినేషన్ల స్వీకరణ క్రమాన్ని ఆధారంగా చేసుకుని జాబితాను రూపొందించాల్సి ఉంటుందని గుర్తుచేశారు.

అభ్యర్థి లేదా ప్రతిపాదకుడు నామినేషన్ సమర్పించేందుకు వచ్చినప్పుడు ముగ్గురికి మించి వ్యక్తులను అనుమతించరాదన్నారు. ఎన్నికల వ్యయ ప్రకటనపై అభ్యర్థి స్వయంగా ఆర్వో ఎదుట సంతకం చేయాలని, చెక్‌లిస్టులో ప్రతి పత్రం సమర్పించిన వివరాలు, లోటుపాట్లను స్పష్టంగా నమోదు చేసి అభ్యర్థికి అందించాలని చెప్పారు.ఒక అభ్యర్థి ఒకటి కంటే ఎక్కువ నామినేషన్లు దాఖలు చేయవచ్చని, దీనిపై ఎలాంటి అపోహలు కల్పించరాదన్నారు. ఒకే అభ్యర్థి ఒకటి కంటే ఎక్కువ వార్డుల్లో పోటీ చేసిన సందర్భంలో ఉపసంహరణ నిబంధనలను జాగ్రత్తగా పరిశీలించాలని, ఒకే వార్డుకు ఒకటి కంటే ఎక్కువ నామినేషన్ సెట్లు సమర్పించడం వేరని, వేర్వేరు వార్డుల్లో పోటీ చేయడం వేరని వివరించారు. ఉపసంహరణ సమయంలో అభ్యర్థి స్వయంగా హాజరుకాకపోతే, కనీసం ఫోన్ ద్వారా అభ్యర్థితో మాట్లాడి ఉపసంహరణ నిర్ణయాన్ని నిర్ధారించుకోవాలని సూచించారు. రిజర్వ్ స్థానాలకు సంబంధించిన నామినేషన్ల విషయంలో కుల ధ్రువీకరణ పత్రం లేదా నిబంధనల ప్రకారం సంబంధిత రెవెన్యూ శాఖ అధికారి, ఎంఆర్ఓ స్థాయి కంటే తక్కువ కాని అధికారి ధ్రువీకరించిన డిక్లరేషన్‌ను పరిశీలించాలని తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రం సమర్పించినప్పుడు దాని చెల్లుబాటుపై అభ్యంతరాలు వచ్చినా, సంబంధిత అధికారిక రికార్డుల ఆధారంగా మాత్రమే నిర్ణయం తీసుకోవాలని, పత్రం రద్దయిందని ఫిర్యాదు వస్తే కలెక్టరేట్ ద్వారా ధ్రువీకరించుకోవాలని సూచించారు. నామినేషన్ అందిన వెంటనే ఆర్వోలు ప్రాథమిక పరిశీలన చేపట్టి, ఏవైనా లోపాలు ఉంటే చెక్‌లిస్టులో స్పష్టంగా పేర్కొని అభ్యర్థికి తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్‌ను తిరస్కరించానే ధోరణి కాకుండా, నిబంధనల పరిధిలో అభ్యర్థి నామినేషన్ ఆమోదం పొందేలా అవసరమైన మార్గదర్శకత్వం అందించాలన్నారు. ప్రతిరోజూ స్వీకరించిన నామినేషన్ల జాబితాను నిబంధనల ప్రకారం ప్రచురించడం తోపాటు, ప్రచురించినట్లు స్థానిక సాక్షుల సమక్షంలో పంచనామా నిర్వహించి ఆధారాలు భద్రపరచాలన్నారు.పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా తయారీలో తెలుగు అక్షర క్రమాన్ని, ఎన్నికల నిబంధనల్లో పేర్కొన్న ప్రాధాన్యతా క్రమాన్ని ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. అభ్యర్థులు నామినేషన్ పత్రంలో పేర్కొన్న పేర్ల ఆధారంగానే జాబితా రూపొందించాలని వివరించారు. బ్యాలెట్ పేపర్లపై అభ్యర్థుల క్రమసంఖ్య, ఎన్నికల గుర్తుల కేటాయింపులో ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని, ముద్రణకు పంపే ముందు పేర్లు, స్పెల్లింగ్, అక్షరాలు, గుర్తులను పలుమార్లు తనిఖీ చేయాలని ఆదేశించారు. పోలింగ్‌కు సంబంధించి ముందుగానే అన్ని పోలింగ్ కేంద్రాల భవనాల స్థితిగతులను మరోసారి తనిఖీ చేయాలని, పోలింగ్ కేంద్రాల కేటాయింపులో ఒక ప్రాంతానికి చెందిన ఓటర్లను అనవసరంగా వేరే వార్డులకు మార్చిన పరిస్థితులు ఉన్నాయేమో పరిశీలించాలని ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలను ఆదేశించారు. ముఖ్యంగా వార్డుల సరిహద్దులకు సంబంధించి ఓటర్ల కేటాయింపులో గందరగోళం లేకుండా చూసుకోవాలన్నారు.ఎన్నికల నిర్వహణలో ప్రతి అధికారి నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పుస్తకాల్లో పేర్కొన్న విధానాల ప్రకారమే నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ శిక్షణ కార్యక్రమంలో బందరు ఆర్డీవో కే సాంబశివరావు, డిఆర్డిఏ పిడి హరిహరనాథ్, డీపీఓ ఎం ధనలక్ష్మి, సంబంధిత ఎన్నికల అధికారులు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెండో కార్ల తయారీ ప్లాంట్ ఏర్పాటుకు కియా ఒప్పందం

❖ రూ.18,811 వేల కోట్ల పెట్టుబడి, మరో 12 వేల మందికి ఉద్యోగావకాశాలు
❖ నూతన ప్లాంట్‌తో ఏడాదికి అదనంగా 2 లక్షల వాహనాల ఉత్పత్తి ❖ ఈవీలు, హైబ్రిడ్ వాహనాల తయారీకి ప్రధాన కేంద్రంగా ఏపీ: సీఎం చంద్రబాబు



ప్రజాభూమి ప్రతినిధి,విశాఖపట్నం:

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక రంగ అభివృద్ధికి మరో భారీ ముందడుగు పడింది. దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ కియా సత్యసాయి జిల్లాలో తన కార్ల తయారీ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు ముందుకు వచ్చింది. ప్రస్తుత పెనుకొండ ప్లాంట్‌కు అదనంగా ఎర్రమంచిలో ఏడాదికి 2 లక్షల వాహనాలను ఉత్పత్తి చేసే సామర్థ్యంతో రెండో కార్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం కియా, దాని సరఫరా భాగస్వాములు సంయుక్తంగా 2 బిలియన్ అమెరికన్ డాలర్ల మేర భారతీయ కరెన్సీలో రూ.18,811 వేల కోట్లకు పైగా పెట్టుబడి పెట్టనున్నాయి. ఈ విస్తరణ ద్వారా సుమారు 12 వేల మందికి అదనంగా ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ఈ మేరకు విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ 31వ భాగస్వామ్య సదస్సు వేదికగా రాష్ట్ర ప్రభుత్వంతో కియా అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కియా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ గ్వాంగ్ లీ, కియా కార్పొరేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎయి చుల్ జెంగ్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది.

465 ఎకరాల్లో రెండో ప్లాంట్..2030 ప్రారంభంలో ఉత్పత్తి

ఉమ్మడి అనంతపురం జిల్లా పెనుకొండలో ప్రస్తుత కియా ప్లాంట్ పరిధిలోనే రెండో ప్లాంట్, అనుబంధ యూనిట్లను కలిపి మొత్తం 465 ఎకరాల్లో ఈ విస్తరణ చేపట్టనున్నారు. రెండో ప్లాంట్ లో ఏడాదికి మరో రెండు లక్షల వాహనాలు తయారు చేయాలని లక్ష్యంగా కియా నిర్దేశించుకుంది. 2030 ప్రారంభం నాటికి ఈ ప్లాంట్ నుంచి ఉత్పత్తి ప్రారంభించాలని కియా ప్రణాళిక రూపొందించింది. కొత్త ప్లాంట్‌లో ఐసీఈ, ఈవీ వాహనాలకు సంబం ధించిన అధునాతన మోడళ్లను తయారు చేయనున్నారు. వాహన తయారీలో కీలకమైన స్టాంపింగ్, వెల్డింగ్, పెయింటింగ్, అసెంబ్లీ వంటి అన్ని ప్రధాన తయారీ ప్రక్రియలను ఈ ప్లాంట్‌లో చేపట్టనున్నారు. ప్రస్తుతం అనంతపురంలోని కియా ప్లాంట్ ఏడాదికి 4.30 లక్షల వాహనాలను ఉత్పత్తి చేస్తోంది. రెండో ప్లాంట్ ద్వారా ఏడాదికి 6.30 లక్షల వాహనాల తయారు చేయాలని కియా భావిస్తోంది. రెండు ప్లాంట్ల ద్వారా మొత్తం కియా పెట్టుబడులు దాదాపు 5 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరనున్నాయి. కొత్త ప్లాంట్ విస్తరణతో ఆటోమొబైల్ రంగంలో రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.

పెట్టుబడులకు రక్షణ కల్పిస్తాం

కియా సంస్థతో ఒప్పందం అనంతరం ముఖ్య మంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. కియా సంస్థ రాష్ట్రంలో మరో 2 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడితో ప్లాంట్ విస్తరణ చేపట్టడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌పై నమ్మకం ఉంచి మరోసారి భారీ పెట్టుబడులతో ముందుకు వచ్చిన కియా యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాలు, హైబ్రిడ్ కార్లు, ఆటోమొబైల్ విడిభాగాల తయారీలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దాలని కియా ప్రతినిధి బృందాన్ని కోరారు. కియా సంస్థకు డిజైన్ ఇంజనీరింగ్ సెంటర్, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్, స్ట్రాటజిక్ బ్యాటరీ పరిశోధన, అభివృద్ధి కేంద్రాలను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని సూచించారు. బ్యాటరీ పరిశోధన కేంద్రం ఏర్పాటుకు ఐఐటీ తిరుపతి భాగస్వామ్యం వహించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. పారిశ్రామిక పెట్టుబడిదారులకు మరింత భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతోందని ముఖ్య మంత్రి తెలిపారు. పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం పెట్టుబ డిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఎస్క్రో ఖాతా విధానం ద్వారా ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. పెట్టుబడులకు రక్షణ కల్పించేందుకు ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ ను కూడా తీసుకువస్తున్నట్లు తెలిపారు. విదేశీ పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ నమ్మకమైన భాగస్వా మిగా నిలుస్తోందని, దేశానికి వచ్చిన పెట్టుబ డుల్లో 25 శాతం రాష్ట్రానికి రావడం దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. దక్షిణ కొరియా కంపెనీలు రాష్ట్రంలో యాంకర్ ఇండస్ట్రీస్ అంబాసిడర్లు గా నిలవాలని ఆకాం క్షించారు. ఏపీలో నైపుణ్యం కలిగిన యువతకు కొదవ లేదని, పరిశ్రమలు వారికి అవకాశాలు కల్పిస్తే రాష్ట్ర పారిశ్రామిక రంగం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నా రు. రెండో ప్లాంట్ విస్తరణ పనులను వేగవంతం చేసి 2029 మే నాటికే పూర్తి చేయాలని కియా యాజమాన్యాన్ని కోరారు.

కియా పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం

గతంలో కియా సంస్థను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడానికి విస్తృత ప్రయత్నాలు చేసినట్లు ముఖ్య మంత్రి గుర్తుచేశారు. అనంతపురం జిల్లాలో కియా ప్లాంట్ ఏర్పాటు చేస్తుందని అప్పట్లో ఎవరూ ఊహించలేదని, సంస్థ యాజమాన్యాన్ని ఒప్పించేందుకు స్వయంగా దక్షిణ కొరియాకు వెళ్లినట్లు తెలిపారు. ప్లాంట్‌కు అవసరమైన నీటి సౌకర్యం కోసం గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకువచ్చి సహకరించామని, జాతీయ రహదారి, బెంగళూరు విమానాశ్రయానికి అనుసంధాన సదుపాయాలు కల్పించామని చెప్పారు. కేవలం 14 నెలల్లోనే ప్లాంట్ నిర్మాణం పూర్తయ్యేలా ప్రభుత్వం సహకరించిందని, ఏపీలో తయారైన తొలి కియా కారును తానే ప్రారంభించినట్లు గుర్తుచేశారు. 2019 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో కార్ల ఉత్పత్తి ప్రారంభించిన కియా సంస్థ ప్రస్తుతం అనంతపురం జిల్లా పెనుకొండ ప్లాంట్ నుంచి 100కు పైగా దేశాలకు వాహనాలను ఎగుమతి చేస్తోంది. కియా ప్రస్తుత ప్లాంట్‌లో సెల్టోస్, సైరోస్, సోనెట్, కారెన్స్, కారెన్స్ క్లావిస్, కార్నివాల్, సోరెంటో వంటి మోడళ్లను ఉత్పత్తి చేస్తోంది. తాజా విస్తరణతో అధునాతన వాహనాల తయారీ, ఎగుమతులు, అనుబంధ పరిశ్రమల అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ మరింత కీలక పాత్ర పోషించనుంది.

మండల ప్రజా పరిషత్ పరోక్ష ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలి

ఎన్నికల నిబంధనలపై ప్రిసైడింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలి...
జిల్లా పరిషత్ సీఈఓ పి. సుశీల



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

ఎన్టీఆర్ జిల్లాలో మండల ప్రజా పరిషత్‌లకు సంబంధించి కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికతో పాటు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నికల ప్రక్రియను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి.సుశీల ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు.జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం విజయవాడలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రిసైడింగ్ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణా కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ పి.సుశీల మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారులు తమ బాధ్యతలను పూర్తి అవగాహనతో, అప్రమత్తంగా నిర్వర్తించాలని తెలిపారు. కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నికలకు సంబంధించిన విధివిధానాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు.ఎన్నికల నోటీసుల జారీ, సమావేశాలకు అవసరమైన కోరం నిర్ధారణ, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, ఓటింగ్, ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై అధికారులకు వివరించారు. సమాన ఓట్లు వచ్చిన సందర్భంలో లాటరీ ద్వారా విజేతలను నిర్ణయించే విధానం, రాజకీయ పార్టీల అభ్యర్థుల అధికారిక గుర్తింపు పత్రాలు, పార్టీ విప్ జారీ, అమలు, ఎన్నికల సమావేశాల నిర్వహణ, ఫలితాల ప్రకటన, రికార్డుల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఎన్నికలను సజావుగా పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆమె స్పష్టం చేశారు. ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల నియమ నిబంధనలను పూర్తిగా అవగాహన చేసుకొని, తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించి ఎన్నికల ప్రక్రియ విజయవంతం కావడానికి కృషి చేయాలని సీఈఓ పి. సుశీల సూచించారు.

Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at West Godavari and published at D. No.11-12-124, Nawabpetcolony,3rd Division, Eluru editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1219.cell:9502116677.

ప్రజాభూమి
జనరల్ 13
శుక్రవారం 13 నవంబర్ 2026

స్థానిక సంస్థల ఎన్నికలకు సర్వం సిద్ధం కలెక్టర్ : ఆర్.మహేష్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి అమలాపురం

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎన్నికల నిర్వహణ, సిబ్బంది కేటాయింపు, నామినేషన్ కేంద్రాలు, పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనే రిటర్నింగ్ అధికారులు , ఇతర సిబ్బందికి స్టేజ్-1, స్టేజ్-2 శిక్షణ కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. శిక్షణకు హాజరుకాని సిబ్బందికి మరో అవకాశం కల్పించి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. గ్రామ పంచాయతీలను క్లస్టర్ల వారీగా విభజించి నామినేషన్ కేంద్రాలను గుర్తించాలని, అక్కడ అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియపై అధికారులకు పూర్తి అవగాహన కల్పించడంతో పాటు ప్రతి దశను తప్పనిసరిగా వీడియోగ్రఫీ చేయించాలని స్పష్టం చేశారు.పోలింగ్ కేంద్రాల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన సిబ్బందిని కేటాయించాలని, ఎన్నికల నిర్వహణలో మానవ వనరుల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖ తదితర ప్రభుత్వ శాఖల సిబ్బంది సేవలను కూడా వినియోగించుకోవాలని సూచించారు. అన్ని మండలాల్లో బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసుకోవాలని, పోలింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతల పర్యవేక్షణకు పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని సూచించారు.

మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు

రాష్ట్రంలో తొలి విడతగా 100 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో మిగిలిన 23 మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం



జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించింది. 23 మున్సిపాలిటీలకు నవంబర్ 12న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగా, నవంబర్ 14 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. నవంబర్ 26న పోలింగ్, నవంబర్ 30న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. మేయర్, ఛైర్‌పర్సన్ ఎన్నికలు డిసెంబర్ 3న నిర్వహించనుండగా, అనివార్య కారణాలతో వాయిదా పడితే డిసెంబర్ 4న నిర్వహించనున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనున్నారు. మొదటి విడతకు నవంబర్ 13న నోటిఫికేషన్ విడుదల చేసి నవంబర్ 26న పోలింగ్, ఫలితాల వెల్లడి చేపట్టనున్నారు. రెండో విడతకు నవంబర్ 16న నోటిఫికేషన్ విడుదల చేసి నవంబర్ 29న పోలింగ్ నిర్వహిస్తారు. మూడో విడతకు నవంబర్ 19న నోటిఫికేషన్ విడుదల చేసి డిసెంబర్ 2న పోలింగ్, ఫలితాల ప్రకటన చేపట్టనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 13,169 గ్రామ పంచాయతీల పరిధిలో 1,34,847 పోలింగ్ బూత్‌లలో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఎన్నికలు పూర్తయిన 100 మున్సిపాలిటీలకు పరోక్ష ఎన్నికలు నవంబర్ 23న, అవసరమైతే నవంబర్ 24న నిర్వహించనున్నారు. ఎంపీపీ ఎన్నికలు నవంబర్ 19న, జడ్పీపీ ఎన్నికలు నవంబర్ 20న జరగనున్నాయి.సమస్యాత్మక ప్రాంతాల్లో అభ్యర్థులు ఎలాంటి ఆటంకాలు లేకుండా నామినేషన్లు దాఖలు చేసుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్ ఎన్నికల నామినేషన్లను అవసరమైన చోట జిల్లా కలెక్టరేట్లలో కూడా స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. 10 వేల కంటే తక్కువ జనాభా ఉన్న రెండు నుంచి నాలుగు చిన్న గ్రామ పంచాయతీలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి, అందులోని ప్రధాన పంచాయతీ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నారు. 10 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీలకు ప్రత్యేక రిటర్నింగ్ అధికారులను నియమించనున్నారు. నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాలు లేదా వీడియోగ్రఫీ ఏర్పాటు చేయాలని, సంబంధిత ఫుటేజీని 60 రోజుల పాటు లేదా ఎన్నికల పిటిషన్ల పరిష్కారం పూర్తయ్యే వరకు భద్రపరచాలని ఆదేశించారు.గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. గత మున్సిపల్ ఎన్నికల్లో ఏడు జిల్లాలకు పరిమితమైన ఫిర్యాదులు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సమయంలో 25 జిల్లాలకు విస్తరించిన నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులను బెదిరించడం, కిడ్నాప్ చేయడం, నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం వంటి ఘటనలకు ఎక్కడా అవకాశం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ కేంద్రాలకు అభ్యర్థులు సురక్షితంగా చేరుకునేందుకు రూట్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు మొబైల్ పోలీసు పార్టీల సంఖ్యను పెంచాలని సూచించారు. రెండు వర్గాలు ఒకేసారి నామినేషన్ కేంద్రాల వద్దకు చేరుకుని ఘర్షణలకు దిగకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని స్పష్టం చేశారు.రాష్ట్ర ఎన్నికల సంఘం కాల్ సెంటర్‌కు ఫోన్ ద్వారా లేదా నేరుగా అందే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించేలా స్ట్రైకింగ్ ఫోర్సెస్, స్పెషల్ ఫోర్సెస్ బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.జిల్లా ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ పూర్తి అప్రమత్తతతో పనిచేస్తుందన్నారు. నామినేషన్ల స్వీకరణ నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు.ఈ సమావేశంలో డీఆర్వో వి. సుబ్బారావు సీపీఓ ఎం. మురళీకృష్ణ జిల్లా పంచాయతీ అధికారిని కే శాంతి కుమారి జిల్లా పరిపాలన అధికారి కె నాగలక్ష్మమ్మ వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కత్తిపూడిలో వైసీపీకి షాక్..
టీడీపీలో చేరిన 10 కుటుంబాలు

- పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా

ప్రజా భూమి, ప్రత్తిపాడు

శంఖవరం మండలం కత్తిపూడి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 10 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. కూటమి ప్రభుత్వ పాలనపై నమ్మకంతో, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా నాయకత్వానికి మద్దతుగా తాము టీడీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, మండల జడ్పీటీసీ కంచిబోయిన శ్రీను ఆధ్వర్యంలో ఈ చేరికల కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ నాయకులు కూసుమంచి సూర్యప్రకాష్ రావు, కందుకూరి సత్యనారాయణ, కందుకూరి సూరిబాబు తదితరులు తమ కుటుంబాలతో కలిసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వ పాలనపై విశ్వాసంతో పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ స్వాగతం పలికిన ఎమ్మెల్యే.. కత్తిపూడిలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం కావడానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఐక్యంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాబు కృష్ణమూర్తి, వెన్నా లక్ష్మీబాబు, రౌతు శివ, కేళంగి జన, కొయ్యా రమణ, గాబు శివ, ఆలపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కూటమి విజయానికి క్షేత్రస్థాయి కార్యకర్తలే బలం

- ఎమ్మెల్యే బడేటి చంటి

ప్రజాభూమి ఏలూరు

క్షేత్రస్థాయి కార్యకర్తలే కూటమికి అండదండలని, ఎన్నిక ఏదైనా విజయం కూటమి పక్షమేనని జిల్లా టీడీపీ అధ్యక్షులు,ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ప్రజల విశ్వాసమే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూటమి గెలుపునకు పునాది అని పేర్కొన్నారు.ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్న ఆయన, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన నాయకులు కూడా ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సమర్థవంతంగా పనిచేయాలని విజేతలకు బడేటి చంటి సూచించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలి

ఉప కమిషనర్ డిఎల్వి రమేష్ బాబు



ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో వేంచేసియున్న శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం నందు గురువారం నిమిషాలకు కాకినాడ ఉప కమిషనర్ డిఎల్వి రమేష్ బాబు కార్తీక మాస మహోత్సవములు జరుగుచున్న సందర్భంగా భక్తులు క్యూ లైన్ ద్వారా దర్శనం చేసుకునే ఏర్పాట్లపై మరియు నిత్యాన్నదానం జరుగు మండపములను పరిశీలన చేసి భక్తులకు ఏ విధమైన అసౌకర్యములు కలగు కుండా నిత్య అన్నదానము ప్రసాదము జరిపించవలసిందిగా కార్యనిర్వహణాధికారి కి తగు సూచనలు చేసినారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా డిస్ట్రిక్ట్ ఎండోమెంట్ ఆఫీసర్ వి.వెంకటేశ్వరరావు కార్యనిర్వహణాధికారి రాపాక శ్రీనివాసరావు ఆలయ చైర్మన్ మీసాల రామచంద్రరావు ఆలయ ధర్మకర్తలు ఉప్పలగు దుర్గా పెద్దిరాజు, హోతా ప్రవాళ నాలము నాగ వెంకట సురేఖ,కొండ్రెడ్డి సూరిబాబు, పెనుమెచ్చ శ్రీదేవి, బాసిన అప్పలనాగసత్యనారాయణ, వందరపు కుమారి, నీ లాపు సింహాచలం, నీలాపు మణి ఆలయ సూపరింటెండెంట్ వాసు, మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఢిల్లీ బౌలింగ్ అకాడమీకి ర్యాలీ యువకుడు అభినవ్

- యువ ఫాస్ట్ బౌలర్‌ను అభినందించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

ఆత్రేయపురం, గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయస్థాయి క్రికెట్ శిక్షణకు ఎంపికై ప్రతిభ చాటిన ర్యాలి గ్రామ యువకుడు కొత్తపల్లి అభినవ్‌ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభినందించారు. గురువారం వాడపాలెంలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద 16 ఏళ్ల యువ ఫాస్ట్ బౌలర్ అభినవ్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించి ఆశీర్వదించారు. ఢిల్లీ బౌలింగ్ అకాడమీకి అభినవ్ ఎంపిక కావడం కొత్తపేట నియోజకవర్గానికి గర్వకారణమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆన్‌లైన్ ట్రయల్స్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి అకాడమీలో చోటు సంపాదించడం అతని కృషి, ప్రతిభకు నిదర్శనమన్నారు. క్రికెట్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి భవిష్యత్తులో ఎన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ర్యాలి గ్రామంతో పాటు కొత్తపేట నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని అభినవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్రేయపురం జడ్పీటీసీ గూడపాటి శ్రీనివాసరావు, ర్యాలి గ్రామ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పెర్చెర్ల పుల్లంరాజు వర్మ, జగన్మోహని కేశవ స్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మెర్ల నాగేశ్వరావు, ర్యాలి గ్రామ ఎంపీటీసీ-3 అత్తిలి వెంకటేశ్వర రావు, కొత్తపల్లి శ్రీనివాస్ గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పంచాయతీ పీఠంపై 'పొలిటికల్ ఫైట్'!

- కూటమిలో టీడీపీ -- జనసేన మధ్య ఆధిపత్య పోరు.. టికెట్ కోసం ఎవరి ప్రయత్నాలు వారివే!.
- అనుభవం ఉన్న మద్దూరి సుబ్బారావుకా.. యువ నాయకుడు మద్దూరి రామకృష్ణకా?.
- అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ, గ్రామ రాజకీయాల్లో రోజురోజుకూ పెరుగుతున్న వేడి.

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

ఆత్రేయపురం మండలంలోనే కీలకమైన మేజర్ పంచాయతీగా పేరొందిన ర్యాలి గ్రామంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామ పంచాయతీ అధ్యక్ష పదవి కోసం అప్పుడే రాజకీయ వేడి రాజుకుంది. ఈసారి సర్పంచ్ స్థానం ఓసీ జనరల్‌కు కేటాయించడంతో అధికార కూటమిలోని తెలుగుదేశం, జనసేన పార్టీల మధ్య అభ్యర్థిత్వం కోసం అంతర్గత పోటీ ఆసక్తికరంగా మారింది. కూటమి తరఫున బరిలో నిలిచే అవకాశం ఎవరికి దక్కుతుందన్నది ప్రస్తుతం గ్రామ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

ఎమ్మెల్యే ఎన్నికలపై ప్రభావం చూపే గ్రామమనే పేరుంది!

ర్యాలి గ్రామానికి ఆత్రేయపురం మండల రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది. మండలంలోనే అత్యధిక ఓటర్ల ప్రాతినిధ్యం కలిగిన కీలక గ్రామంగా దీనికి పేరుంది. ఈ గ్రామంలో ఏ పార్టీకి మెజారిటీ లభిస్తే ఆ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే ఎన్నికల్లో విజయం సాధిస్తారనే రాజకీయ సెంటిమెంట్ చాలాకాలంగా కొనసాగుతోంది. గత ఎన్నికల అనుభవాలను ఉదాహరణగా చూపుతూ స్థానిక నాయకులు ఈ గ్రామ ఓటర్ల తీర్పుపై ప్రత్యేక దృష్టి సారిస్తుంటారు. దీంతో ర్యాలి పంచాయతీ పీఠాన్ని దక్కించుకోవడం కేవలం గ్రామస్థాయి రాజకీయాలకే పరిమితం కాకుండా నియోజకవర్గ రాజకీయాల్లోనూ ప్రతిష్ఠాత్మకంగా మారింది.

టీడీపీ నుంచి సీనియర్ నేత సుబ్బారావు పేరు!



తెలుగుదేశం పార్టీ తరపున సీనియర్ నాయకుడు మద్దూరి సుబ్బారావు సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయాలనే డిమాండ్ పార్టీ శ్రేణుల్లో బలంగా వినిపిస్తోంది. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, వివిధ పదవుల్లో పనిచేసిన నేపథ్యం, గ్రామస్థాయిలో ఉన్న పరిచయాలు ఆయనకు అనుకూల అంశాలుగా అనుచరులు చెబుతున్నారు. పార్టీ కోసం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న నాయకుడిగా గుర్తింపు పొందిన ఆయనకు ఈసారి అవకాశం కల్పించాలని టీడీపీ కేడర్‌లోని పలువురు పట్టుబడుతున్నట్లు సమాచారం. ఇదే క్రమంలో బుధవారం రాత్రి మద్దూరి సుబ్బారావు తన అనుచరులతో ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో అభ్యర్థిత్వానికి సంబంధించిన తన అభిప్రాయాన్ని వెల్లడించగా, కులమతాలకు అతీతంగా గ్రామ ప్రజల మద్దతుతో ఆయన్ను గెలిపించుకుంటామని అనుచరులు భరోసా ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

జనసేన నుంచి యువ నాయకుడు రామకృష్ణ ప్రయత్నాలు!

మరోవైపు జనసేన పార్టీ తరఫున మద్దూరి రామకృష్ణ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నారు. యువ నాయకుడిగా గ్రామంలో తనకంటూ గుర్తింపు ఉందని, అన్ని సామాజిక వర్గాల ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయని ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. నియోజకవర్గ జనసేన నాయకత్వం, పార్టీ ముఖ్యుల మద్దతు తనకు ఉందన్న ధీమాతో రామకృష్ణ ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. ర్యాలి వంటి కీలక గ్రామంలో జనసేనకు ప్రాతినిధ్యం లభించాల్సిన అవసరం ఉందని, యువతకు అవకాశం కల్పిస్తే గ్రామ రాజకీయాల్లో కొత్త మార్పులకు శ్రీకారం చుట్టవచ్చని ఆయన మద్దతుదారులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఒకవైపు అనుభవం, మరోవైపు యువతరం నాయకత్వం అన్న చర్చ గ్రామంలో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

బలప్రదర్శనలో ఎవరికి వారే.. మద్దతు కూడగట్టే ప్రయత్నాలు!

గత రెండు రోజులుగా గ్రామంలో ఇరు వర్గాలు తమ రాజకీయ బలాబలాలను అంచనా వేసుకునే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం. ముఖ్య అనుచరులతో సమావేశాలు, సామాజిక వర్గాల పెద్దలతో సంప్రదింపులు, తమకు అనుకూలంగా ఉన్న నాయకుల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ఎవరికి ఎంతమంది అనుచరులు ఉన్నారు? గ్రామంలోని వివిధ వర్గాల నుంచి ఎవరికి మద్దతు లభిస్తోంది? అన్న అంశాలపై ఇరు వర్గాలు లెక్కలు వేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే కూటమి పార్టీల మధ్య సమన్వయం దెబ్బతినకుండా ఉమ్మడి అభ్యర్థిని ఎంపిక చేయడం నాయకత్వానికి కీలక సవాలుగా మారనుంది. ఇద్దరిలో ఎవరికైనా అవకాశం దక్కకపోతే మరో వర్గం ఎలా స్పందిస్తుంది? పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటారా? లేక స్వతంత్రంగా బరిలోకి దిగే ఆలోచన చేస్తారా? అన్న ప్రశ్నలు కూడా గ్రామ రాజకీయాల్లో చర్చనీయాంశమవుతున్నాయి.

అనుభవానికా.. యువతరానికా?

నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం కలిగిన మద్దూరి సుబ్బారావుకు అవకాశం కల్పిస్తారా? లేక యువ నాయకత్వానికి ప్రాధాన్యమిస్తూ మద్దూరి రామకృష్ణకు టికెట్ కేటాయిస్తారా? అన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ఒకవైపు సీనియారిటీ, రాజకీయ అనుభవం, మరోవైపు యువతరంలో ఉత్సాహం, కొత్త ఆలోచనలు, ఈ రెండింటి మధ్య కూటమి నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న ఉత్కంఠ నెలకొంది. అంతిమంగా అభ్యర్థి ఎంపికలో పార్టీ బలం, వ్యక్తిగత ప్రజాదరణ, గ్రామంలోని సామాజిక సమీకరణాలు, గెలుపు అవకాశాలు కీలకంగా మారనున్నాయి. నియోజకవర్గ కూటమి నాయకులు ఎవరికి పచ్చజెండా ఊపుతారో వేచి చూడాల్సిందే. మొత్తానికి ర్యాలి పంచాయతీ పీఠం కోసం పోటీ ఇప్పుడే రసవత్తరంగా మారింది. అభ్యర్థి ప్రకటనతో ఏ మలుపు తిరుగుతుందోనన్న ఆసక్తి గ్రామ ప్రజల్లో నెలకొంది. ర్యాలి పీఠం ఎవరిని వరిస్తుంది? అనుభవానికి పట్టం కడుతుందా? యువతరానికి అవకాశం ఇస్తుందా? అన్నది త్వరలో తేలనుంది.

ప్రత్తిపాడు సర్పంచ్ బరిలో గోపిశెట్టి శ్రీను?

- ప్రజాసేవా కార్యక్రమాలతో స్థానికంగా గుర్తింపు.. పోటీపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ

ప్రజా భూమి, ప్రత్తిపాడు

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రత్తిపాడు గ్రామ పంచాయతీ రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ప్రత్తిపాడు సర్పంచ్ స్థానానికి కూటమి (జనసేన) నాయకుడు గోపిశెట్టి శ్రీను పోటీ చేయనున్నారనే ప్రచారం స్థానికంగా సాగుతోంది. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆశీస్సులతో కూటమి అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలవాలనే ఆలోచనలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



ప్రజాసేవతో ప్రత్యేక గుర్తింపు

గోపిశెట్టి శ్రీను ఒక సాధారణ జనసైనికుడిగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, రాజకీయాలకు అతీతంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తూ వారి చదువుకు అండగా నిలుస్తున్నారు. అవసరంలో ఉన్నవారికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు.

సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టాలనే ఆలోచన?

ప్రత్తిపాడు గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టి గ్రామాభివృద్ధికి మరింత కృషి చేయాలనే లక్ష్యంతో గోపిశెట్టి శ్రీను ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆశీస్సులు, కూటమి నాయకులు, కార్యకర్తల సహకారంపై రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

ఆసక్తికరంగా మారిన ప్రత్తిపాడు రాజకీయాలు

నియోజకవర్గ కేంద్రం కావడంతో ప్రత్తిపాడు గ్రామ సర్పంచ్ స్థానం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో గోపిశెట్టి శ్రీను పోటీకి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఆయన అభ్యర్థిత్వంపై కూటమి నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? ఎన్నికల బరిలో నిలుస్తారా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

ప్రజాభూమి

జనరల్ 14

శుక్రవారం 13 నవంబర్ 2026



విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు..

సేవా కార్యక్రమాలతో ట్రస్ట్

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

నెక్కలం గొల్లగూడెం మండల ప్రజాపరిషత్ నమూనా ప్రాథమిక పాఠశాలలో ఇమేజ్ లైన్స్ బహుళ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలలో నూతనంగా నిర్మించిన గదులకు రెండు పైకప్పు విద్యుత్ పంకాలు బహుకరించడంతో పాటు, జన్మదినం జరుపుకుంటున్న ఐదుగురు విద్యార్థులకు నూతన వస్త్రాలు అందజేశారు. విద్యార్థులతో కేక్ కోయించి, కేకులు, మిఠాయిలు పంపిణీ చేశారు. ప్రతినెలా జన్మదినాలు జరుపుకునే విద్యార్థులకు నూతన వస్త్రాలు అందజేస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు కేవీ రామారావు, ఉపాధ్యక్షుడు డీవీ శ్రీధర్, కార్యదర్శి జయశ్రీ, కోశాధికారి ఎన్‌సీఎస్ శ్రీనివాసాచార్యులు, సహ కార్యదర్శి మాధవీలత, సభ్యుడు ఆర్. కన్నన్ పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు ఎం. సత్యనారాయణ, కొవ్వలి ఆనంద్ కుమార్ హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, ఉపాధ్యాయులు సురేష్ కుమార్, వేణుగోపాల్, కమురున్నిసా చారి ట్రస్ట్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

"ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించండి"

- సాయి శ్రీనివాస్ డిమాండ్"



ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

ఎస్ టి యు ప్రాంతీయ సమావేశం టీచర్స్ కాలనీ పాలకొల్లు నందు నిర్వహించడం జరిగినది. ఈ సమావేశాన్ని ముఖ్య అతిథిగా ఎస్ టి యు అధ్యక్షులు మరియు ఫ్యాప్టో చైర్మన్, ఎ మ్మెల్సీ అభ్యర్థి శ్రీ లంకలపల్లి సాయి శ్రీనివాస్ గారు హాజరైనారు. ఈ సమావేశంలో సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ స్పెషల్ టెట్ రిజల్ట్ వెంటనే విడుదల చేయాలనీ.... రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఐర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. మున్సిపాలిటీలో పనిచేస్తున్న టీచర్లకు పిఎఫ్ అకౌంట్ లేదు జిపిఎఫ్ అకౌంట్ లేదు కావున వారికి సంబంధించిన డి ఎ ఏరియర్స్ బిల్లును వారి సేవింగ్ అకౌంట్ కి జమ చేయవలసిందిగా కోరడమైనది ఎమ్మెల్సీ ఓటర్ నమోదు గురించి, ఎ మ్మెల్సీ ఎన్నికలలో అమలు చేయవలసిన వ్యూహాల గురించి చర్చించడం జరిగినది ఈ సమావేశానికి ఎలమంచిలి పాలకొల్లు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మరియు కార్యవర్గ సభ్యులు హాజరైనారు డీఎ స్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమల విధానంలో ఉన్నటువంటి సాంకేతిక ఇబ్బందులను తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో వలవల సుబ్రహ్మణ్యం దాసరి రాజకుమార్ చేగొండి సత్యనారాయణ ఐ ఎస్ ఎన్ రాజు ఎస్ టి యు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

డిసెంబర్ 1 ఢిల్లీ కార్మికుల పార్లమెంట్ మార్చ్‌ను జయప్రదం చేయాలి



ప్రజాభూమి – కుక్కునూరు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ విమర్శించారు. డిసెంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న కార్మికుల పార్లమెంట్ మార్చ్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం నాడు స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో సిఐటియు మండల కో-కన్వీనర్ షేక్ వలిపాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాయికిరణ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు పూర్తయినా దేశంలోని కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత అందడం లేదన్నారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, విఒఏ, ఐకెపి, సమగ్ర శిక్ష తదితర పథకాలలో పనిచేస్తున్న కార్మికులను ఇప్పటికీ కార్మికులుగా గుర్తించకపోవడం దుర్మార్గమన్నారు. వీరందరికీ కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ పాలసీ, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం కార్మిక హక్కులను కాలరాయడమేనని అన్నారు. ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కార్మికులకు నెలకు రూ.42 వేల కనీస వేతనం, రూ.42 వేల పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశ సంపదను సృష్టిస్తున్న కార్మికులకు తగిన వాటా దక్కడం లేదని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం, ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం ఆపాలని అన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం డిసెంబర్ 1న ఉదయం 10 గంటలకు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం నుంచి నిర్వహించనున్న పార్లమెంట్ మార్చ్‌లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు పోచవరపు వెంకటేశ్వర్లు, కారం రాజేశ్వరి, మెడవరపు రమాదేవి, వర్స మంగ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ఎన్నికలకు పటిష్టమైన చర్యలు

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా



ఏలూరు జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి రాష్ట్ర ఎన్నికల కమీషనర్ అనిల్ చంద్ర పునేఠా కు తెలిపారు. రాష్ట్రంలో 23 పట్టణ స్థానిక సంస్థల, గ్రామ పంచాయతీలకు సంబంధించి, రెండవ సాధారణ ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుండి పంచాయతీరాజ్, పురపరిపాలన కమిషనర్లు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీ లు, ఎన్నికల పరిశీలకులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమీషనర్ అనిల్ చంద్ర పునేఠా మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి రాష్ట్రంలో 23 పట్టణ స్థానిక సంస్థలు , గ్రామ పంచాయతీలకు ఎన్నికల ప్రక్రియలను నిర్వహించాలన్నారు. అదేవిధంగా ఇటీవల ఎన్నికలు నిర్వహించిన నగరపాలక సంస్థలలో మేయర్, డిప్యూటీ మేయర్, , పురపాలక సంఘాలలో చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి జిల్లా పరిషత్ చైర్ పర్సన్, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఎంపిపి ల ఎంపికలను కూడా నిర్దేశించిన తేదీలలో నిర్వహించాలన్నారు. ఏలూరు కలెక్టరేట్ నుండి పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు పటిష్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. నగరపాలక సంస్థలలో మేయర్, డిప్యూటీ మేయర్, పురపాలక సంఘాలలో చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి జిల్లా పరిషత్ చైర్ పర్సన్, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఎంపిపి ల ఎంపికలను కూడా నిర్దేశించిన తేదీలలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ, నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న, జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు, ఆర్డీఓ లు లక్ష్మీప్ర సన్న, మండల తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ప్రభృతులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కంచుకోటకు బీటలు?

- పరిషత్ ఎన్నికల ఫలితాలతో డీలా
- పంచాయతీ ఎన్నికల వేళ వెన్నుపోటు



ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

ఇటీవల జరిగిన పరిషత్ ఎన్నికల ఫలితాలు కొత్తపేట నియోజకవర్గంలో ప్రకంపనలు సృష్టించాయి. ప్రధానంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికలు గడ్డు పరిస్థితిని తెచ్చిపెట్టాయి. ఎన్నో దశాబ్దాలుగా నియోజకవర్గంలో ఆనాడు కాంగ్రెస్ పార్టీకి, ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా నిలుస్తున్న రావులపాలెం మండలంలో కూటమి పార్టీలు విజయకేతనం ఎగురవేసి తొలిసారి ఎంపీపీ పీఠాన్ని కైవసం చేసుకోవడం సంచలనం సృష్టించింది. నియోజకవర్గంలోని నాలుగు జెడ్పీటీసీ, ఎంపీపీ పీఠాలను కూటమి దక్కించుకోవడం ఒక బాధ అయితే మండల పరిషత్ చరిత్రలోనే తొలిసారిగా రావులపాలెంలోని ఆరు ఎంపీటీసీ స్థానాలు టీడీపీకి దక్కడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు మింగుడు పడని విషయం. మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న చిర్ల జగ్గిరెడ్డి స్వగ్రామం గోపాలపురంలో సైతం తొలిసారి రెండు ఎంపీటీసీ స్థానాల్లో సైతం కూటమి విజయం సాధించడం ఆ పార్టీకి పెద్ద దెబ్బే అని విశ్లేషకులు భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సుమారు రెండున్నర ఏళ్ల తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో ప్రభుత్వంపై కొంత వ్యతిరేకత కనిపిస్తుందని వైసీపీ భావించినప్పటికీ గత అసెంబ్లీ ఎన్నికలను తలపించే విధంగా భారీ మెజారిటీలతో కూటమి అభ్యర్థులు గెలవడం ఆ పార్టీ శ్రేణులను తీవ్ర నిరాశకు గురి చేసిందనే చెప్పాలి. దీంతో మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డికి కంచుకోటగా భావించే రావులపాలెం మండలం చేజారినట్టేనా అనే చర్చ సాగుతోంది. దీంతో కొద్దిరోజుల్లో జరగబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం జగ్గిరెడ్డి భారీ వ్యూహాలు సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఆదిలోనే హంస పాదు అన్న చందంగా టీసీ జనరల్ కు రిజర్వు అయిన మండల కేంద్రం రావులపాలెం గ్రామ పంచాయతీకి వైసీపీ మద్దతుతో అభ్యర్థిగా బరిలో దిగుతారని భావించిన మాజీ జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు వ్యవహారం బెడిసి కొట్టడంతో ఆ పార్టీ శ్రేణులను అయోమయంలో పడేసింది. పరిషత్ ఎన్నికల ఫలితాలతో ఆలోచనలో పడిన కుడుపూడి అధికార టీడీపీ నేతలతో సంప్రదింపులు జరిపి ఆ పార్టీ తరపున పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేసినట్టు ప్రచారం సాగుతోంది. అయితే కుడుపూడి రాజకీయాలు బెడిసికొట్టి రెండింటికీ చెడ్డ రేవడిగా తయారైందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో పరిషత్ ఎన్నికల అవమానం నుంచి పంచాయతీ ఎన్నికలతో కాస్త బయటపడాలని ఆశించిన జగ్గిరెడ్డికి ఇప్పుడు రావులపాలెం పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి ఎంపిక తలనొప్పిగా మారిందన్న భావన వ్యక్తమవుతోంది. నామినేషన్ల ప్రారంభం నాటికి ఈ పరిస్థితిని ఎలా చక్కదిద్దుతారో వేచి చూడాలి.

పంచాయతీ కార్యదర్శులతో ఎంపిడిఓ సమావేశం



ప్రజాభూమి ప్రతినిధి, కాజులూరు

రానున్న పంచాయతీ ఎన్నికల్లో గ్రామ స్థాయిలో ఎటువంటి పొరపాట్లుకు తావులేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు కాజులూరు ఎంపిడిఓ జె.రాంబాబు సూచించారు.ఈమేరకు గురువారం మండల పరిషత్ కార్యాలయ భవనంలో ఆయన మండల స్థాయి కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ల స్వీకరణ దగ్గర నుంచి ఎన్నికలు పూర్తయ్య వరకు తగు జాగ్రత్తలు పాటిస్తూ ఎటువంటి వివాదాదలకు తావు లేకుండా చూడాలని అన్నారు. అలాగే గ్రామాల్లో పోలింగ్ బూత్లు విషయంలో ఏమైనా సవరణలు, చిన్నపాటి లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అలాగే ఎన్నికల సంబంధించిన పలు అంశాలపై దిశనిర్దేశం చేశారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో ముద్రగడ సత్యనారాయణమూర్తి (చంటి) ఎవో పద్మలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువుకు అదనపు తరగతి గదులు రూ.3.50 లక్షలతో నిర్మాణం

ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి



నెక్కలం గొల్లగూడెం మండల పరిషత్ నమూనా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు చుక్కపల్లి చారిటీ సంస్థ అధినేత్రి చుక్కపల్లి సుధా రూ.3.50 లక్షల వ్యయంతో పాఠశాల భవనంపై అదనంగా రెండు తరగతి గదులు నిర్మించారు. గురువారం ఆమె నూతన గదులను ప్రారంభించారు. ఐదుగురు ఉపాధ్యాయులు రెండు తరగతి గదుల్లోనే బోధన సాగించాల్సిన ఇబ్బందులను గుర్తించి ఈ సహాయం అందించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు సత్యనారాయణ, కె. ఆనంద్ కుమార్ మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి సహకరిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సుధాకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు మంచి విద్యను అభ్యసించినప్పుడే తాను చేస్తున్న సేవలు ఫలించినట్లు భావిస్తానని, ఆ దిశగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని సుధా సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం. నాగమణి, పాఠశాల సముదాయ అధ్యక్షుడు రమణ, పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు ఎన్. వసంతరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం సుధాను శాలువాతో సత్కరించారు.



పాఠశాలకు మైక్ వితరణ

ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు

నూజివీడు మండలము జిల్లాపరిషత్ఉన్నతపాఠశాల అన్న వరములో సీడీక్ట్ ఎన్ జీ ఓ సంస్థ పాఠశాల వనరులు అందించే చర్యలలో భాగంగా 20,000 రూపాయిల విలువ గల మైక్ ను పాఠశాలకు అందించడం జరిగినది అని పాఠశాలప్రధానోపాధ్యాయని విజయకుమారి తెలిపారు.ఆసంస్థ కో ఆర్డినేటర్ శ్రీమతి గౌతమి మాట్లాడుతూ మండలములో వెనుకబడిన ప్రాంతంలో విద్యార్థులకు తమసంస్థ కృషి చేస్తుందనితెలిపారు. దీనిలో భాగంగా యానాది కాలని, కోటావారిగూడెం లో కూడా పాఠశాలకు అవసరమైన మైక్ ఇతర సామాగ్రి అందచేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమమును అధ్యక్షత వహించిన(ప్రధానోపాధ్యాయని విజయకుమారి మాట్లాడుతూ స్కూల్‌కు అందించిన సంస్థ కు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యఅతిథి మండల విద్యాశాఖాధికారి జయల య్య2 మాట్లాడుతూ వెనుక బడిన అన్ని పాఠశాలలకు కూడా అందించాలని కోరారు.స్టాప్ సెక్రటరీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ మంచి కార్యక్రమముఅని,సంస్థను అభినందించి, వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు..

సేవా కార్యక్రమాలతో ట్రస్ట్



ప్రజాభూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

నెక్కలం గొల్లగూడెం మండల ప్రజాపరిషత్ నమూనా ప్రాథమిక పాఠశాలలో ఇమేజ్ లైన్స్ బహుళ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలలో నూతనంగా నిర్మించిన గదులకు రెండు పైకప్పు విద్యుత్ పంకాలు బహుకరించడంతో పాటు, జన్మదినం జరుపుకుంటున్న ఐదుగురు విద్యార్థులకు నూతన వస్త్రాలు అందజేశారు. విద్యార్థులతో కేక్ కోయించి, కేకులు, మిఠాయిలు పంపిణీ చేశారు. ప్రతినెలా జన్మదినాలు జరుపుకునే విద్యార్థులకు నూతన వస్త్రాలు అందజేస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు కేవీ రామారావు, ఉపాధ్యక్షుడు డీవీ శ్రీధర్, కార్యదర్శి జయశ్రీ, కోశాధికారి ఎన్‌సీఎస్ శ్రీనివాసాచార్యులు, సహ కార్యదర్శి మాధవీలత, సభ్యుడు ఆర్. కన్నన్ పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు ఎం. సత్యనారాయణ, కొవ్వలి ఆనంద్ కుమార్ హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, ఉపాధ్యాయులు సురేష్ కుమార్, వేణుగోపాల్, కమురున్నిసా చారి ట్రస్ట్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

వాడపల్లి వేంకన్న హుండీ ఆదాయం రూ.2.91 కోట్లు

- 49 రోజుల హుండీ లెక్కింపులో 39.5 గ్రాముల బంగారం, 1.607 కిలోల వెండి



ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో 37 రోజుల హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ లెక్కింపులో శ్రీ వేంకటేశ్వర స్వామివారి ప్రధాన ఆలయం, శ్రీ విశ్వేశ్వర స్వామివారి ఆలయ హుండీల ద్వారా రూ.2,42,49,560 నగదు ఆదాయం లభించింది. అన్నప్రసాదం హుండీల ద్వారా రూ.48,56,555 ఆదాయం సమకూరింది. దీంతో 37 రోజుల మొత్తం హుండీ ఆదాయం రూ.2,91,06,115గా నమోదైంది. అలాగే హుండీల ద్వారా 39 గ్రాముల 500 మిల్లీగ్రాముల బంగారం, ఒక కిలో 607 గ్రాముల వెండి లభించాయి. 16 దేశాలకు చెందిన 136 విదేశీ కరెన్సీ నోట్లు కూడా లభించినట్లు దేవస్థాన అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు సీహెచ్. సత్యనారాయణ, టీ. సాయిప్రసాద్, వీ. సుందర శేషావతారం, అమలాపురం అసిస్టెంట్ కమిషనర్, జిల్లా దేవదాయ శాఖ అధికారి శ్రీలక్ష్మీనారాయణ శెట్టి, ఎస్.టి.పి.టి. శ్రీనివాస్, గ్రూపు దేవాలయాల ఈఓలు పి.వి.వి.ఎస్. కామేశ్వరరావు, శ్రీ ఉమా కొప్పులింగేశ్వర స్వామి ఆలయ ఈఓ, పలివెల అర్చకులు, వేదపండితులు, గ్రామస్థులు పాల్గొన్నారు. అలాగే వై. వెంకన్న, వై. వెంకటేశ్వరరావు, వై. సుబ్బారావు, యెరుబండి రాజు, సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు, సీనియర్ అసిస్టెంట్లు కుమార్, వర్మ, మనోజ్, జూనియర్ అసిస్టెంట్లు వై. శ్రీనివాస్, వరప్రసాద్, పోలీసు సిబ్బంది, శ్రీవారి సేవకులు, బ్యాంకు సిబ్బంది, దేవస్థాన సిబ్బంది హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్ 15

శుక్రవారం 13 నవంబరు 2026

గంగవరంలో ఓపెన్ స్కూల్ ప్రవేశాలు ప్రారంభం

ఈ నెల 30వ తేదీతో ముగియనున్న దరఖాస్తుల గడువు

ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం

ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి పదో తరగతి,ఇంటర్మీడియట్ ప్రవేశాలు ప్రారంభమైనట్లు గంగవరం జీటీడబ్ల్యూఏహెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ సత్యవతి తెలిపారు మండలంలోని అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు ముఖ్యంగా వివిధ కారణాలతో చదువును మధ్యలో నిలిపివేసిన వారు ఓపెన్ స్కూల్ విధానం ద్వారా తిరిగి తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించవచ్చని పేర్కొన్నారు విద్యకు దూరమైన వారికి ఇది మంచి అవకాశమని తెలిపారు ఈ నెల 30వ తేదీతో ప్రవేశాల దరఖాస్తుల గడువు ముగియనున్నందున ఆసక్తి గల అభ్యర్థులు సకాలంలో ప్రవేశాలు పొందాలని సూచించారు మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన కోఆర్డినేటర్లు టీ.జయలక్ష్మి 9550518004 ఎం.లావణ్య 9492160889అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని ప్రధానోపాధ్యాయురాలు సత్యవతి కోరారు.

రాబోయే స్థానిక సంస్థల,గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలి

-రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ



ప్రజాభూమి ప్రతినిధి-రంపచోడవరం

అమరావతి నుండి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్,జిల్లా ఎస్పీ కె.చక్రవర్తి, జాయింట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, రంపచోడవరం సబ్ కలెక్టర్ డి. పృధ్వి రాజ్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కరరావు, జడ్పీ సీఈవో పురుషోత్తం పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలవరం జిల్లాలో చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లు, ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సమీక్షించారు.ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా,నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని ఆయన సూచించారు.పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి తగిన శిక్షణ అందించడం,బ్యాలెట్ బాక్సుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేయాలని కమిషనర్ సూచించారు. ప్రశాంతమైన వాతావరణం లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు.

ఆరు మండలాల్లో నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం




ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

పోలవరం జిల్లా పరిధిలోని ఆరు మండలాల్లో ఈ నెల 14వ తేదీ శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. గోకవరం మండలం బావోజీపేట 220/33 కేవీ ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్ నుంచి రంపచోడవరం 220/33 కేవీ ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్‌కు వచ్చే హైటెన్షన్ విద్యుత్ ప్రసార లైన్లలో వార్షిక మరమ్మతులు, ఆధునీకరణ పనులు చేపట్టనున్నారు.ఈ పనుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. దీంతో రంపచోడవరం, మారేడుమిల్లి, గంగవరం, అడ్డతీగల, రాజమ్మంగి, వై.రామవరం మండలాల్లోని పరిసర ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడనుంది.అయితే వినియోగదారులకు ఇబ్బందులు తగ్గించేందుకు గోకవరం 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి రంపచోడవరం 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు 33 కేవీ లైన్ల ద్వారా ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా చేసేందుకు ఏపీఈపీడీసీఎల్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయినప్పటికీ అధిక విద్యుత్ లోడ్, భద్రతా ప్రమాణాల కారణంగా కొన్ని ప్రాంతాల్లో కొంత సమయం విద్యుత్ సరఫరా నిలిచిపోయే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, విద్యుత్ శాఖకు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. అచ్యుతచారి ఒక ప్రకటనలో కోరారు.

పోలవరం జిల్లాలో 2027 సెన్సెస్ ప్రారంభం

పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్



ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

పోలవరం జిల్లాలో 12 మండలాల పరిధిలో గల గ్రామాలలో సెకండ్ పేజ్ 2027 సెన్సెస్ ప్రతి కుటుంబంలోనీ వివరాలు సేకరించాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హలులో జనగణన - 2027 నిర్వహణకు సంబంధించి జనగణన శిక్షణ కార్యక్రమాన్ని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్,జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్, రంపచోడవరం సబ్ కలెక్టర్ డి.పృధ్వి రాజ్ కుమార్, సెన్సస్ జాయింట్ డైరెక్టర్ సాయి శేఖర్ నిర్వహించారు.భారత ప్రభుత్వం, జనగణన, ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జనగణన -2027 రెండో దశ జనాభా గణన నిర్వహణకు సంబంధించిన విధివిధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ పోలవరం జిల్లాలో గిరిజన ప్రాంతమైన మారుమూల ప్రాంతాలు,కొండ ప్రాంతాలు, దూరంగా ఉన్న నివాస ప్రాంతాలు అధికంగా ఉన్నప్పటికీ జనగణన మొదటి దశను విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమనీ ఆయన తెలిపారు. పోలవరం జిల్లాలో మొత్తం 1,234 నివాస ప్రాంతాలు (హ్యాబిటేషన్లు) ఉన్నాయని, మైదాన ప్రాంత జిల్లాలతో పోలిస్తే ఇక్కడ పరిస్థితులు, రవాణా పరమైన సవాళ్లు ఎక్కువ గా ఉంటాయని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుతం జనగణన రెండో దశకు సంబంధించిన వివరాల సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. మొదటి దశలో ప్రధానంగా గృహాలు, నివాసాల వివరాలను మాత్రమే సేకరించామని,రెండో దశలో ప్రతి కుటుంబానికి సంబంధించిన సామాజిక,ఆర్థిక వివరాలను సమగ్రంగా సేకరిస్తామని ఆయన వివరించారు.రెండో దశలో కుటుంబ సభ్యుల విద్యార్హతలు, కులం,మతం,వృత్తి, అక్షరాస్యత,జనాభా వివరాలు,వలసలు, తాత్కాలికంగా పనిచేస్తున్న వారి వివరాలు,దివ్యాంగుల వివరాలు తదితర అంశాలను సేకరించడం జరుగుతుందన్నారు. ఈ వివరాలు జిల్లాలోని జనాభా స్థితిగతులు, సామాజిక,ఆర్థిక పరిస్థితులు,అభివృద్ధి అవసరాలను అర్థం చేసుకోవడానికి ఎంతో కీలకమని ఆయన తెలిపారు.

పోలవరం జిల్లాలో జనగణన ప్రక్రియలో చేపట్టాల్సిన విధులు, కుటుంబాలు మరియు జనాభాకు సంబంధించిన వివరాల సేకరణ, సమాచార సమోదు,నిర్దేశిత మార్గదర్శకాల పాటింపు వంటి అంశాలపై శిక్షణలో ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు.జనగణన ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆయన సూచించారు.ప్రజల నుంచి సరైన సమాచారాన్ని సేకరించి,ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని తెలిపారు.పోలవరం జిల్లాలో స్వీయ గణన - 2027 జనవరి 10 నుంచి 24వ తేదీ వరకు 15 రోజుల పాటు నిర్వహిస్తారనీ ,ఇంటి ఇంటి జనాభా గణన 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు 35 రోజుల పాటు నిర్వహిస్తారనీ అదేవిదంగా సవరణ ప్రక్రియ 2027 మార్చి 1 నుంచి 5వ తేదీ వరకు ఐదు రోజుల పాటు నిర్వహిస్తారనీ ఇంటి ఇంటి గణన సమయంలో ఎలాంటి వివరాలు మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని,స్వీయ గణన ద్వారా నమోదైన వివరాలను కూడా పరిగణనలోకి తీసుకొని సమగ్రంగా జనాభా గణన చేపట్టాలని ఆయన సూచించారు.ఈ శిక్షణలో ముఖ్యంగా ఎన్యూమరేషన్ బ్లాక్ (గణన బ్లాక్),భవనాల గుర్తింపు,జనగణన గృహం,కుటుంబం, కుటుంబ పెద్ద వివరాలు, గణన చేయాల్సిన వ్యక్తుల వివరాల సేకరణ వంటి అంశాలపై అదేవిధంగా గృహాలకు నంబర్లు కేటాయించే మార్గదర్శకాలు,వివిధ పరిస్థితుల్లో జనగణన నిర్వహించాల్సిన విధానం,వివరాల నమోదు సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనలపై వివరించడం జరిగింది.భారతదేశంలోని పది సంవత్సరాలకు ఒకసారి ఈ సెన్సస్ ప్రక్రియ జరుగుతుందని ఈ సెన్సెస్ వలన మారుమూల గ్రామాలలో వివిధ రకాలైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు త్రాగునీరు, మౌలిక సదుపాయాలు, తదితరవి ఏర్పాటుకు ఈ సెన్సస్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ఎంత సీరియస్గా చేశామో అదేవిధంగా సెన్సస్ ప్రక్రియ కూడా అంతే బాధ్యతగా చేయాలని ఆయన అన్నారు. ప్రతి మండలంలోని గ్రామాలలో సెన్సస్ చేయడానికి ఎక్కడికి అక్కడ ఎనీమరేటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. ప్రతి ఎన్యూరెటర్లకు ఒక టార్గెట్ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. పోలవరం జిల్లాలోని 8 గిరిజన తెగలు కలవని అదేవిధంగా ఈ సెన్సస్ ఎటువంటి తగాదాలకు తావు లేకుండా ఒకటికి రెండుసార్లు పరిశీలించి డిజిటల్ పద్ధతిలో సెన్సస్ నమోదు చేయాలని ఆయన అన్నారు. ఈనెల 12, 13, వ తేదీలలో సెన్సస్ ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంబంధిత అధికారులకు ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో పురుషోత్తం, సిపిఓ వెంకట్రావు, తాసిల్దార్‌లు సిహెచ్ బాలాజీ, స్వామి, సిహెచ్ శ్రీనివాసరావు, కరక సత్యనారాయణ, తేజస్విని, శ్రీరాములు, అమ్మాజీ, సరస్వతి, శ్రీనివాసరావు, అర్జున్, రామచంద్రారావు, ఎంపీడీవోలు కే బాపన్న దొర, ప్రసాద్, ఎస్ శ్రీనివాసరావు, యాదగిరిశ్వరరావు, లక్ష్మణరావు, కుమార్,సాల్మన్ రాజ్, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు గంభూసియా చేపల విడుదల



ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల



దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికున్‌గునియా వంటి వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా ఆరోగ్య శాఖ అధికారులు గంభూసియా (మస్కిటో ఫిష్) చేపలను వివిధ గ్రామాల్లో విడుదల చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎల్లవరం, దుప్పులపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అడ్డతీగల, దొక్కపాలెం, అనిగేరు, గవరయ్యపేట, కొనాలోవ, తుంగమడుగుల, రాయపల్లి, చ.వి.కర్ర, అనుకలపాలెం, డి.రామవరం, జాజిపాలెం, చిన్నమునకనగెడ్డ గ్రామాల్లో చేపలు లేని నీటి వనరులను గుర్తించి గంభూసియా చేపలను వదిలారు.గంభూసియా చేపలు నీటిలో ఉండే దోమల లార్వాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా దోమల సంతానోత్పత్తిని సహజసిద్ధంగా తగ్గిస్తాయి. ముఖ్యంగా చెరువులు, బావులు, కాలువలు, ఇతర నీటి నిల్వల్లో వీటిని విడుదల చేయడం వల్ల దోమల నియంత్రణకు తోడ్పడుతుందని వైద్య సిబ్బంది తెలిపారు. రసాయన మందుల వినియోగాన్ని తగ్గించడంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు ఈ విధానం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్ దేవి ప్రియాంక, డాక్టర్ శివారెడ్డి, సబ్ యూనిట్ అధికారి కె.లక్ష్మణరావు, టెక్నికల్ సూపర్‌వైజర్ పి. శ్రీనివాసరావు, ఎంపీహెచ్ ఈఓ జి. నాగేంద్రుడు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఎంపీహెచ్‌ఏ (పురుషులు, మహిళలు), ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.ప్రజలకు ఆరోగ్య శాఖ సూచన: ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, నీటి తొట్టెలు, డ్రమ్ములను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, దోమల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు.

చింతూరులో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం.. 12 ఎంపీటీసీలకు 10 కైవసం!

- జడ్పీటీసీ స్థానంలోనూ ఘన విజయం.. ఎంపీపీగా చిచ్చడి మురళి, జడ్పీటీసీగా సవలం అమల
- గతంలో ఎంపీపీగా అమల.. జడ్పీటీసీగా మురళి.. ఈసారి ఇద్దరి పదవుల మార్పుతో ఆసక్తికర రాజకీయం!

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.





చింతూరు మండలంలో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయభేరి మోగించింది. ప్రత్యర్థులకు గట్టి పోటీనిస్తూ మండల రాజకీయాల్లో తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది. మండలంలోని జడ్పీటీసీ స్థానాన్ని కైవసం చేసుకోవడంతో పాటు, మొత్తం 12 ఎంపీటీసీ స్థానాలకు గాను 10 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఫలితాలతో మండలంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. జడ్పీటీసీ స్థానానికి వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసిన సవలం అమల విజయం సాధించగా, మండలంలోని ఎంపీటీసీ స్థానాల్లో మెజారిటీ స్థానాలను ఆ పార్టీ అభ్యర్థులు దక్కించుకున్నారు. ఈ విజయంతో చింతూరు మండల పరిషత్‌పై వైఎస్సార్‌సీపీ పట్టు మరింత బలపడింది. ఎంపీపీగా చిచ్చడి మురళి ఎన్నికయ్యే అవకాశం ఉండటంతో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నాయి.

పదవులు మారాయి.. రాజకీయ అనుభవం మాత్రం అదే!

ఈ ఎన్నికల్లో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న ఆసక్తికరమైన అంశం చిచ్చడి మురళి, సవలం అమల పదవుల మార్పు. గతంలో జరిగిన ఎన్నికల్లో చిచ్చడి మురళి జడ్పీటీసీగా ఎన్నికై బాధ్యతలు నిర్వహించగా, సవలం అమల ఎంపీపీగా పనిచేశారు. అయితే ఈసారి రాజకీయ సమీకరణాలు మారడంతో ఇద్దరూ తమ పదవులను మార్చుకున్నట్లయింది. గతంలో జడ్పీటీసీగా పనిచేసిన చిచ్చడి మురళి ఇప్పుడు ఎంపీపీ పీఠాన్ని అధిరోహించేందుకు సిద్ధమవుతుండగా, గతంలో ఎంపీపీగా పనిచేసిన సవలం అమల ఈసారి జడ్పీటీసీగా ఎన్నికయ్యారు. దీంతో గతంలో ఒకరు నిర్వహించిన పదవిని మరొకరు చేపట్టినట్లుగా, ఈసారి ఇద్దరి రాజకీయ ప్రయాణంలో కొత్త మలుపు చోటుచేసుకుంది.

మండలంలో సరదా చర్చ.. పేర్లు అవే, పదవులు మారాయే!

ఈ పరిణామంపై మండల ప్రజల్లో ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. గతంలో మురళి జడ్పీటీసీ.. అమల ఎంపీపీగా ఉంటే, ఇప్పుడు మురళి ఎంపీపీ.. అమల జడ్పీటీసీ అయ్యారంటూ ప్రజలు సరదాగా వ్యాఖ్యానిస్తున్నారు. పేర్లు, వ్యక్తులు అవే అయినా పదవులు మాత్రం మారిపోయాయని చమత్కరిస్తున్నారు. ఎన్నికల ఫలితాల్లో ఈ ఆసక్తికరమైన మార్పు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పటికే స్థానిక సంస్థల్లో పనిచేసిన అనుభవం ఉన్న ఈ ఇద్దరు నేతలు ఈసారి కొత్త బాధ్యతలు చేపట్టనుండటంతో మండల అభివృద్ధిపై ప్రజల్లో ఆశలు నెలకొన్నాయి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలు కోరుకుంటున్నారు. మొత్తంగా చింతూరు మండలంలో వైఎస్సార్‌సీపీ సాధించిన ఈ విజయం ఆ పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహాన్ని అందించగా, పదవులు మార్చుకున్న మురళి, అమలల రాజకీయ ప్రయాణం మాత్రం ఈ ఎన్నికల్లో ప్రత్యేక చర్చనీయాంశంగా మారింది. గత అనుభవాన్ని రంగరించి ఇద్దరూ మండల అభివృద్ధికి ఎంత వరకు కృషి చేస్తారో వేచి చూడాలి.

ఓటు హక్కుపై యువతలో చైతన్యం కల్పించేందుకు ఈఎల్‌సీ పోటీలు

స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహణ

ప్రజాభూమి ప్రతినిధి-రంపచోడవరం

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాధాన్యత, ఎన్నికల ప్రక్రియపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడంతో పాటు, యువతను ఎన్నికల ప్రక్రియలో చురుకుగా భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో జిల్లాలో స్వీప్, ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమాల్లో భాగంగా పోలవరం జిల్లాలోని రంపచోడవరం మండల పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రంపచోడవరంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ పోటీల ద్వారా విద్యార్థులకు ఓటు హక్కు విలువ, ప్రజాస్వామ్యంలో పౌరుల బాధ్యతలు, స్వేచ్ఛాయుతమైన మరియు నిష్పక్షపాత ఎన్నికల ప్రాముఖ్యత, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని పోలవరం జిల్లా ఎన్నికల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించగా, ఎస్‌డీసీ, కేఆర్ఆర్‌సీ అధికారి పాఠశాలను సందర్శించి స్వీప్ కార్యక్రమాలు,



ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీలను పరిశీలించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించడం అభినందనీయమని పేర్కొన్నారు.విద్యార్థి దశ నుంచే ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగబద్ధమైన బాధ్యతలు, ఓటు హక్కు వినియోగంపై సరైన అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల ప్రజలకు కూడా ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేస్తూ చైతన్యం కల్పించాలని సూచించారు.జిల్లాలో స్వీప్, ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావడం, ఎన్నికల సమయంలో తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకునేలా అవగాహన కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.